www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
నిజామాబాద్ సిటీ*
సంపుటి: 14
సంచిక: 28
పేజీలు: 16 + 20 + 32
పేజీల ఆదివారం అనుబంధం
ఆదివారం | 6-8-2017
వెల: రూ. 6.00
Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tanuku | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai

శ్రీహేవళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి రా. 10.29 తదుపరి పూర్ణిమ; నక్షత్రం: ఉత్తరాషాఢ రా. 1.46 తదుపరి శ్రవణం; వర్జ్యం: ఉ. 8.19-10.04; దుర్ముహూర్తం: సా. 5.01-5.52; అమృతఘడియలు: రా. 6.48-8.32; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.00; సూర్యాస్తమయం: 6.43

తుంగభద్ర తీరం.. బతుకు ఛిద్రం



జోగులాంబ జిల్లాలో కిడ్నీ కాలేయ వ్యాధులు

జీవచ్ఛవాలుగా బాధితులు.. ఆస్తుల్ని తెగనమ్ముకొని వైద్యం

ఊరికి 30 మంది బలి 2

రేపటికల్లా అల్పపీడనం

రెండు రాష్ట్రాలకూ వర్షసూచన 2

తిరుపతి లడ్డుకు **214 ఏళ్లు** 5



ఖాళీ హాల్ అనుకొని సారు తలుపు తీసుకుని లోపలికి వచ్చారు...

ఒక్కసారే అందరూ లేచి చప్పట్లు కొట్టి ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పారు... 5

నేడు జయశంకర్ జయంతి



నేడు స్నేహితుల దినోత్సవం

ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి..

స్నేహం విలువ వారికి తెలుసు

అందరూ కలిస్తే రచ్చరచ్చే

సినీ యంగ్ ఫ్రెండ్స్‌తో చిట్ చాట్ నవ్వులో

• చైనా ప్రొడక్ట్ చిత్తు

జుల్ఫికర్‌కు విజేందర్ పంచ్

బాక్సర్ విజేందర్‌సింగ్ దెబ్బకు చైనా గోడ బద్దలైంది. చైనా ఉత్పత్తుల్లో నాణ్యత ఉండదని బౌట్‌కు ముందుగానే తీసిపారేసిన విజేందర్.. రింగ్‌లో జుల్ఫికర్ మైమైటియాలికి భారత పంచ్ పవర్ రుచి చూపించాడు. దీంతో డబ్ల్యూబీవో ఆసియా పసిఫిక్ టైటిల్‌తోపాటు జుల్ఫికర్ పణంగా పెట్టిన డబ్ల్యూబీవో ఓరియెంటల్ సూపర్ మిడిల్ వెయిట్ టైటిల్ కూడా మన బాక్సర్ సొంతమైంది. కానీ, జుల్ఫికర్ టైటిల్‌ను విజేందర్ ఆయనకే తిరిగి ఇచ్చేశాడు. 'చైనా మా బోర్డర్‌కు రావద్దు. ఇది శాంతి కోసమే..' అనే సందేశాన్ని పంపాడు. 15



• విజయానందం



వెంకయ్య జయభేరి

13వ ఉపరాష్ట్రపతిగా తెలుగు తేజం

గోపాలకృష్ణ గాంధీపై 272 ఓట్ల తేడాతో గెలుపు

జేడీయూ, బీజేడీ వేయకున్నా పెరిగిన ఓట్లు

అభినందించిన మోదీ, ఎంపీలు

నేడు తిరుమలకు వెంకయ్య 11న ప్రమాణ స్వీకారం

న్యూఢిల్లీ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): భారత పదమూడో ఉప రాష్ట్రపతిగా ఎన్‌డీఏ అభ్యర్థి వెంకయ్య నాయుడు ఎన్నికయ్యారు. యూపీఏ అభ్యర్థి గోపాలకృష్ణ గాంధీపై 272 ఓట్ల తేడాతో ఘన విజయం సాధించారు. తెలుగు బిడ్డ వెంకయ్య నాయుడుకి అనుకూలంగా 516 ఓట్లు నమోదు కాగా, గోపాలకృష్ణ గాంధీకి కేవలం 244

మిగతా 14వ పేజీలో...

మా ప్రభుత్వ పథకాలపై అంత పన్నా?

జీఎస్టీ ఏకపక్షమా?.. మా వినతులు వినరా?

కేసీఆర్ భగ్గు

కేంద్ర సర్కారు తీరుపై ఆగ్రహం

సంక్షేమ పథకాలపై పన్నేంటి!?.. జీఎస్టీకి ముందటి ప్రాజెక్టులకూ 12 శాతమా?

తెలంగాణపైనే 19 వేల కోట్ల భారం.. అన్ని రాష్ట్రాలకూ ఇది తీవ్ర సమస్యే

పెరిగిన ఖర్చుకు బడ్జెట్ కేటాయింపు కష్టం.. జాతీయ సమస్యగా పరిగణించండి

లేదంటే న్యాయ పోరాటం తప్పదు.. ప్రధానికి నేడు సీఎం లేఖ.. 11న భేటీ

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): "సాగునీరు.. తాగునీరు.. రోడ్లు వంటి ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టే పనులపై జీఎస్టీ విధించడం అన్యాయం. ప్రభుత్వ కాంట్రాక్టు పనులపై జీఎస్టీ ఎత్తేయండి. కనీసం 5 శాతానికి తగ్గించండి. ఒక్క తెలంగాణకు మాత్రమే కాదు.. అన్ని రాష్ట్రాలకూ ఇది భారమే" అంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ సాక్షాత్తూ ప్రధాన మంత్రి మోదీకి విన్నవించారు. టీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంటులో నినదించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన మంత్రులతో కలిసి టీఆర్ఎస్ మంత్రులు జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఒత్తిడి చేశారు. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి అనేకసార్లు మొర పెట్టుకున్నారు. అయినా, కేంద్రం తాను పట్టిన కుందేటికి మూడే కాళ్లు అన్నట్టు వ్యవహరించింది. శనివారం ఢిల్లీలో జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో కాంట్రాక్టు పనులపై పన్నును 18 నుంచి 12 శాతానికే పరిమితం చేసింది. తప్పితే, రాష్ట్రాల వినతులను పట్టించుకోలేదు. ఈ పరిణామం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆగ్రహానికి గురి చేసింది. కౌన్సిల్ నిర్ణయంపై ఆయన తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. జీఎస్టీ విషయంలో

మిగతా 6వ పేజీలో...





కౌంట్ డౌన్!

నిన్నటిదాకా గాండ్రించిన పులే.. అకస్మాత్తుగా తోక ముడుస్తుంది!

ఉవ్వెత్తున ఎగిసే అలే.. ఉన్నట్టుండి విరిగిపడిన కెరటమవుతుంది!!

పగ్గాలు తెంచుకున్న గుర్రంలా.. పరుగులు పెట్టాల్సిన కోరిక నేలచూపులు చూస్తుంది.

పడగ్గది.. పరీక్ష హాల్‌లా కనిపిస్తుంది.

తాళి కట్టిన భార్యని తాకాలన్నా భయంగా అనిపిస్తుంది. 5

సండే స్పెషల్

ఉత్సాహం ఉరకలెత్తాల్సిన వయసు ఉసూరుమంటుంటుంది. ఉత్తేజం పొంగులు వారాల్సిన పడగ్గదిలో నిస్తేజం ఆవరిస్తుంది. శక్తి ఉండదు.. శృంగారం పట్ల అనురక్తి అసలే ఉండదు!! 'నాకే ఎందుకిలా అయింది' అనే ప్రశ్న తొలుస్తుంటుంది. వైద్యుల్ని కలవడానికి సిగ్గు అడ్డొస్తుంటుంది!! ..ఇటీవలికాలంలో చాలామంది యువకులకు ఎదురవుతున్న సమస్య ఇది! దాంపత్య సరిగమల్లో తేలియాడాల్సిన యువత.. జీవనశైలి లోపాలతో, పని ఒత్తిడితో కొని తెచ్చుకుంటున్న సమస్య!!



పొన్నం ప్రభాకర్ నిరాహార దీక్షకు మద్దతుగా కూర్చున్న సీఎల్పీ నేత జానారెడ్డి, కాంగ్రెస్ నాయకులు

హామీల అమలులో కేసీఆర్ విఫలం

టీఆర్ఎస్ సర్కారును ప్రజలు నిలదీయాలి 6

ఉద్యమానికి ఊపు తెచ్చింది కాంగ్రెస్సే: జానా

మెడికల్ కాలేజీ కోసం పొన్నం నిరవధిక నిరశన 16

భారత్‌పై దాడి చేస్తాం: చైనా

సచివాలయానికి రారేం?

నెలల తరబడి మొహం చాటేస్తున్న మంత్రులు

నియోజకవర్గాల్లో కార్యక్రమాలకే పరిమితం 5

విజ్ఞప్తులు స్వీకరించేవారే లేక ప్రజల్లో నిరాశ


పంచాయతీల్లో జాయింట్ 'చెక్' పవర్

సర్పంచ్‌తోపాటు కార్యదర్శి సంతకం తప్పనిసరి 6



చెల్లి పెళ్లి కోసం కారు దొంగిలించాడు!

సూర్యాపేట, ఆగస్టు 5: ఈడొచ్చిన చెల్లికి పెళ్లి చేయాలని అడ్డదారులు తొక్కాడో అన్న. చేతిలో పైసా లేదు.. ఎక్కడా చిల్లి గవ్వ దొరకలేదు. దీంతో పక్కా ప్రణాళికతో కారు దొంగిలించాడు. అయితే, ప్లాన్ బెడిసి కొట్టి జైల్లో ఊచలు లెక్కబెడుతున్నాడు. కృష్ణా జిల్లా ఘంటసాల మండలం శ్రీకాకుళంకు చెందిన గోపాలం అవినాశ్ జూన్ 28 రాత్రి హైదరాబాద్‌లోని ఏషియన్ ట్రావెల్స్ ద్వారా రాజమండ్రి వెళ్లేందుకు ఇన్నోవా కారును అద్దెకు మాట్లాడుకుని బయలుదేరాడు. మరుసటిరోజు తెల్లవారు జామున సూర్యాపేట వద్దకు రాగానే.. కాసేపు ఆగాలని, తన మిత్రులు వస్తారని డ్రైవర్ ఆరీఫొద్దీన్‌తో చెప్పాడు. సరేనన్న డ్రైవర్.. కారులోనే నిద్రలోకి జారుకున్నాడు. దీంతో అవినాశ్ పక్కనున్న బండరాయితో డ్రైవర్ ముఖంపై దాడిచేసి కారుతో పరారయ్యాడు. డ్రైవర్ సూర్యాపేట పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు దర్యాప్తు ప్రారంభించారు. కాల్‌డేటా ఆధారంగా పోలీసులు శనివారం తెల్లవారుజామున నిందితుడిని అదుపులోకి తీసుకుని, కారును స్వాధీనం చేసుకున్నారు.



గోపాల్‌రెడ్డి

ఖగోళ జ్యోతిష్యం అబద్ధమని నిరూపిస్తే 25లక్షల బహుమతి

బర్కత్‌పుర/హైదరాబాద్, ఆగస్టు 5: ఖగోళ జ్యోతిష్య శాస్త్రం అబద్ధమని నిరూపిస్తే రూ.25లక్షల బహుమతి ఇస్తానని నవీన ఖగోళశాస్త్ర జ్యోతిష్య నిపుణుడు మన్నెం గోపాల్‌రెడ్డి సవాల్ విసిరారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ.. ఖగోళంలోని గ్రహణాల ఆధారంగా రూపొందించిందే ఖగోళ జ్యోతిష్య శాస్త్రమని, ఓయూ ఖగోళశాస్త్ర విభాగం కూడా దీన్ని ఆమోదించిందన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న జ్యోతిష్యం రాజుల కాలం నాటిదని, దీని పేరుతో కొందరు ప్రజల్ని మోసం చేస్తున్నారని తెలిపారు. ఖగోళ జ్యోతిష్య శాస్త్రంపై అవగాహన కల్పిస్తూ, యువతకు ఉచిత శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. ఖగోళ జ్యోతిష్య శాస్త్రంపై చర్చకు రావాలనుకుంటే 9912492171 నంబరుకు ఫోన్ చేయాలని గోపాల్ రెడ్డి తెలిపారు.



మూత్రం.. ఆత్రం.. ఓ పెద్ద క్యూ

మూత్రం వస్తే.. ఆపుకోవడం ఎంత కష్టం? మరి.. ఈ పిల్లలను చూడండి. ఆ అవస్థను పంటిబిగువున భరిస్తూ తమ వంతు ఎప్పుడొస్తుందా? అని ఎదురుచూస్తున్నారు. వరంగల్ జిల్లా గురజాల ప్రాథమిక పాఠశాలలో శనివారం కనిపించిందీ దృశ్యం. ఇక్కడ 300 దాకా ఉన్న విద్యార్థుల కోసం ఒక్కటే టాయిలెట్ ఉంది. లఘుశంక తీర్చుకునేందుకు 4, 5 తరగతుల విద్యార్థులను టీచర్లు బయటకు వదులుతున్నారు. దిగువ తరగతుల చిన్నారులను బయటకు వదిలితే ప్రమాదమని వారిని బ్రేక్‌లో టాయిలెట్ ముందు ఇలా క్యూ కట్టిస్తున్నారు.

తుంగభద్ర తీరం.. బతుకు ఛిద్రం

జోగులాంబ జిల్లాలో కిడ్నీ, కాలేయ వ్యాధులు .. జీవచ్ఛవాలుగా బాధితులు.. ఆస్తులను తెగనమ్ముకొని వైద్యం

ఆమె పేరు జయమ్మ.. గృహిణి. నడవలేదు. కనీసం లేచి నిలబడనూ లేదు. ఏడేళ్లుగా ఆమె కిడ్నీ వ్యాధితో మంచంపట్టింది. ఆమెకు ప్రేమ్ (30), లక్ష్మణ్ (25) కుమారులు. వృద్ధురాలైన తల్లికి ఆసరాగా ఉండాల్సిన వయసులో ఇద్దరికీ మూత్ర పిండాల వ్యాధి సోకింది. జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం వెంకటాపూర్‌లో ఇలాంటివి ఎన్నో కేసులు.

ఆయన ఓ ఆర్‌ఎంపీ. పేరు రాజశేఖర్‌రెడ్డి. ఊరు అయిజ మండల కేంద్రం. ఆయన కూతురు చైతన్యకు ఇటీవలే పెళ్లి కుదిరింది. ఉన్నపళంగా అస్వస్థతకు గురవడంతో ఆమెకు వైద్య పరీక్షలు చేయించారు. అమ్మాయికి లివర్ చెడిపోయిందని తేలింది. దీంతో ఖరారైన పెళ్లి కాస్తా రద్దయింది. ఇలా ఇక్కడ కాలేయం చెడిపోయి మంచం పట్టినవారు కొందరైతే.. మృత్యువాత పడుతున్నవారు ఇంకొందరు.

- శ్మశానాలను తలపిస్తున్న ఆ మూడు గ్రామాలు
- మాయదారి రోగాలతో ఊరికి 30 మంది చొప్పున బలి
- కన్నెత్తిచూడని అధికారులు.. జోగులాంబ జిల్లాలో దారుణం
- రాష్ట్రంలో పెరుగుతున్న కిడ్నీ వ్యాధిగ్రస్తులు

గద్వాల, హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వృద్ధులే కాదు.. రాయి తిన్నా అరిగించుకోగలిగేంత శక్తి, కొండలను పిండిచేసే సామర్థ్యం ఉండి ఎప్పుడో తప్ప మాత్ర వేసుకొని ఎరుగని యువకులు సైతం మూత్రపిండాలు, కాలేయ వ్యాధులకు గురవుతున్నారు. నిన్నటిదాకా పూర్తి ఆరోగ్యవంతులుగా ఉన్న తమకు ఈ మాయ రోగాలేమిటని వారు వాపోతున్నారు. పొలం పుట్రా తెగనమ్ముకొని చికిత్స చేసుకుంటున్నవారు కొందరైతే.. రోజువారీ కష్టంతో నెట్టుకొచ్చే బడుగులు దేవుడుపైనే భారం వేస్తూ బతుకీడుస్తున్నారు. ఈవిధంగా జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండల కేంద్రంతోపాటు వెంకటాపురం, యాపదిన్నె గ్రామాల్లో ప్రజలు కిడ్నీ, లీవర్ వ్యాధులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు ఏకంగా రెండు దశాబ్దాలుగా ఈ గ్రామాలను పట్టిపీడిస్తున్నాయీ రోగాలు. ఈ రోగాలతో గ్రామానికి 20 నుంచి 30 మంది చొప్పున మృత్యువాతపడ్డారు. ఏ ఇంటికి వెళ్లినా.. కిడ్నీ, లివర్ వ్యాధులతో సతమతమవుతున్న రోగులే! కుటుంబ పెద్దను కోల్పోయి అనాథలైన భార్యాపిల్లల వెతలు కన్నీరుపెట్టిస్తాయి. యాపదిన్నె గ్రామంలో గత నెలలో కరువ భీమన్న, ఆయన భార్య చిట్టమ్మ కిడ్నీ వ్యాధితో మృత్యువాత పడ్డారు. పెద్ద అంజనేయులు అనే వ్యక్తితోపాటు మరో 50 మందికిపైగా కీళ్లవాపుల వ్యాధితో బాధపడుతున్నారు. వెంకటాపురం ఎస్సీ కాలనీలో మాదిగ చిన్న అల్లప్ప కిడ్నీవాధితో బాధ పడుతున్నాడు. గ్రామానికి చెందిన మోహన్ అనే వ్యక్తి నిరుడు కిడ్నీ వ్యాధితో మృత్యువాత పడ్డాడు. అయిజలో రాజశేఖర్‌రెడ్డి అనే ఆర్‌ఎంపీ డాక్టర్ కూతురు చైతన్యకు లీవర్ వ్యాధిని నయం చేయించేందుకు రూ.49 లక్షలు వెచ్చించాడు. ఈ గ్రామంలో కిడ్నీ వ్యాధులకన్నా కాలేయం చెడిపోయి మరణించినవారే ఎక్కువగా ఉన్నారు.



కిడ్నీ వ్యాధికి నెలవైన యాపదిన్నె గ్రామం; కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న చిన్న అల్లప్ప

ఏటా 2 వేల మంది కిడ్నీ రోగులు

రాష్ట్రంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. ఏటా రెండు వేల మంది దాకా కొత్త కేసులు నమోదవుతున్నాయి. అలాగే ఏడాదికి సుమారు 800 మంది కిడ్నీ సమస్యలతో మృత్యువాత పడుతున్నారు. కిడ్నీ రోగుల చికిత్స కోసం ఏడాదికి ప్రభుత్వం సుమారు రూ. 160 కోట్లు వెచ్చిస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం 10 వేల మంది కిడ్నీలు చెడిపోయి డయాలసిస్‌తో నెట్టుకొస్తున్నారు. ఆరోగ్య శ్రీ కాకుండా ప్రైవేట్ రంగంలో డయాలసిస్ చేయించుకుంటున్న వారు మరో 6 వేల మంది దాకా ఉండవచ్చని అంచనా. ఆరోగ్య శ్రీ పథకంలోనే ఏటా సుమారు వెయ్యి మంది కొత్తగా కిడ్నీ సమస్యలతో డయాలసిస్ కోసం తమ పేర్లను నమోదు చేయించుకుంటున్నారు. రాష్ట్రంలో ఏటా 250 నుంచి 300 దాకా మూత్ర పిండాల మార్పిడి శస్త్రచికిత్సలు చేస్తున్నారు. వీటిలో అత్యధికంగా నిమ్స్‌లోనే జరుగుతున్నాయి.

కల్తీ ఆహార పదార్థాలతోనే..



"పండ్లపై ఉన్న రసాయనాల వల్ల మా కూతురుకి లివర్ వ్యాధి వచ్చిందని వైద్యులు చెప్పారు. కలుషితమైన నీటితో పాటు కల్తీ ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల కిడ్నీ, లివర్ వ్యాధులు వస్తున్నాయి. వెంకటాపురం, యాపదిన్నె, అయిజలో ప్రత్యేక వైద్య బృందాలతో సర్వే చేయించి కిడ్నీ, లివర్ వ్యాధులకు కారణాలు తెలుసుకోవాలి" **–రాజశేఖర్‌రెడ్డి, ఆర్‌ఎంపీ, వైద్యుడు, అయిజ**



ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	22.6	31.3
సంగారెడ్డి	24.0	29.0
హైదరాబాద్	24.3	32.2
వరంగల్	25.0	29.0
రామగుండం	25.6	31.4
నల్లగొండ	26.0	34.5



చైనా వస్తువులను నిషేధించండి

పాకిస్థాన్ ఉగ్రవాదులకు చైనా బహిరంగంగా మద్దతునిస్తోంది. ఈ విషయంలో పాకిస్థాన్‌కు తగిన గుణపాఠం చెప్పాలంటే పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను మనం కలిపేసుకోవాలి. తర్వాత ప్రతి భారతీయుడూ చైనా వస్తువులను నిషేధించాలి. అవి ఫోన్లైనా, కార్లు అయినా.. బొమ్మలైనా .. అన్నింటిని నిషేధించాలి.

- యోగా గురు రామ్‌దేవ్ బాబా



ఆ ఆరుగురూ మీ బంధువులా?

యూపీఏ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు అనుమతితో ఐఎన్‌ఎక్స్ మీడియా సంస్థలో మారిషస్‌కు చెందిన కొందరు పెట్టుబడి పెట్టారు. ఈ విషయంలో బోర్డు చర్య తప్పయితే, ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఆరుగురు కార్యదర్శుల వైఖరి కూడా తప్పుగానే పరిగణించాలి. కానీ, సీబీఐ వారిని ఎందుకు వదిలివేసింది? వారిపై ఎందుకు కేసులు నమోదు చేయలేదు? ఈ ఆరుగురు కార్యదర్శులు నేరారోపణలకు అతీతులా? లేక మీ చుట్టాలా?

- సీబీఐపై చిదంబరం ఫైర్

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.70.17	పాత ధర 61.19
కొత్త ధర రూ.70.41	కొత్త ధర 61.42
పెరుగుదల 24 పైసలు	పెరుగుదల 21 పైసలు

కేన్సర్ కణాల వృద్ధిని అడ్డుకునే ఔషధం



లాస్ ఏంజెలిస్, ఆగస్టు 5: కేన్సర్ కణాల వృద్ధిని అడ్డుకునే కొత్త ఔషధాన్ని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఆ యాంటీ కేన్సర్ ఏజెంట్ కణ వృద్ధిని పెంచే ఫాస్ఫోనోసిటైడ్ 3-కినాస్(పీఐ3కే) పనితీరును అడ్డుకుంటుందట. కణితులను ప్రోత్సహించే రెటినాయిడ్ ఎక్స్ రిసెప్టార్- ఆల్ఫా(టీఆర్ఎక్స్ఆర్ఏ) ప్రొటీన్‌ను కె-80003 ఔషధం గట్టిపరిచి పీఐ3కే ఉత్తేజిత మార్గాన్ని అడ్డుకుంటుందని అమెరికాలోని సాన్‌ఫర్డ్ బర్హమ్ ప్రెబీస్ మెడికల్ డిస్కవరీ ఇనిస్టిట్యూట్ పరిశోధకులు తెలిపారు.

పేగు వ్యాధికి ప్రొటీన్ డైట్‌తో ఉపశమనం



వాషింగ్టన్, ఆగస్టు 5: ప్రొటీన్లు ఎక్కువగా ఉండే గింజలు, గుడ్లు, మాంసం, చాకోలెట్స్, చీజ్ లాంటి ఆహారం తీసుకుంటే పేగు వ్యాధి నుంచి ఉపశమనం పొందవచ్చని తాజా అధ్యయనంలో తేలింది. పేగులోని బ్యాక్టీరియాకు ట్రిప్టోఫన్ అనే ప్రొటీన్ అత్యవసరమని, ఆ ప్రొటీన్ వీటిల్లో ఎక్కువగా ఉంటుందని అమెరికాలోని వాషింగ్టన్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ శాస్త్రవేత్తలు తెలిపారు. ఎలుకలపై చేసిన పరిశోధనల్లో ఈ విషయాలు వెల్లడయ్యాయన్నారు. ఎలుకల కడుపులోని పేగులో సహనాన్ని పెంచే రోగనిరోధక కణాలు లాక్టోబాసిల్లస్ రూటరీ బ్యాక్టీరియాను కలిగి ఉంటాయని వివరించారు.

జైలుకు దిష్టి తగిలింది

మంత్రించిన గుమ్మడికాయల ఏర్పాటు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 5: సాధారణంగా ఇంటికి దిష్టి తగలకుండా ఎవరైనా బూడిద గుమ్మడికాయ లేదా దిష్టిబొమ్మలను గుమ్మం వద్ద ఏర్పాటు చేస్తారు. ఇప్పుడు కరీంనగర్ జిల్లా జైలు అధికారులు దీనిని పాటిస్తున్నారు. తమ జైలుకు ఏదో దిష్టి తగిలిందన్న అనుమానంతో జైలు ఆవరణలో మూడుచోట్ల మంత్రించిన బూడిద గుమ్మడికాయలు, కొబ్బరికాయలను ఏర్పాటు చేశారు. వాటిని ఎర్రగుడ్డలో చుట్టి.. జైలు గుమ్మం, పెట్రోల్ బంక్ కార్యాలయంతోపాటు, ఒక విద్యుత్ స్థంభంపై కట్టారు. దాంతోపాటు దిష్టిని తొలగించే యంత్రాన్ని కూడా జైలు గుమ్మానికి కట్టారు. ఒక ప్రభుత్వ కార్యాలయం, అందులోనూ పోలీసుశాఖకు చెందిన జైలు విభాగంలో ఇలాంటి తంతు జరగటం చర్చనీయాంశమైంది. ఇటీవలే కరీంనగర్ జిల్లా జైలు జాతీయస్థాయిలో వార్తల్లోకెక్కింది. నేరెళ్ల ఘటనలో అరెస్టయిన బాధిత ఖైదీలు ఈ జైలులో 25 రోజులు ఉన్నారు. దీంతో పరామర్శకోసం వివిధ పార్టీల ముఖ్యనేతలు, జాతీయస్థాయి నేతలు కూడా జైలు వద్దకు వచ్చారు. దీంతో అందరి దృష్టి జైలుపై పడి దిష్టి తగిలిందని జైలు అధికారులు భావిస్తున్నారు. తమపై బదిలీ వేటు పడుతుందేమోనన్న అనుమానంతో ఈ ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. అయితే వారు మాత్రం.. ఇటీవలే జైలు ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేశామని, కొత్తగా వ్యాపారం ప్రారంభించడంతో పూజారి చెప్పినట్లుగా కొబ్బరికాయలను ఎర్రగుడ్డలో కట్టి మూడుచోట్ల ఏర్పాటు చేశామని చెప్పారు.



కరీంనగర్ జిల్లా కారాగారానికి దిష్టి తగలకుండా ఎర్రటి వస్త్రంలో కట్టిన గుమ్మడికాయ

రాఖీ కట్టండి.. హెల్మెట్ బహూకరించండి

- సిస్టర్స్4చేంజ్‌లో జాగృతి మహిళలు
- గడ్కరీ, సెహ్వాగ్ మద్దతు

జగిత్యాల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): "రాఖీ కట్టండి.. హెల్మెట్ బహూకరించండి.. చెల్లెమ్మలకు అన్నయ్యలు రక్ష.. అన్నయ్యలకు హెల్మెట్ రక్ష" అనే నినాదంతో జగిత్యాలలో తెలంగాణ జాగృతి మహిళా విభాగం నాయకులు సిస్టర్స్4చేంజ్ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ శరత్‌కు జాగృతి మహిళా విభాగం జిల్లా కన్వీనర్ జమున రాఖీ కట్టి హెల్మెట్ బహూకరించారు. ఎంపీ కవిత చేపట్టిన ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మద్దతు ప్రకటించారు. ఇంత మంచి కార్యక్రమం చేపట్టినందుకు ఎంపీ కవితకు కృతజ్ఞతలు" అని గడ్కరీ ట్వీట్ చేశారు. ప్రముఖ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ కూడా మద్దతు ప్రకటించారు.



'సిస్టర్స్ ఫర్ ఛేంజ్' ర్యాలీలో ఎంపీ కవిత మాస్క్‌లను ధరించి హెల్మెట్‌లను ప్రదర్శిస్తున్న జాహ్నవి కళాశాల విద్యార్థులు

రేపే రాఖీ పండుగ



భారత జవాన్ల కోసం యూపీలోని మొరాదాబాద్ జిల్లాలో ఓ స్కూల్ విద్యార్థినులు తయారు చేసిన 100 అడుగుల రాఖీ

లఖ్‌నవ్, చండీగఢ్, ఆగస్టు 5: రాఖీ.. రక్షా బంధన్.. రాఖీ పౌర్ణమి.. పేరేదైనా ప్రేమ ఒక్కటే. అన్నా-చెల్లి, అక్కా-తమ్ముడి అనుబంధానికి ప్రతీక. ప్రేమానురాగాలకు సూచిక. 'రాఖీ' పండుగ సోమవారమే. ఈ బంధం ఈ ఏడాది ఎల్లలు దాటి ఖండాంతరాలకు వ్యాపించింది. ట్రిపుల్ తలాక్ వివాదంలో తమకు న్యాయం చేసినందుకు 40 మంది ముస్లిం మహిళలు ప్రధాని మోదీకి, యూపీ సీఎం ఆదిత్యనాథ్‌కు రాఖీలు పంపిస్తే.. భారత్-అమెరికా సంబంధాలు మరింత బలపడాలని హరియాణాలోని 'ట్రంప్' గ్రామానికి చెందిన మహిళలు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు 1001 రాఖీలు పంపించారు.

లొద్దిగూడకు నిమ్స్ బృందం

- మూత్రపిండాల వ్యాధిపై గ్రామస్థులకు వైద్య పరీక్షలు
- అనుమానిత 20 మందిలో 19 మందికి వ్యాధి నిర్ధారణ



లొద్దిగూడలో అల్ట్రాసౌండ్ స్కానింగ్‌తో వ్యాధిగ్రస్తులను పరీక్షిస్తున్న నిమ్స్ డాక్టర్

ఆసిఫాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ వ్యాధులతో లొద్దిగూడ తల్లడిల్లుతుండడంపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన వరుస కథనాలకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. వైద్య ఆరోగ్యశాఖ ఓఎస్‌డీగా పని చేస్తున్న నిమ్స్ ఆస్పత్రి నెఫ్రాలజీ స్పెషలిస్టు డాక్టర్ గంగాధర్ నేతృత్వంలో ఎనిమిది మంది వైద్యుల బృందాన్ని మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి లొద్దిగూడకు పంపించారు. నిమ్స్, రిమ్స్ ఆస్పత్రులకు చెందిన వైద్య బృందాలు శనివారం సాయంత్రం కుమరం భీం జిల్లా లింగాపూర్ మండలం లొద్దిగూడకు చేరుకున్నాయి. గ్రామంలో ఏర్పాటు చేసిన అల్ట్రాసౌండ్ స్కానింగ్, రేడియాలజీ, ఇతర పరికరాలతో అనుమానిత వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. దాంతోపాటు మూత్ర, రక్త పరీక్షలు నిర్వహించి శుక్రవారం తయారు చేసిన 20 మంది జాబితాలో 19 మందికి కిడ్నీ సంబంధిత వ్యాధులు ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. మిగిలిన గ్రామస్థులందరికీ రాత్రి ఎంత సమయమైనా పూర్తి స్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించి అనుమానిత కేసులపై నిర్ధారించుకుంటామని తెలిపారు. ఆ తరువాత ఎంత మందిని హైదరాబాద్‌కు తరలించాలనేది ఆదివారం మధ్యాహ్నానికల్లా నిర్ణయిస్తామని ఓఎస్‌డీ గంగాధర్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఇక శుక్రవారం 45 మందికి పరీక్షలు నిర్వహించి రక్తనమునాలు సేకరించగా, శనివారం మరో 43 మంది రక్త నమునాలను సేకరించారు. రోగుల నుంచి సేకరించిన నమునాలు పరీక్షించాక వ్యాధులు ప్రబలడానికి కారణాలపై ఓ నిర్ధారణకు వచ్చే వీలుందని చెబుతున్నారు.

మెరుగైన వైద్య సహాయం అందిస్తాం..

కుమరం భీం జిల్లా లొద్దిగూడ, వంజర సహా ఈ ప్రాంతంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఉట్నూర్, మంచిర్యాలలో డయాలసిస్ సెంటర్లు మంజూరు చేసిందని ఓఎస్డీ డాక్టర్ గంగాధర్ తెలిపారు. ఆసిఫాబాద్‌లోనూ 200 పడకల ఆస్పత్రి నిర్మాణంలో ఉన్నందున అక్కడ కూడా డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఈ మధ్య కాలంలో కిడ్నీ సంబంధిత వ్యాధులు అధికమవుతున్నాయని ఇందుకు కారణాలను అన్వేషించాల్సి ఉందని పేర్కొన్నారు. లొద్దిగూడతో పాటు వంజర, ఉట్నూర్ డివిజన్‌లో మరో రెండు గ్రామాల్లోనూ ఆది, సోమవారాల్లో పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఆదివారం ఉట్నూర్ డివిజన్ కేంద్రంలోని కుమరం భీం కాంప్లెక్సులో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

రేపటికల్లా అల్పపీడనం

- రెండు రాష్ట్రాలకు వర్షసూచన

విశాఖపట్నం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వచ్చే 24 గంటల్లో తెలుగు రాష్ట్రాల్లో పలు చోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈశాన్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం శనివారానికి వాయవ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉంది. దీని ప్రభావంతో ఆదివారంకల్లా అక్కడే అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని శాఖ పేర్కొంది. దీంతో కోస్తా, తెలంగాణలో సోమవారం నుంచి వర్షాలు కురుస్తాయని, అల్పపీడనం వాయవ్యంగా పయనించే క్రమంలో తెలంగాణలో వర్షాలు పెరుగుతాయన్నారు.

చరిత్రకారుడు హరి శివకుమార్ మృతి



వరంగల్ కల్చరల్, ఆగస్టు 5: ఓరుగల్లు చరిత్ర పరిశోధకుడు, ప్రముఖ సాహితీవేత్త, కేయూ తెలుగు శాఖ విశ్రాంత ఆచార్యుడు హరి శివకుమార్ శనివారం ఉదయం వరంగల్‌లోని స్వగృహంలో కన్నుమూశారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. 1942 ఏప్రిల్ 19, జన్మించిన ఆయన వరంగల్‌లో డిగ్రీ, ఉస్మానియాలో పీజీ పూర్తి చేశారు. కేతన రచనలపై ఓయూ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. కాకతీయ వర్సిటీలో అధ్యాపకుడిగా చేరి, 35 ఏళ్లపాటు ప్రొఫెసర్‌గా సేవలందించారు. మరుగున పడిన కాకతీయుల చరిత్రను వెలుగులోకి తీసుకురావడంలో విశేష కృషి చేశారు. భద్రకాళితోపాటు, రామప్ప, వేయి స్తంభాల గుడి, పద్మాక్షి ఆలయంపై గ్రంథాలు వెలువరించారు. కాకతీయ వైభవం పేరిట మరో గ్రంథాన్ని రచించారు.



వర్షాల కోసం కప్పతల్లి ఆట

మల్యాల, ఆగస్టు 5: వరుణదేవా కరుణించవా అంటూ జగిత్యాల జిల్లా మల్యాలలో శనివారం రైతు సంఘాల ఆధ్వర్యంలో కప్పతల్లి ఆట ఆడారు. కర్రకు కప్ప కట్టి ఊరేగింపుగా తీసుకు వెళ్తూ, దానిపై బిందెలతో నీళ్లు పోశారు. మహిళలు బిందెలు పెట్టి బతుకమ్మ ఆడారు. అనంతరం ఊరేగింపుగా వెళ్లి స్థానిక ఒర్రెగడ్డ హనుమాన్ ఆలయంలో స్వామి వారికి జలాభిషేకం చేశారు.

లోక కళ్యాణం కోసమే వరుణ యాగం

బీర్కూర్/ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 5: లోక కళ్యాణం కోసమే వరుణ యాగం నిర్వహించినట్లు మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం కామారెడ్డి జిల్లా బీర్కూర్ శివారులోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో ఆయన సతీసమేతంగా వరుణ యాగాన్ని నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా మావల మండలం కేఆర్‌కే కాలనీలో మంత్రి జోగు రామన్న మార్నింగ్ వాక్ చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేశారు.



వరుణయాగం నిర్వహిస్తున్న మంత్రి పోచారం దంపతులు



వర్షం కోసం వరదపాశం

ములుగు : వానలు సమృద్ధిగా కురవాలని వేడుకొంటూ జయశంకర్ జిల్లా ములుగు మండలం కొత్తూరు గ్రామస్థులు నర్సింహస్వామికి వరదపాశం పూజ చేశారు. గ్రామసమీపంలోని దేవునిగుట్టపై వెలిసిన నర్సింహస్వామికి ప్రతీయేటా శ్రావణమాసంలో పూజలు చేయడం ఆనవాయితీ. కాలం సరిగ్గా కాకుంటే వరదపాశంతో దేవున్ని వేడుకుంటారు.

మత సామరస్యానికి ప్రతీక..



మత సామరస్యానికి ప్రతీకగా రక్షా బంధన్‌లో భాగంగా శనివారం మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేటలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డికి, ఎమ్మెల్యే ఎస్ఆర్‌రెడ్డిలకు మున్సిపాలిటీ 5వ వార్డు టీఆర్ఎస్ కౌన్సిలర్ తరుణ్‌బీ రాఖీలు కట్టి సోదర భావాన్ని చాటారు. మత సామరస్యానికి ప్రతీకగా నిర్వహించిన ఈ కార్యక్రమంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. - నారాయణపేట

ప్రాజెక్టులను అడ్డుకుంటున్న ప్రతిపక్షాలను తరిమికొట్టాలి

- వైద్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి
- ఆర్టీసీని లాభాల బాట పట్టిస్తాం: మహేందర్‌రెడ్డి

మహబూబ్‌నగర్/బషీరాబాద్: రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను చేపడితే, కోర్టులు, గ్రీన్‌ట్రైబ్యునళ్లలో కేసులు వేస్తూ ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని, వారిని ప్రజలు తరిమికొట్టాలని మంత్రి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మహబూబ్‌నగర్, నారాయణపేట, జడ్చర్ల నియోజకవర్గాల్లో హరితహారం, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రాజెక్టులను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలకు సీఎం కేసీఆర్‌ని విమర్శించే అర్హత లేదని అన్నారు.



రాష్ట్రంలో మొట్టమొదటి సాగు నీటి ప్రాజెక్టు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని సీఎంమహబూబ్‌నగర్ జిల్లాకు ఇస్తే, దాన్ని ఆపడానికి పాలమూరు కాంగ్రెస్ నాయకులు ఎక్కడికక్కడ కేసులు వేస్తుంటే, మిగతా ప్రతిపక్షాలు వారికి సహకరిస్తున్నాయని అన్నారు. తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకుంటూ, ఇక్కడ నీళ్లపారకుండా చేసి, ఆంధ్రప్రదేశ్‌కు నీళ్ల తీసుకుపోవాలని కొందరు కాంగ్రెస్ నాయకులు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణానికి రైతులు స్వచ్ఛందంగా భూములిచ్చేందుకు ముందుకు వస్తుంటే, ప్రతిపక్షాలు ప్రజల్ని రెచ్చగొడుతూ అడ్డుకోవాలనిచూస్తున్నాయని ఆరోపించారు. ఆర్టీసీని లాభాల బాట పట్టించి ప్రయాణికులకు సేవలందించేందుకు రూ.1000కోట్ల బడ్జెట్‌ను కేటాయించినట్లు మంత్రి మహేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నీళ్లపల్లిలో విలేకరులతో మాట్లాడారు. 45 డిపోలకు గాను 16డిపోలు లాభాల బాటలో కొనసాగుతున్నాయన్నారు. 1300 గ్రామాలకు సక్రమంగా రోడ్లు లేక ఆర్టీసీ బస్సులను నడపడం లేదన్నారు. హైదరాబాద్ నుంచి ప్రతి జిల్లా కేంద్రానికి నాలుగులైన్ల రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు ముఖ్యమంత్రి చర్యలు చేపట్టారన్నారు. నష్టం వాటిల్లినా సరే ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు పోతున్నామన్నారు.

రాహుల్‌పై దాడిని మోదీ ఖండించాలి

- శాసన మండలి ఉపనేత పొంగులేటి సుధాకర్ రెడ్డి
- దేశంలో నియంత పాలన నడుస్తోంది: మల్లు రవి
- మోదీ, అమిత్‌షా దిష్టిబొమ్మల దహనం

హైదరాబాద్/ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఏఐసీసీ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ జరిగిన దాడికి ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంట్ సాక్షిగా ఖండించి విచారణకు ఆదేశించాలని శాసన మండలి ఉపనేత పొంగులేటి సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం అసెంబ్లీ ఆవరణలోని మీడియా పాయింట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నరేంద్ర మోదీ మార్క్ పాలనలో ఈ రకమైన దాడులు సహజమైపోయాయన్నారు. ఘటనపై సీబీఐతో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీపై దాడి జరిగిన తీరు చూస్తుంటే దేశంలో నియంత పాలన నడుస్తోందని అనిపిస్తోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. గాంధీ భవన్‌లో మాట్లాడుతూ ప్రధాని మోదీ అండ చూసుకునే ఆ పార్టీ కార్యకర్తలు ఈ దాడికి పాల్పడ్డారని అన్నారు. గుజరాత్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందనే భయంతోనే బీజేపీ నాయకులు రాహుల్ గాంధీపై దాడికి పాల్పడ్డారని మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ అని వాగ్దానం చేసి న ప్రధాని మోదీ హయాంలో దళితులు, ముస్లింలతోపాటు ప్రతిపక్ష నాయకులపై కూడా దాడులు జరుగుతున్నాయన్నారు. రాహుల్‌పై దాడిచేయడం పిరికి పందల చర్య అని అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సహనాన్ని బలహీనతగా భావించొద్దన్నారు. గాంధీభవన్ వద్ద సేవాదళ్ సెల్ ఛైర్మన్ కనుకుల జనార్దన్‌రెడ్డి నేతృత్వంలో కార్యకర్తలు మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. యూత్ కాంగ్రెస్ నేతలు బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించారు. రాహుల్ గాంధీపై జరిగిన దాడికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షానే కారణమని ఆరోపిస్తూ యూత్ కాంగ్రెస్ నాయకులు ఆదిలాబాద్‌లో బీజేపీ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు.ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు.



అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కుక్కల దాడిలో 30 మేకల మృత్యువాత

బాల్కొండ, ఆగస్టు 5 : నిజామాబాద్ జిల్లా బాల్కొండలో శనివారం కుక్కల దాడిలో 30 మేక పిల్లలు మృత్యువాత పడ్డాయి. బాధితుడు సిరికంటి గంగమల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం ఇంటివద్ద పాకలోని మేక పిల్లలపై శనివారం కుక్కల మంద దాడి చేసింది. అందులో వారం పది రోజుల వయసు గల 30 పిల్లలు మృత్యువాత పడ్డాయి.

అప్పులబాధతో ఇద్దరు రైతుల ఆత్మహత్య

నాంపల్లి/ఏటూరునాగారం: నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం గట్లమల్లేపల్లి గ్రామానికి చెందిన రైతు తిప్పని గోవర్ధన్‌రెడ్డి (45) తనకున్న నాలుగెకరాల భూమిలో పత్తి సాగుచేశాడు. సాగుకు పెట్టుబడుల కోసం రూ. 4 లక్షలు అప్పులు చేశాడు. మూడేళ్లగా ఆశించిన దిగుబడి రాకపోవడంతో అప్పులు తీరే మార్గంలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. జయశంకర్ జిల్లా ఏటూరునాగారం మండలం రామాలయం కాలనీకి చెందిన రైతు జాడి దుర్గయ్య (45) ఆత్మహత్య చేసుకున్నాడు. దుర్గయ్య రెండు సంవత్సరాలుగా మిర్చిపంట సాగుచేస్తున్నాడు. అయితే పంటకు గిట్టుబాటు ధర రాకపోవడంతో వడ్డీవ్యాపారులు, బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలు ఎక్కువయ్యాయి. దీంతో మనస్తాపం చెంది దుర్గయ్య పురుగులమందు తాగాడు.

సింగూరు జలాల కోసం బైక్ ర్యాలీ



నిజామాబాద్ జిల్లా వర్నిలో బైక్‌లతో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వర్ని/రుద్రూరు/కోటగిరి, ఆగస్టు 5 : సింగూరు ప్రాజెక్టు నుంచి నిజాంసాగర్‌కు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం నిజామాబాద్ జిల్లా రుద్రూరు, వర్ని, కోటగిరి మండలాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జీ కాసుల బాల్‌రాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ర్యాలీలో వర్నిలో 1000, రుద్రూరులో 800, కోగిరిలో 500 బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. కాసుల బాల్‌రాజ్ మాట్లాడుతూ ప్రభుత్వం సింగూరు జలాలపై స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో నిజాంసాగర్ ఆయకట్టు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందన్నారు. వేసిన పంటలన్నీ ఎండుముఖం పడుతున్నాయని అన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే సింగూరు జలాలను నిజాంసాగర్‌కు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

నార్కెట్‌పల్లి పీఏస్‌లో ఆత్మహత్యాయత్నం

నల్లగొండ క్రైం: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి యత్నించారు. శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాత సూర్యాపేటకు చెందిన మేడబోయిన నాగరాజును నార్కట్‌పల్లి పోలీసులు గత సోమవారం ఏదో కేసులో నిందితుడిగా నాగరాజునుఅరెస్టు చేసినట్లు కుటుంబసభ్యులు పేర్కొంటున్నారు. నార్కట్‌పల్లి పీఎస్‌లో ఉన్నట్లు తెలియడంతో కుటుంబసభ్యులు పీఎస్‌కు శనివారం వెళ్లినట్లు సమాచారం. అయితే ఆరు రోజులుగా పోలీసులు నాగరాజును చిత్రహింసలకు గురిచేస్తూ కేసులను ఒప్పుకోవాలని చిత్రహింసలకు గురిచేసినట్లు తెలుస్తుంది. పోలీసుల వేధింపులు భరించలేక నాగరాజు శనివారం స్టేషన్ పరిసరాల్లో ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. పోలీసులు నాగరాజును రహస్యంగా అక్కడ నుంచి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా నాగరాజు కంటపడిన కుటుంబ సభ్యుల వైపు చూసి ఫినాయిల్ తాగిన చనిపోతున్నానని కేకలు వేయడంతో కుటుంబసభ్యులు ఓ అడ్వకేట్‌ను సంప్రదించినట్లు తెలుస్తుంది.

ఫారం - 6

(చట్టం-30/2013 లోని సెక్షన్ 11(1) లోని సబ్ రూల్-1 రూల్ 19 ప్రకారం)

తెలంగాణ ప్రభుత్వం

రెవిన్యూ (భూసేకరణ) శాఖ

కలెక్టర్ / సంయుక్త కలెక్టర్, / స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ)

ప్రాథమిక నోటిఫికేషన్

జిల్లా కలెక్టర్ ఫైల్ నెం. జి/2413/2017 తేది : 03.08.2017
ఫైల్ నెం.ఎ/55/2017 తేది : 21.07.2017
గెజిట్ నెం. 71/2017 తేది : 03.08.2017

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి-భువనగిరి జిల్లా గారి ఆదేశానుసారం యాదాద్రి-భువనగిరి జిల్లా, బీబీనగర్ మండలం, చిన్నారావులపల్లి గ్రామములో భూమి విస్తీర్ణం ఎ.7.03 1/2 గుంటల భూమి ప్రజా ప్రయోజనార్థం బునియాదిగాని కాలువ కోసం ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నదని భావించినందున భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదరకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 లోని సెక్షన్ 11(1) అనుసరించి ప్రకటన జారీచేయనైనది.

రిక్విజేషన్ అథారిటీ లేఖను సమర్పిస్తూ ఇట్టి ప్రాజెక్టు ఇ.ఐ.ఎ. చేయబడినది అని తెలిపినారు. కావున చట్టం 2013లోని సెక్షన్ 6(2) ప్రకారము ఎస్.ఐ.ఎ.ను మినహాయించనైనది.

నిర్వాసిత కుటుంబాల పునరావాస, పునరుపాధి అంశాలకు జాయింట్ కలెక్టర్ మరియు అదనపు జిల్లా మేజిస్ట్రేటు యాదాద్రి-భువనగిరి గారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల నెం. 19, రెవిన్యూ (జె.ఎ.అండ్ ఎల్.ఎ.), తేది : 11-02-2015 ప్రకారము ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా నియమించబడినారు.

కావున ఈ ప్రాజెక్టు క్రింద యాదాద్రి-భువనగిరి జిల్లా, బీబీనగర్ మండలంలోని చిన్నరావులపల్లి గ్రామములో విస్తీర్ణం ఎ.7.03 1/2 గుంటలు గల భూమి ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీచేయనైనది.

జిల్లా : యాదాద్రి-భువనగిరి మండలం: బీబీనగర్ గ్రామం:చిన్నరావులపల్లి

సర్వే నెం. / భూమి, స్వభావము హక్కు స్వభావము విస్తీర్ణము (ఎ.గుం.)	భూసేకరణ విస్తీర్ణం (ఎ.గుం)	పట్టాదారు (ప) / అనుభవదారు (అ) పేరు మరియు తండ్రి / భర్త పేరు	చెట్లు / కట్టడములు
1	2	3	4
56 ఖుష్కి/పట్టా 6.06	1.00	దారవత్ శంకర్ తండ్రి వాసురాం	---
	1.00	దారవత్ లక్ష్మణ్ తండ్రి మాల్య	---
	1.00	బానోతు హంజ్య తండ్రి పిర్య	---
	1.00	బానోతు బీమ్లా తండ్రి గన్య	---
	2.06	భూక్య లకుపతి తండ్రి సోమ్లా	---
	---	బానోతు రాజ్య తండ్రి రాంజీ	---
57 ఖుష్కి/పట్టా 0.15	0.15	బానోతు హిర్య తండ్రి దేవులా	---
58 ఖుష్కి/పట్టా 0.22 1/2	0.22 1/2	పబ్బ రమేష్‌కుమార్ తండ్రి రామకోటయ్య	---
	---	భుక్య చక్రు తండ్రి శీనా	---
	---	భూక్య రాములు తండ్రి సూర	---
	---	భూక్య భాస్కర్ తండ్రి సూర	---
	---	భూక్య రవిందర్ తండ్రి సూర	---
	---	భూక్య టీకం తండ్రి చీనా	---
	---	భూక్య దేవా తండ్రి చీనా	---
	---	భూక్య పద్మ భర్త మంగ్తా	---
మొత్తం	7.03 1/2		

ఇట్టి నోటిఫికేషన్ భూసేకరణ భూ నిర్వాసితుల పునరావాసం మరియు పునరుద్దరణ చట్టం, 2013 (నెం.30/2013) లోని నియమకంలోని సెక్షన్ (11)1 ప్రకారం సంబంధిత భూ యాజమానులకు సరియైన భూ నష్టపరిహారం చెల్లించుటకు గాను నోటిఫికేషన్ జారీచేయనైనది.

భూమి యొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కలెక్టర్, యాదాద్రి-భువనగిరి మరియు భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టరు (భూ.సే), యాదాద్రి-భువనగిరి గారి కార్యాలయంలో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైన పని దినములలో కార్యాలయ వేళలలో తనిఖీ చేసుకోవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, యాదాద్రి-భువనగిరి గారు ప్రత్యేక ఉప కలెక్టరు (భూ.సే), యాదాద్రి-భువనగిరి గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించి సెక్షన్ 12 ప్రకారం పైన చూపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలుతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11 (4) ప్రకారం భూసేకకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయంలో జిల్లా కలెక్టర్, యాదాద్రి-భువనగిరి గారి అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారీచేసిన తేది నుండి ఆ ప్రకటనలో ఉదహరింపబడిన భూములకు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకం, తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు.

భూ సేకరణ విషయంలో సంబంధించిన భూ యాజమానులు ఏదైన అభ్యంతరములున్న యెడల చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం జిల్లా కలెక్టరు యాదాద్రి-భువనగిరి గారికి లిఖిత పూర్వకంగా తెలియజేయవలసి ఉన్నది. ఇట్టి ప్రకటన జారీ చేసిన (60) దినముల లోపల ఏమైనా అభ్యంతరములున్న యెడల వారి అభ్యంతరములు లిఖిత పూర్వకంగా తెలియజేయవలసి ఉన్నది.

సం/- ప్రత్యేక ఉప కలెక్టరు (భూ.సే), యాదాద్రి-భువనగిరిజిల్లా
సం/- సంయుక్త కలెక్టర్, యాదాద్రి-భువనగిరిజిల్లా
సం/- జిల్లాకలెక్టర్, యాదాద్రి-భువనగిరిజిల్లా

మాటలు కాలుస్తున్నాయ్!

ముఖ్యమంత్రి కేసీఆర్ అరుదుగా విలేకరుల సమావేశం నిర్వహిస్తూ ఉంటారు. ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారంటే ఎవరికో మూడినట్టేనన్న అభిప్రాయం మీడియాలో ఏర్పడింది. ఆ మధ్య విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాను కడిగిపారేశారు. అమిత్ షా తర్వాత ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ వంతు వచ్చింది.



■ ఆర్కే RK

కొత్తపలుకు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని నడిరోడ్డుపై కాల్చినా తప్పులేదని ప్రతిపక్ష నాయకుడు జగన్మోహన్‌రెడ్డి అనడం కచ్చితంగా అభ్యంతరకరమే! బహుశా ఆ విషయం తెలుసు కనుకే జగన్ మీడియాలో ఈ మాటను ప్రచురించలేదు. అంటే తమ అధినేత అన్న మాటలు సమర్థనీయం కాదని ఆ మీడియాలో పనిచేస్తున్నవారు కూడా గ్రహించారన్న మాట! జగన్మోహన్‌రెడ్డి అలాంటి మాటలు అననే లేదని పాఠకులను, వీక్షకులను నమ్మించడానికి ఆయన మీడియా ప్రయత్నించినా, మీడియా ఇంతలా విస్తరించిన ఈ రోజులలో దేన్నీ దాచిపెట్టలేం.

రుతుపవనాలు ముఖం చాటేయడం వల్ల తెలుగు రాష్ట్రాలలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నట్టుగానే రాజకీయ సెగలు కూడా పెరుగుతున్నాయి. ఎన్నికలకు ఇంకా 20 నెలల వ్యవధి ఉండగానే దూషణ–భూషణలతో ధ్వని కాలుష్యం ఏర్పడుతోంది. నాయకుల తిట్లు, శాపనార్థాలు ఇప్పుడే ఇలా ఉంటే ఎన్నికల నాటికి పరిస్థితి ఇంకెంత తీవ్రంగా ఉంటుందోనన్న ఆందోళన కలగకమానదు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ రెండు రోజుల క్రితం రెండు గంటలపాటు విలేకరుల సమావేశం నిర్వహించి, తనదైన శైలిలో కాంగ్రెస్ పార్టీని తెలంగాణ పాలిట పిశాచిగా తిట్టిపోశారు. ప్రభుత్వం తీసుకుంటున్న వివిధ నిర్ణయాలపై హైకోర్టులో స్టే ఉత్తర్వులు వస్తూ ఉండటంతో చిర్రెత్తుకొచ్చిన కేసీఆర్, కోర్టు కేసుల వెనుక కాంగ్రెస్ పార్టీ హస్తం ఉందన్న అభిప్రాయంతో ఆ పార్టీని దుమ్మెత్తిపోశారు. దీనికి ప్రతిగా కాంగ్రెస్ నాయకులు కూడా అదే స్థాయిలో విరుచుకుపడ్డారు. ఫలితంగా రాష్ట్రంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. అధికార– ప్రతిపక్షాల మధ్య మాటల చిటపటలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ అరుదుగా విలేకరుల సమావేశం నిర్వహిస్తూ ఉంటారు. ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారంటే ఎవరికో మూడినట్టేనన్న అభిప్రాయం మీడియాలో ఏర్పడింది. ఆ మధ్య విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాను కడిగిపారేశారు. తప్పుడు విమర్శలు చేసినందుకు రాష్ట్రం విడిచి వెళ్లేలోపు క్షమాపణలు చెప్పాలని కూడా డిమాండ్ చేశారు. బీజేపీ జాతీయ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత అమిత్ షాను ఆ తరహాలో ఏ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి కూడా నిలదీయలేదు. దీంతో కంగుతిన్న అమిత్ షా అప్పటికి మౌనం వహించినప్పటికీ ఢిల్లీ వెళ్లిన తర్వాత రెండు రోజులకు గవర్నర్ నరసింహన్‌కు ఫోన్ చేసి, మీ ముఖ్యమంత్రి మరీ అంతలా ఎందుకు స్పందించారని ఆరా తీశారు. అమిత్ షా తర్వాత ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ వంతు వచ్చింది. విద్యుత్ సంస్థలలో కాంట్రాక్టర్ల వద్ద పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించే దిశగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హైకోర్టులో పిల్ దాఖలు కావడం, దాని వెనుక కాంగ్రెస్ ఉందన్న అనుమానాలు ఉండటంతో ముఖ్యమంత్రికి చిర్రెత్తుకొచ్చింది. తాను చేస్తున్న మంచి పనులను కోర్టులలో కేసులు వేయడం ద్వారా కాంగ్రెస్ అడ్డుకుంటోందన్న కోపంతో కేసీఆర్ ఆ పార్టీని తిట్టిపోశారు. అయితే ఈ విషయమై రాజకీయ పరిశీలకుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కేసీఆర్ అవసరానికి మించి స్పందించారనీ, మరీ అంతలా, అంతసేపు కాంగ్రెస్ పార్టీని, కమ్యూనిస్టులను తిట్టనవసరం లేదనీ కొంతమంది అభిప్రాయపడగా, హైకోర్టులో వరుసగా ఎదురుదెబ్బలు తగలడం వల్ల సహనం నశించిన కేసీఆర్ ఆవేదనతో ఆ రోజు అలా విరుచుకుపడ్డారన్నది మరికొందరి వాదన. గడచిన కొన్ని రోజులుగా చోటు చేసుకుంటున్న పరిణామాల పట్ల ఆవేదనతోనే కేసీఆర్ అలా మాట్లాడారని అధికారపక్షం వాళ్లు సమర్థించుకున్నారు. నేరెళ్ల వ్యవహారంపై కుమారుడు కేటీఆర్‌ను ప్రతిపక్షాలు టార్గెట్ చేయడం కూడా కేసీఆర్ ఆగ్రహానికి కారణమై ఉంటుందని తెలంగాణ రాష్ట్ర సమితి వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. నేరెళ్లలో దళితులపై పోలీసుల జులుం అవాంఛనీయం. ఇసుక లారీలను తగలబెట్టారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని పోలీసులు అరెస్ట్ చేసి చిత్రహింసలకు గురిచేసినట్టు వార్తలు వచ్చాయి. పోలీసుల ఈ చర్యను ప్రభుత్వం కూడా సమర్థించలేదు. ఆ మధ్య ఖమ్మం జిల్లాలో కూడా మార్కెట్ యార్డ్‌పై దాడి చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న రైతులను జైలుకు పంపించి, కోర్టుకు తీసుకువెళ్లే క్రమంలో వారి చేతులకు బేడీలు వేశారు. ఈ సంఘటన జరిగినప్పుడు కూడా ప్రభుత్వం ఆత్మరక్షణలో పడింది. ఏ ప్రభుత్వానికైనా పోలీసులతో ఇబ్బందులు ఎదురవుతూనే ఉంటాయి. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్నది ప్రతిపక్షాల అభిప్రాయం. పోలీసు శాఖకు కేసీఆర్ ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలు కల్పించింది. దీంతో పోలీసులు సహజంగానే అధికార పార్టీ పట్ల విధేయులుగా ఉంటున్నారు. ఈ కారణంగా పోలీసులు అప్పుడప్పుడు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తున్నది. అధికారంలో ఉన్న వారికి కొన్ని సందర్భాల్లో పోలీసుల మద్దతు, సహకారం అవసరం. అలా అని పోలీసులను మరీ నెత్తినెక్కించుకోకూడదు. పోలీసులకు ఉన్న విశేష అధికారాల వల్ల వారిలో దౌర్జన్యపూరిత మనస్తత్వం ఏర్పడుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని తగు జాగ్రత్తలు తీసుకుంటే ఖమ్మం, నేరెళ్ల వంటి ఘటనలు జరగవు. ఈ విషయం అలా ఉంచితే ముఖ్యమంత్రి కేసీఆర్ కాంగ్రెస్‌పై చేసిన ఎదురుదాడికి ప్రతి దాడి కూడా అంతే తీవ్రంగా వచ్చింది. ఎన్నికలు సమీపించడమే ఇందుకు కారణం! ఉద్యమ సమయంలోనూ, అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కేసీఆర్ తన ప్రత్యర్థులను సన్నాసులని సంబోధిస్తూ వస్తున్నారు. ఇప్పటివరకు ప్రతిపక్షాలు కూడా ఈ తిట్లను తేలిగ్గా తీసుకుంటూ వచ్చాయి. ఇకపై పరిస్థితి అలా ఉండదనడానికి తాజా ప్రతిస్పందనే నిదర్శనం! తన వాక్చాతుర్యంతో కేసీఆర్ ఇప్పటివరకు ప్రతిపక్షాలను బేలతనంలోకి నెడుతూ వచ్చారు. ఇకపై అలా ఉండకపోవచ్చు. మీడియాలో ప్రతిపక్షాలకు తగినంత ప్రాధాన్యం లభించకపోతుండవచ్చు గానీ, ప్రతిపక్షాలు, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ గొంతు పెరుగుతోంది. దీంతో రానున్న 20 నెలల కాలంలో అధికార ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మరింత ముదరవచ్చు. ప్రజలలో అసంతృప్తి బీజాలు నాటుకుంటున్నాయని నమ్ముతున్న కాంగ్రెస్ నాయకులు ఇకపై స్వరం పెంచుతారు. అయితే అధికారపక్షానికి ఇప్పటికిప్పుడు వచ్చిన ప్రమాదం ఏమీ లేదు. పరిస్థితులు ఇలాగే ఉంటే వచ్చే ఎన్నికల తర్వాత కూడా అధికారం కేసీఆర్‌కే దక్కుతుంది. కాకపోతే నేరెళ్ల వంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవలసిన బాధ్యత కేసీఆర్ ప్రభుత్వంపై ఉంది. కాంగ్రెస్ స్థానంలో ఎవరున్నా నేరెళ్ల ఘటనను రాజకీయం చేయకుండా ఉండరు. నిజానికి ఈ అవకాశం తొలుత బీజేపీకి లభించినప్పటికీ, ఎందుకో గానీ పార్టీ నాయకులు అంది వచ్చిన అవకాశాన్ని జారవిడుచుకున్నారు.

■ తెంపరితనం తెచ్చిన తంటా!

తెలంగాణ రాజకీయాలు ఇలా ఉండగా, ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు మరింత ముదురుపాకాన పడుతున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ పెద్దలతో సఖ్యత కుదుర్చుకున్న తర్వాత ప్రతిపక్ష నాయకుడు మరింత దూకుడు పెంచారు. ఇప్పుడు నంద్యాల ఉప ఎన్నిక రావడంతో అధికార, ప్రతిపక్షాల



నేరెళ్ల వ్యవహారంపై కుమారుడు కేటీఆర్‌ను ప్రతిపక్షాలు టార్గెట్ చేయడం కూడా కేసీఆర్ ఆగ్రహానికి కారణమై ఉంటుందని తెలంగాణ రాష్ట్ర సమితి వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. నేరెళ్లలో దళితులపై పోలీసుల జులుం అవాంఛనీయం. పోలీసుల ఈ చర్యను ప్రభుత్వం కూడా సమర్థించలేదు.

మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది. నంద్యాలలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని నడిరోడ్డుపై కాల్చినా తప్పులేదని ప్రతిపక్ష నాయకుడు జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రిని కాల్చి చంపాలని ప్రతిపక్ష నాయకుడు అనడం కచ్చితంగా అభ్యంతరకరమే! బహుశా ఆ విషయం తెలుసు కనుకే జగన్ మీడియాలో ఈ మాటను ప్రచురించలేదు. అంటే తమ అధినేత అన్న మాటలు సమర్థనీయం కాదని ఆ మీడియాలో పనిచేస్తున్నవారు కూడా గ్రహించారన్న మాట! జగన్మోహన్‌రెడ్డి అలాంటి మాటలు అననే లేదని పాఠకులను, వీక్షకులను నమ్మించడానికి ఆయన మీడియా ప్రయత్నించినా, మీడియా ఇంతలా విస్తరించిన ఈ రోజులలో దేన్నీ దాచిపెట్టలేం. ముఖ్యమంత్రిని నడిరోడ్డుపై కాల్చాలన్న జగన్ వ్యాఖ్యలను అందివచ్చిన అవకాశంగా భావించిన అధికార తెలుగుదేశం పార్టీ ప్రతివ్యూహానికి పదునుపెట్టింది. పదమూడు జిల్లాలలో తెలుగుదేశం నాయకులు, శ్రేణులు దీనిపై స్పందించారు. జగన్మోహన్‌రెడ్డి ఒక ఉన్మాది అనే భావన ప్రజలలో వ్యాపింపజేయడానికి పథక రచన చేశారు. అపార అనుభవం, జాతీయ స్థాయిలోనే కాకుండా వివిధ దేశాలలో సైతం అంతో ఇంతో పేరు ప్రతిష్ఠలు ఉన్న చంద్రబాబు కావాలా? ఉన్మాదిలా వ్యవహరించే జగన్మోహన్‌రెడ్డి కావాలా? తేల్చుకోవాలని తెలుగుదేశం పార్టీ ప్రజలకు పిలుపునిచ్చింది. ఏపీ రాజకీయాలలో ముఖ్యమంత్రి చంద్రబాబుది విచిత్రమైన పరిస్థితి. ఆయనకు సమఉజ్జీలు గానీ, సమకాలికులు గానీ రాష్ట్ర రాజకీయాలలో ఎవరూ లేరు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డితో రాజకీయ మనుగడ కాపాడుకోవడం కోసం పోరాటం చేసిన ఆయన ఇప్పుడు రాజశేఖర్‌రెడ్డి కుమారుడు జగన్మోహన్‌రెడ్డితో అధికారం కాపాడుకోవడం కోసం పోరాటం చేయవలసి వస్తోంది. ఈ క్రమంలో తన కుమారుడి వయసు కలిగిన జగన్మోహన్‌రెడ్డితో నేరుగా తలపడలేక, అలా అని మౌనంగా ఉండలేని విచిత్ర పరిస్థితిలో చంద్రబాబు చిక్కుకున్నారు. చంద్రబాబు–జగన్ స్వభావాల మధ్య ఎంతో వ్యత్యాసం ఉంది. కటువుగా ఉండటం, దురుసుగా మాట్లాడటం, దుర్భాషలాడటం చంద్రబాబు స్వభావానికి విరుద్ధం. ఆయన అనుసరించే రాజకీయ ఎత్తుగడల విషయంలో ఎవరి అభిప్రాయాలు వారికి ఉండవచ్చు గానీ ఈ విషయంలో మాత్రం దాదాపు అందరూ ఒకే అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తూ ఉంటారు. రాజకీయ శత్రువులతో కూడా నేరుగా తలపడటానికి ఆయన ఇష్టపడరు. సాధ్యమైనంత వరకు రాజీ ధోరణి అవలంబిస్తుంటారు. ఈ కారణంగానే చంద్రబాబు మెతక అన్న అభిప్రాయం రాజకీయ వర్గాలలో ఏర్పడింది. నీ వాళ్లు– నా వాళ్లు అని గీత గీసుకోరు. రాజకీయాలలో ఎప్పుడు ఎవరితో అవసరం పడుతుందోనన్న అభిప్రాయంతో సామరస్యంగా ఉండటానికి ప్రయత్నిస్తుంటారు. తప్పు చేస్తే ఇరుక్కుపోతానన్న భయం చంద్రబాబును ఎప్పుడూ వెంటాడుతూ ఉంటుంది. బహుశా ఈ మోడల్‌ను అనుసరించడం వల్లనే కాబోలు ఆయన సుదీర్ఘ కాలంగా రాజకీయాలలో నిలదొక్కుకోగలుగుతున్నారు. ప్రతిపక్ష నాయకుడు జగన్మోహన్‌రెడ్డిది ఇందుకు పూర్తి భిన్నమైన మనస్తత్వం. కక్షపూరిత మనస్తత్వం ఆయన సొంతం. తనవాడు కాదనుకుంటే వాడు ఎంత గొప్పవాడైనా ఎదిరించడానికి, వీలైతే దెబ్బతీయడానికి వెనుకాడరు. ఈ కారణంగానే నాలుగేళ్ల క్రితం అత్యంత శక్తిమంతురాలిగా ఉన్న సోనియాగాంధీని తాను కోరుకున్న ముఖ్యమంత్రి పదవి ఇవ్వలేదని ఎదిరించి సొంత పార్టీ పెట్టుకున్నారు. జగన్‌ది మితిమీరిన తెంపరితనం. ఈ లక్షణం ఉన్నందువల్లే తండ్రి అధికారంలో ఉన్నప్పుడు తాను ఏమి చేశానో తెలిసి కూడా అధికార వ్యవస్థను ధిక్కరించారు. మామూలుగా అయితే తప్పు చేసిన వాళ్లు సర్దుకుపోతుంటారు. రాజీ ధోరణి ప్రదర్శిస్తారు. తాను తప్పు చేశానని జగన్మోహన్‌రెడ్డి అంగీకరించకపోవచ్చు. కానీ ప్రపంచానికి తెలుసు! తప్పు చేయడం తమ హక్కు అని, అందరూ అలానే చేస్తారని కొంతమంది భావిస్తుంటారు. జగన్ ఈ కోవకు చెందినవాడై ఉండవచ్చు. అందుకే కాబోలు తాను మాత్రమే అవినీతిపరుడు కాదనీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అంతకంటే ఎక్కువ అవినీతిపరుడని అభివర్ణించే ప్రయత్నం చేస్తున్నారు. జగన్ మీడియా పోకడలు, రాతలు– కూతలను గమనిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. జగన్మోహన్‌రెడ్డి లక్ష కోట్లు అవినీతికి పాల్పడ్డారని తెలుగుదేశం పార్టీ విమర్శిస్తున్నందున, చంద్రబాబునాయుడు లక్ష కోట్ల మార్కును ఎప్పుడో అధిగమించారనీ, ఆయన అవినీతి లక్షన్నర కోట్లు దాటిందనీ జగన్ అండ్ కో ప్రచారం చేస్తుంటుంది. వచ్చే ఎన్నికల నాటికి ఈ సంఖ్య రెండు లక్షల కోట్లకు చేరినా ఆశ్చర్యం లేదు. తనపై లక్ష కోట్లకు అవినీతి ఆరోపణలు చేస్తున్నందున చంద్రబాబుపై రెండు లక్షల కోట్లకు అవినీతి ఆరోపణలు చేస్తే తిక్క కుదురుతుందని భావించి ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారేమో తెలియదు. ఈ క్రమంలోనే ఏపీ అంటే అవినీతికి కేరాఫ్ అని గల్లీ నుంచి ఢిల్లీ వరకు ప్రచారం చేస్తున్నారు. తనకంటే చంద్రబాబు పెద్ద అవినీతిపరుడని ప్రజలను నమ్మించగలిగితే వచ్చే ఎన్నికలలో అధికారం తనదేనన్న భావనతో జగన్మోహన్‌రెడ్డి ఈ వ్యూహం పన్ని ఉండవచ్చు.

■ మారుతున్న వ్యూహాలు!

అధికార– ప్రతిపక్షాల మధ్య వ్యూహ ప్రతివ్యూహాలు సహజం. ఇప్పుడు ఏపీలో ఈ వ్యూహాల స్థానంలో కక్షలు వచ్చి చేరాయి. దాని ఫలితమే ముఖ్యమంత్రిని నడిరోడ్డులో కాల్చాలన్న వ్యాఖ్యలు. ప్రజలు కూడా తెలుగుదేశం, వై.ఎస్.ఆర్. కాంగ్రెస్‌ల వైపు విడిపోయి ఉన్నారు. ఫలితంగా జగన్ అండ్ కో చేస్తున్న విమర్శలు గానీ, తెలుగుదేశం నాయకులు చేసే ఎదురుదాడి గానీ వారికి ఎబ్బెట్టుగా అనిపించడం లేదు. ఎమ్మెల్యే రోజా వైసీపీ సభలలో స్టార్ స్పీకర్‌గా ఉంటున్నారంటే ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబును ఎడాపెడా తిట్టడమే కారణం. రోజాకు ఒక వర్గం ప్రజలలో ఫాలోయింగ్ కూడా ఉంది. ఇలాంటి ధోరణి జగన్‌కు కూడా సహజంగానే నచ్చుతుంది. అందుకే గుంటూరులో నిర్వహించిన

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్నది కనుకనే కనీసం ఈ మాత్రం పురోగతి అయినా కనిపిస్తోంది. పోలవరం పూర్తి అయితే తెలుగుదేశం పార్టీకి రాజకీయ లబ్ధి చేకూరుతుందన్న దుగ్ధతోనే రాజ్యసభలో కేవీపీ, విజయసాయి ఈ ప్రశ్న వేశారని తెలుగుదేశం నాయకుల ఆరోపణలను నమ్మాల్సిన పరిస్థితిని వారే తమ చర్యల ద్వారా కల్పిస్తున్నారు. రాష్ట్ర ప్రజల హితం కోరేవారు అయితే వారిద్దరూ ఈ ప్రాజెక్టును కేంద్రం చేపట్టాలని కోరుకోరు.

ప్లీనరీలో చంద్రబాబును బాగా తిట్టాల్సిందిగా రోజాకు చెప్పించారు. జగన్‌ను అభిమానించే వారిలో అత్యధికులు ఈ ధోరణిని ఇష్టపడతారు. జగన్‌లో ఉన్న దుందుడుకు స్వభావానికి ఆకర్షితులు అవ్వడం వల్లనే ఆ వర్గం ప్రజలు ఆయనకు మద్దతుగా ఉంటున్నారు. రాజకీయ ప్రత్యర్థులను ఏ విధంగానైనా ఫినిష్ చేయాలని ఈ తరహా మనస్తత్వం ఉన్నవారు కోరుకుంటూ ఉంటారు. రోగి కోరుకుంటున్నది– వైద్యుడు ఇచ్చింది ఒకటే అయినప్పుడు ఆనందంగానే ఉంటుంది. అయితే రోగం తగ్గుతుందా? లేదా? అనేది వేరే అంశం. తన తండ్రి సమకాలికుడైన చంద్రబాబును ఎంత మాట అంటే అంత మాట అనగలగడం జగన్మోహన్‌రెడ్డిలో ఉన్న తెంపరితనానికి నిదర్శనం. దీన్నే ఉన్మాద మనస్తత్వంగా తెలుగుదేశం వాళ్లు అభివర్ణిస్తున్నారు. ఇలాంటి మనస్తత్వం ఉన్న జగన్‌తో రాజకీయంగా తలపడవలసి వస్తుందని చంద్రబాబు భావించి ఉండరు. వచ్చే ఎన్నికలు అధికార, ప్రతిపక్షానికి అత్యంత కీలకం. ముఖ్యమంత్రి కావాలన్నది తన బలమైన కోరిక అనీ, 30 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా ఉంటానని కూడా జగన్మోహన్‌రెడ్డి చెప్పుకొంటున్నారు కనుక వచ్చే ఎన్నికలలో అధికారం దక్కకపోతే ఆయన కోరిక ఎప్పటికీ తీరకపోవచ్చు. ఈ కారణంగానే తన స్వభావానికి విరుద్ధమైనా కన్సల్టెంట్‌ను నియమించుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై దాడిని తీవ్రతరం చేశారు. కేసుల నుంచి పూర్తిగా బయటపడకపోయినా వచ్చే ఎన్నికల వరకు తాత్కాలిక ఉపశమనం పొందడం కోసం ఢిల్లీ పెద్దలతో రాజీ పడ్డారు. ఏపీలో ఉన్న ఈ పరిస్థితిని గమనించిన అమిత్ షా– నరేంద్ర మోదీ ద్వయం చంద్రబాబు, జగన్మోహన్‌రెడ్డిలతో ఆడుకుంటున్నారు. చంద్రబాబుకు కూడా వచ్చే ఎన్నికలలో గెలిచి తిరిగి అధికారంలోకి రావడం అవసరం. 2019 ఎన్నికలలో జగన్మోహన్‌రెడ్డిని ఓడిస్తే ఆ తర్వాత ఆయన బెడద ఉండదన్నది తెలుగుదేశం పెద్దల అభిప్రాయం. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికలలో ఏపీలో సం'కుల' సమరాన్ని చూడబోతున్నాం. ఇప్పుడు జరుగుతున్న నంద్యాల ఉప ఎన్నిక కూడా ఇరుపక్షాలకూ ప్రతిష్ఠాత్మకంగా మారింది. నంద్యాల స్థానాన్ని గెలుచుకున్న పార్టీది వచ్చే ఎన్నికల వరకు పైచేయి అవుతుంది. ఇక్కడ ఇంకో విషయం చర్చించుకోవాలి. జగన్మోహన్‌రెడ్డికి భారతీయ జనతా పార్టీ పెద్దలతో మైత్రీబంధం బలపడటాన్ని గమనించిన కాంగ్రెస్– కమ్యూనిస్టు పార్టీలు తమ వ్యూహాలను మార్చుకుంటున్నాయి. ఇప్పటివరకు వైసీపీతో జతకట్టడానికి సిద్ధపడిన కమ్యూనిస్టులు, ఎప్పుడైతే జగన్ వెళ్లి ప్రధాని మోదీని కలిశారో అప్పట్నుంచి దూరంగా ఉంటున్నారు. జగన్మోహన్‌రెడ్డి కూడా భారతీయ జనతా పార్టీతో కుమ్మక్కయ్యారని విమర్శించడం మొదలుపెట్టారు. అంతేకాకుండా ఈ లాలూచీ వ్యవహారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి జగన్మోహన్‌రెడ్డిని బలహీనపర్చాలని నిర్ణయించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా జగన్మోహన్‌రెడ్డితో జత కట్టే ఆలోచనకు స్వస్తి చెప్పి సొంతంగా ఎదగడానికి ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఇందులో భాగంగానే నంద్యాల ఉప ఎన్నికకు దూరంగా ఉండాలని తొలుత అనుకున్నా ఇప్పుడు పోటీ పెట్టాలని నిర్ణయించుకుంది. కమ్యూనిస్టుల సహకారంతో నంద్యాలలో ఎంతో కొంత పోటీ ఇవ్వాలన్న పట్టుదలతో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. భారతీయ జనతా పార్టీతో జగన్మోహన్‌రెడ్డికి ఏర్పడిన సంబంధాలను వివరించడం ద్వారా తాము కోల్పోయిన దళితులు, ముస్లింల ఓటు బ్యాంకును తిరిగి పొందాలన్నది కాంగ్రెస్ వ్యూహంగా ఉంది. కమ్యూనిస్టులు కూడా.. ముఖ్యంగా సీపీఐ నాయకులు ముందుగా జగన్‌ను బలహీనపరచి ఆ తర్వాత ఎన్నికల సమయంలో పరిస్థితిని బట్టి కాంగ్రెస్‌తో గానీ, పవన్ కల్యాణ్ ప్రారంభించిన జనసేన పార్టీతో గానీ పొత్తుపెట్టుకోవాలనే ఆలోచనతో ఉన్నారు. మారిన పరిస్థితుల కారణంగా ఏపీలో జగన్‌కు రాజకీయ ప్రత్యర్థులు పెరిగారు. ఇప్పటివరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టిన కొన్ని ఆందోళన కార్యక్రమాలలో జగన్‌తో కలిసి పాల్గొన్న కమ్యూనిస్టులు, ఇక నుంచి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. కాంగ్రెస్ కూడా శషభిషలకు స్వస్తి చెప్పనున్నందున జగన్‌కు ప్రత్యర్థుల సంఖ్య పెరుగుతోంది. ఈ పరిస్థితులలో జగన్ అనుసరిస్తున్న దూకుడు వైఖరి ముందుముందు ఆయనకు మేలు చేస్తుందా? కీడు చేస్తుందా? అన్నది వేచి చూడాలి. ఏదిఏమైనా అధికారం కోసం ఎవరైనా ఎన్ని ఎత్తుగడలనైనా వేసుకోవచ్చు గానీ, ప్రత్యర్థులను శత్రువులుగా పరిగణించడం వాంఛనీయం కాదు. అది రాష్ట్రానికి కూడా మంచిది కాదు.

■ కేంద్రం గురించి తెలిసీ..

ఈ విషయం అలా ఉంచితే పోలవరం ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలు కేంద్రం చేపట్టకుండా రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించడంపై కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు, వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ ఎంపీ విజయసాయిరెడ్డి రాజ్యసభలో అడిగిన ప్రశ్నతోపాటు, గుజరాత్‌లో వరద ప్రభావిత ప్రాంతాల సందర్శనకు వెళ్లిన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీపై జరిగిన దాడి ఆందోళన కలిగించే అంశాలని చెప్పవచ్చు. పోలవరం ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం చేపడితే ఏమి జరుగుతుందో కేవీపీకి గానీ, విజయసాయిరెడ్డికి గానీ తెలియని విషయం కాదు. ఏళ్లుపూళ్లు గడచినా ఆ ప్రాజెక్టు పూర్తికాదు. ఉదాహరణకు రాష్ట్రం విడిపోయాక మంగళగిరి వద్ద ఎయిమ్స్ సంస్థను ప్రారంభిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అందుకు అవసరమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడో సమకూర్చింది. మూడేళ్లు అవుతున్నా ఎయిమ్స్ నిర్మాణంలో అతీగతీ లేదు. కేవలం ప్రహరిని మాత్రమే నిర్మించారు. అదేమంటే భవన నిర్మాణ ఆకృతులు సిద్ధంకాలేదన్న సమాధానం వస్తోందట! కేంద్రం చేపట్టే ప్రాజెక్టుల పరిస్థితి ఇలాగే ఉంటుంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్నది కనుకనే కనీసం ఈ మాత్రం పురోగతి అయినా కనిపిస్తోంది. పోలవరం పూర్తి అయితే తెలుగుదేశం పార్టీకి రాజకీయ లబ్ధి చేకూరుతుందన్న దుగ్ధతోనే రాజ్యసభలో కేవీపీ, విజయసాయి ఈ ప్రశ్న వేశారని తెలుగుదేశం నాయకుల ఆరోపణలను నమ్మాల్సిన పరిస్థితిని వారే తమ చర్యల ద్వారా కల్పిస్తున్నారు. రాష్ట్ర ప్రజల హితం కోరేవారు అయితే వారిద్దరూ ఈ ప్రాజెక్టును కేంద్రం చేపట్టాలని కోరుకోరు. విజయసాయిరెడ్డితో కేవీపీ జత కట్టడాన్ని కాంగ్రెస్ నాయకులు కూడా జీర్ణించుకోలేకపోతున్నారు. కాంగ్రెస్ కంటే వై.ఎస్.ఆర్. కాంగ్రెస్‌కే లబ్ధి చేకూర్చేలా కేవీపీ రామచంద్రరావు చర్యలు ఉంటున్నాయని ఒక సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఇకపోతే గుజరాత్ పర్యటనకు వెళ్లిన రాహుల్‌గాంధీపై జరిగిన దాడి రాజకీయాలలో నెలకొంటున్న సరికొత్త ధోరణులకు అద్దం పడుతోంది. కాలం కలిసి వస్తే ప్రధానమంత్రి అయ్యే స్థాయి ఉన్న రాహుల్ గాంధీపై దాడిని ఎవరు చేసినా అత్యంత అభ్యంతరకరం ఆక్షేపణీయం. దేశ చరిత్రలో బహుశా ఇంతకు ముందెన్నడూ ఈ స్థాయి నాయకులపై దాడి జరగలేదు. గుజరాత్‌లో కాంగ్రెస్ అధికారంలో లేదు. అంచేత వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం సరిగ్గా స్పందించలేదన్న కోపంతో ప్రజలు దాడి చేసి ఉంటారనుకోవడానికి వీలులేదు. పరామర్శకు వెళ్లినవారి పట్ల కోపం ఉంటే నిరసన తెలుపుతారు గానీ రాళ్ల దాడి జరగదు. అది కూడా జెడ్ ప్లస్ సెక్యూరిటీ ఉన్న రాహుల్‌గాంధీ వంటి నాయకుడిపై! ఈ పరిణామం అనర్థదాయకం. గుజరాత్ ప్రభుత్వం కూడా ఇందుకు ఎంతో కొంత బాధ్యత వహించవలసి ఉంటుంది.

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం
http://www.youtube.com/abntelugutv

మానవత్వాన్ని వేటాడిన వేళ...

ఏ అర్ధరాత్రో అపరాత్రో నిద్రలో తెలివిడి వస్తే చాలు, ఆ రోజు వద్దన్నా ముందుకు వస్తూనే వుంటుంది. సంచులూ, మూటలూ వేళ్లాడుతూ నా కళ్లల్లో కొస్తాయి. అంతే, వులిక్కిపడిపోతాను... ఔను, భయంతో దిగులుతో ఆ మిగిలిన రాత్రి మరి కంటికి కునుకు పట్టదు. అరుపులూ ఏడ్పులూ బల్లెపు పోట్లూ బొమ్మల్లాగా నా తల పగిలిపోతూ ఎట్టఎదుట నిలబడతాయి.

"అరే రాజబాబూ! పరిగెత్తూ! పరిగెత్తరా! చంపేస్తారురా! పరిగెత్తు!" బురదలో కూరుకుపోయి పరిగెత్తలేక నిస్సహాయంగా, "ఎట్టా పరిగెత్తాలిరా" అన్న వాడి ఆక్రోశం.

ఆగస్టు నెల! పొలాలన్నీ వానలతో మెత్తబడి! కొత్తకాలవ నీళ్ళతో మడి మడీ తడిసి – వెన్నలా మెత్తగా వున్న భూమి – మా చేతులతో విత్తనం వేస్తే పులకించీ మోసులెత్తీ పరవశించిపోయే భూమి, మా కన్నతల్లి లాంటి ఆ భూమి, ఆ రోజు మాకు శాపమైంది. అదే భూమి దళితుడి రక్తంతో తడిసి ముద్దయిపోయింది. ఒకరు కాదు, ఇద్దరు కాదు, ఎనిమిది మంది! ఎనిమిది మంది దళితుల రక్తం, ఆ మట్టిలో ఇంకిపోయింది. ఇపుడే కాదు, తరతరాలుగా శతాబ్దాలుగా ఈ భూమి అంటరానివాళ్ళ రక్తమూ చెమటతో తడుస్తూనే వుంది. ఇంకా ఇంకా తడుస్తూనే వుంది.

"మేం! పరిగెత్తలేకపోయాం! అలిసిపోయాం! పుట్టినదాదిగా పరిగెత్తీ పరిగెత్తీ బతుకు పరుగు పందాలలో అలసిపోయాం. మేం అలిసిపోయాం!"

"పరిగెత్తరా! రాజబాబూ! పరిగెత్తరా! అదిగో అటు రైలుగేటు నుండి ఆ గుంపులు వస్తున్నాయిరా! పరిగెత్తరా".

"వుండండిరా! ఈ బురదలో వాళ్ళెంత దూరం వస్తారు! అరే సతీష్ వెనకబడ్డాడురా! వాడొక్కడే దొరికితే చచ్చిపోతాడురా! చంపేస్తారు".

"పరిగెత్తరా! సతీష్! పరిగెత్తరా!"... అదిగో, ఆ గుంపు రానే వచ్చింది... పరిగెత్తండి! పారిపోండి! కేకలు వేస్తూ, అందరం మరో నాలుగడుగులు వేశాం.

"అమ్మా!" అన్న చావు కేక మా చెవుల్లో కంపనాలు రేపుతూ, నరకబడ్డవాడి తల నుండి చిమ్ముతోన్న ఎర్రటి నెత్తురు బరిశలతో గొడ్డళ్ళతో కేకలు వేస్తూ విజయధ్వానాలు చేస్తున్న ఆ గుంపు ఆ దృశ్యం వెంటాడుతుండగా గత పాతికేళ్ళుగా నిద్రలేని రాత్రులు ఎలా గడిపామో! పీడకలలతో భయంతో గజగజగా వణికిపోతూ ఎలా వెళ్ళదీస్తున్నామో! మీకెలా తెలుస్తుందీ?

'నేనింకా బతికేవున్నానా' అని ఎప్పటికప్పుడు ప్రతిరాత్రీ నన్ను నేను తడుముకుంటాను. బతికి వుంది నిజమేనని నిర్ధారించుకొని ఆగని కన్నీటితో క్రీస్తు ఏసును ఆ అర్ధరాత్రి వేళ అనంతంగా ప్రార్థిస్తాను.

* * *

మేం కనురెప్పలు పైకెత్తితే సహించలేరు. మేం మనుషులమని విశ్వాస ప్రకటన చేస్తే భరించలేరు. మమ్మల్ని వెంటాడతారు, వేటాడతారు, నిలువునా బలి తీసుకుంటారు.

అయినా మీరు అహింసా మూర్తులు!

మేం మాత్రం అరాచక సమూహాలం.

దేవుడూ, ధర్మశాస్త్రం పేరుతో నీ వారికి ఈ విశ్వం వున్నంత వరకూ చెదిరిపోని ఆధిపత్యాన్ని ఎట్లా కట్టిపెట్టావురా! ఇంత తెలివి కల్లవాడు ఆనాటికీ, ఈనాటికీ ఈ భూమి మీద లేదూ! పుట్టాబోడూ కదా!

"శూద్రులు వున్నత జాతి లక్షణాలు అనుసరించరాదని" నువ్వు ఆదేశించినట్టుగా ఇప్పుడు మేం వుండటం లేదు, మేం చదువుకుంటున్నాం... ఉద్యోగాలు చేసుకుంటున్నాం... తెల్లగుడ్డలు వేసుకుంటున్నాం అందుకేగదా ఎనిమిదిమంది! ఎనిమిది మంది తలలు ఎగిరిపోయాయి. మా రక్తం మీ భూముల్లో పారించారు.

దానితోనే ఆగిందా! ఎన్నెన్ని దృశ్యాలూ?

అల్లూరు దళితులపై దాడి జిల్లా వ్యాప్తంగా దళితులను ఆందోళన బాట పట్టించింది. ఈ దాడి రాష్ట్రంలోనూ మరోసారి ప్రకంపనలు పుట్టించింది. పోస్టుమార్టం చేసిన శవాలను ఆ రోజు అల్లూరు తీసుకుపోతున్నారనే వార్త ఆ చుట్టుపక్కల గ్రామాలలో ఉద్రిక్తతను సృష్టించింది.

దళితులు చంపబడి అప్పటికి నాలుగు రోజులు.

శవాలంటే, అవి శవాలు కాదు... చీరి, చివికిపోయిన మాంసపు ముద్దలు.

తెనాలి నుండి దళితుల మృతదేహాలతో పాటు ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు, పల్లెపల్లె నుండి రాష్ట్రవ్యాప్తంగా దళిత శ్రేణులు, మేధావులు, ఒకరేమిటి సమస్త జనం అన్ని మార్గాల నుండి అల్లూరుకు చేరుకొన్నారు.

అల్లూరు దళితుల ఆక్రోశం, ఆవేదన... గర్భశోకంతో తల్లడిల్లే తల్లుల రోదన... అడుగడుగునా, అణువణువునా దళిత శ్రేణులను ఆవేశంతోనూ ఆగ్రహంతోనూ నింపేయి.

ఆగస్టు ఆరు నాడు జరిగిన దాడి వారి మనస్సుల్లో ఇంకా పచ్చిగానే వుంది. దాడి జరిగిన తీరు, వేటాడుతున్న అగ్రకులాల ముఠాలు వారి కళ్ళ ముందు కనపడుతూనే వున్నాయి. మళ్ళీ దాడి చేస్తారేమోనన్న భయం నుండి వాళ్ళింకా తేరుకోనే లేదు. ముక్కలుగా నరకబడ్డ శవాలు సరే! మిగిలి వున్న వారికి ముందు దారేమిటో అర్థంకాక భయాందోళన గుప్పిట్లో వున్న అల్లూరు పల్లె ఓ పక్క.

అల్లూరు దళితుల మీద జరిగిన ఘోరకృత్యం... వుద్రేకంతో వుద్వేగంతో వూగిపోతున్న దళిత యువత.

ఏ క్షణం ఏం జరుగుతుందో, ఈ పరిస్థితి ఎలా దారి తీస్తుందో, పోలీసులు, రాజ్యం ఎలాంటి పాత్ర పోషిస్తుందోనన్న ఆందోళనతో మేధావులూ, వామపక్షాలు, ప్రజాసంఘాలూ!

ఓ వాహనం మీద దళితుల మృతదేహాలు, ఆ వాహనానికి ముందు చేతుల్లో సర్వి కట్టెలు, కర్రలు పట్టుకొని ఊరేగింపుగా నడుస్తున్న దళిత యువజనం... అటో ఇటో తేలిపోవాలన్నంత ఆవేశంతో దిక్కులు పిక్కటిల్లేలా చేస్తున్న నినాదాలు.

ఊరినిండా పోలీసులు. అడుగడుగునా మనిషి మనిషిని పట్టిచూస్తున్న పోలీసులు. మరోపక్క కలెక్టరు, యస్పీ, మొత్తం జిల్లా యంత్రాంగమంతా తీరివున్న వైనం.

మనిషికి పదికన్నులుగా పహారా కాస్తున్న గూఢచారి వ్యవస్థ. తుపాకులు లోడు చేసుకొని గుండ్లు కురిపించటానికి సిద్ధమైనట్లుగా వున్న సీఆర్‌పీఎఫ్ జవాన్లు, వారి కవాతులు. చీమ చిటుక్కుమన్నా, స్వరాలు పెంచి గట్టిగా మాట్లాడినా, అక్కడంతా గప్పున అంటుకుంటుందేమోనన్నంత భయంకర నిశ్శబ్దం.

మృతదేహాలున్న వాహనం చర్చి సెంటరుకు వచ్చి ఆగింది. ఆ నిశ్శబ్దం బద్దలై ఫెళ్ళున ఆకాశం నుండి వురిమినట్లుగా ఒక్కసారి వేలాది గొంతుల ఆవేశం, ప్రళయ ఘోషలా పిక్కటిల్లిన నినాదాలు విరామం లేకుండా సాగుతూనే వున్నాయి. కమలాకర్రావు విజ్ఞప్తులు వారిని ఆపలేకపోయాయి. "బదులుకు బదులు తీర్చుకోవాల్సిందే"నని ఆగ్రహంతో ఉన్న యువకుల ఆవేదన ఓ క్రమానికి రావటానికి చాలా కష్టమైంది.

ఎట్టకేలకు మృతదేహాలను ఎక్కడ పూడ్చాలన్న సమస్య వచ్చింది. శ్మశానంలో పూడ్చటానికి దళిత జనం ఇష్టపడలేదు. "ఈ వూరి అగ్రకులాలవాళ్ళు మమ్ములను వెంటాడి చంపారు. అందుకు వారి ఎదుటనే వూరిలోనే శవాలను పూడ్చిపెట్టాల్సిందే! ఈ దిబ్బ చూసినప్పుడల్లా మేం ఎంత ఏడుస్తామో, వాళ్ళు అంతగా కుంచించుకుపోవాల్సిందే," ఉదయకుమార్, శేఖర్‌బాబు పట్టుబట్టారు.

* * *

అదికాదు శేఖర్‌బాబూ! సుప్రీం కోర్టుకు వెళ్తాం సరే! మనం అక్కడ కూడా ఖచ్చితంగా గెలుస్తామన్న నమ్మకమేదీ?... ఇప్పుడున్న స్థితిలో ఆ కోర్టుల్లో కూడా న్యాయం ఎంతవరకు దొరుకుతుందో? ఎట్లా చెప్పగలం.

విజయారావు మాటలు అక్కడున్న వారిని కలవరపెట్టాయి. నిజంగా అక్కడకూడా న్యాయం జరగదా? అందరూ తెల్లబోయి చూడసాగారు.


అసలు ఈ సమాజం, ఈ న్యాయవ్యవస్థలు ఇలా వున్నంత కాలం, కోర్టుల్లోనే న్యాయమంతా జరుగుతుందనీ, మన జీవితాల్లో గొప్ప మార్పులేవో జరిగిపోతాయనుకోవడం అత్యాశే! ఇప్పటిదాకా మనలాంటివాళ్ళ బతుకుల్లో ఎంతో కొంత మార్పులు వచ్చాయంటే అవి మన ముందటి తరాలు చేసిన పోరాటాలూ, ప్రతిఘటనల ఫలితమే తప్ప మరొకటి కాదు.

వందల ఏళ్ళ నాడే మన ఆదిమ శంబరుడు తన శత్రువులను నలభై ఏళ్ళ పాటు నిరంతరాయంగా ప్రతిఘటించాడు, అయినా శంబరుడిని ఓడించగలిగారా? శంబరుడి వారసులు సుదాసు, దివోదాసులు కూడా తమ జీవిత కాలంలో ఆ యుద్ధపిపాసులను కాలూనకుండా ఎదిరిస్తూనే వున్నారు. అప్పటి నుండి ఇప్పటిదాకా నాలుగువేల ఏళ్ళుగా మన ఆదిమజాతులను, మూలవాసులను అబద్ధాలతో, అర్థసత్యాలతో దొంగదెబ్బతీస్తున్నారు తప్ప మనల్ని గెలవలేదు.

నిజంగా ఆ ఆదిమ శంబరుడు ఓడిపోయినట్లయితే, ఈ మనువులూ, ఈ కౌటిల్యులూ ఇంతింత గ్రంథాలు ధర్మశాస్త్రాల పేరుతో, మతం పేరుతో, దేవుడి పేరుతో మనల్ని ఎందుకు కట్టుదిట్టం చెయ్యాలనుకున్నారు? శంబరుడి వారసులమైన మనం, ఎప్పటికైనా మన హక్కుల కోసం ప్రశ్నలు వేస్తామేమోననే భయం, నిరంతరం వారికి నిద్రపట్టనీయడం లేదు... మనలను ఎప్పటికప్పుడు తల ఎత్తకుండా అణిచివుంచాలనే ఆందోళన, అభద్రత వారిని వెంటాడుతూనే వుంది.

వేనుడిలాంటి వారిని దొంగచాటుగా చంపించి వేసినా, ఎంతమంది ఏకలవ్యుల బొటనవేళ్ళు కోసినా... అంతిమంగా గెలిచింది మన ఆదిమ దస్యులు, మన శంబర వాసులే. ఆ నిజాన్ని పురోహితవర్గం, రాజులూ కూడా కప్పిపెట్టలేకపోయారు.

నిజంగా ఆ ఆదిమ శంబరుడు ఓడిపోయినట్లయితే, ఈ మనువులూ, ఈ కౌటిల్యులూ ఇంతింత గ్రంథాలు ధర్మశాస్త్రాల పేరుతో, మతం పేరుతో, దేవుడి పేరుతో మనల్ని ఎందుకు కట్టుదిట్టం చెయ్యాలనుకున్నారు? మనం- శంబరుడి వారసులమైన మనం, ఎప్పటికైనా మన హక్కుల కోసం ప్రశ్నలు వేస్తామేమోననే భయం, నిరంతరం వారికి నిద్రపట్టనీయడం లేదు. మనలను ఎప్పటికప్పుడు తల ఎత్తకుండా అణిచివుంచాలనే ఆందోళన, అభద్రత వారిని వెంటాడుతూనే వుంది.



■ నల్లూరి రుక్మిణి

(1991 ఆగస్టు 6వ తేదీన చుండూరులో దళితులపై జరిగిన మారణకాండ నేపథ్యంలో నల్లూరి రుక్మిణి రాసిన కాల్పనిక నవల 'నిషిధ' నేడు విడుదలవుతున్నది. ఆ నవల నుంచి కొన్ని భాగాలు ఇవి)

'కౌంట్' డౌన్



దెబ్బతీస్తున్న ఉద్యోగ ఒత్తిడి, జీవనశైలి లోపాలు..
30 ఏళ్లకే తగ్గుతున్న లైంగిక పటుత్వం

మిస్టర్ ఎ.. చాకులాంటి కుర్రాడు. పాతికేళ్లకే మంచి ఉద్యోగంలో స్థిరపడి పెళ్లి కూడా చేసుకున్నాడు. కొత్త జంట ఆర్నెల్ల పాటు రోజూ హనీమూన్‌లా గడిపింది. ఇంతలో.. అతడి ప్రతిభకు ఆఫీసులో మంచి గుర్తింపు వచ్చింది. పని కూడా పెరిగింది. అంతకుముందు ఆడుతూపాడుతూ పని చేసేవాడు కాస్తా.. బాధ్యతలు పెరిగేసరికి ఒత్తిడికి గురయ్యాడు. ఆ ప్రభావం పడగ్గదిపైనా పడింది. దీంతో, మానసికంగా మరింత కుంగిపోయాడు. అటు పని ఒత్తిడి.. ఇటు ఎవరికీ చెప్పుకోలేని సమస్య. భార్యకు ముఖం చూపించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది ఉదాహరణ కోసం చెప్పింది కాదు.. నిజంగా జరిగిన ఘటన.

మిస్టర్ బి.. బీటెక్ చదివాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో అంచెలంచెలుగా ఎదిగాడు. 29 ఏళ్లకు తన సహోద్యోగినితోనే పెళ్లయింది. కానీ ఏం లాభం? ఇద్దరివీ ఉన్నత ఉద్యోగాలు. ఊపిరి సలపనంత బిజీ. వారంలో ఒకరోజు మాత్రమే తీరిగ్గా కలుసుకునే అవకాశం దొరికేది. టూర్‌లు వెళ్లాల్సి వస్తే ఫోన్‌లోనో, ఆన్‌లైన్‌లోనో చాటింగ్‌తో సరి. పిల్లలు పుడితే కెరీర్ కుంటుపడుతుందనే ఉద్దేశంతో కొన్నాళ్లు ఆగుదాం అనుకున్నారు. అతడికి ఇప్పుడు 35 ఏళ్లు. కొంతకాలంగా పిల్లల కోసం సీరియస్‌గా ప్రయత్నిస్తున్నారు. తీరా వైద్య పరీక్షలు చేయిస్తే.. అతడిలో వీర్యకణాల లోపం ఉన్నదని తేలింది. ఆఫీసులో పని ఒత్తిడి పేరుతో అదే పనిగా సిగరెట్లు ఊదేసే అలవాటే తన లోపానికి కారణమని అతడికి తెలిసొచ్చింది.

కోరికలేవీ?

ఫాస్ట్‌ఫుడ్స్ తీసుకోవడం, వ్యాయామం లేకపోవడం, కంప్యూటర్ ముందు గంటల తరబడి గడపడం వల్ల యువతలో శృంగారేచ్ఛ తగ్గుతున్నది. యువకుల్లో వీర్యకణాల లోపం ఇటీవలి కాలంలో ఎక్కువగా కనిపిస్తున్నది. సంతానం లేని నవదంపతుల సంఖ్య పెరుగిపోతున్నది. ఈ ముప్పు నుంచి తప్పించుకోవాలంటే ఆహారపుటలవాట్లు మార్చుకోవాలి. క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అలవరచుకోవాలి. అప్పుడు ఈ సమస్యను చాలా వరకు అధిగమించవచ్చు.

– డాక్టర్ నందకుమార్, సీనియర్ ఆండ్రాలజిస్ట్, సన్‌షైన్ హాస్పిటల్స్, హైదరాబాద్

...చిన్న వయసులోనే విపరీతమైన ఒత్తిళ్లు, జీవన శైలి యువతలో లైంగిక సామర్థ్యాన్ని తీవ్రంగా దెబ్బ తీస్తున్నాయి. ఆరంకెల జీతాలతో యువత ఆర్థికంగా పటిష్ఠంగా ఉంటున్నా సంసారం మాత్రం బీటలు వారుతోంది. ఇద్దరూ కష్టపడుతున్నారు. కానీ, వారికి సుఖం కరువవుతోంది. వెరసి, లైంగిక పటుత్వం తగ్గుతున్న వాళ్లు కొందరు అయితే, లైంగిక ఆసక్తి లేనివాళ్లు మరికొందరు. లైంగికాసక్తి ఉన్నప్పటికీ వీర్యకణాలు లోపించినవాళ్లు ఇంకొందరు. నిజానికి, లైంగిక పటుత్వం తగ్గడం వేరు. అసలు లైంగిక కోరికలే తగ్గడం వేరు. రెండోది మరీ ప్రమాదకరం. ఇటీవలి కాలంలో యువతీ యువకుల్లో శృంగారేచ్ఛ గణనీయంగా తగ్గుతున్నట్టు తమ పరిశీలనలో తేలిందని పలువురు సెక్సాలజిస్టులు పేర్కొన్నారు. గతంలో స్తంభన సమస్యతో వచ్చే మగవారి వయసు సగటున 40 ఏళ్లుగా ఉండేదని.. ఇప్పుడు పాతికేళ్ల నుంచి 35 ఏళ్ల లోపువారు కూడా ఆ సమస్యతో తమను సంప్రదిస్తున్నారని తెలిపారు. ఒకవైపు ఆఫీసులో పని.. ఇంటికి వచ్చాక ఇంటి పని రెండింటినీ సమతుల్యం చేయలేక తీవ్ర అలసటకు గురవుతున్న మహిళల్లో కూడా లైంగికాసక్తి తగ్గుతోందని వివరిస్తున్నారు.

ఐటీ ఉద్యోగుల్లో ఎక్కువ

ఐటీ ఉద్యోగాలు దేశ ఆర్థిక ముఖచిత్రంతోపాటు లక్షలాది కుటుంబాల జీవన స్థితిగతుల్నీ మార్చేశాయి. కాసులు కురిపించే ఐటీ ఉద్యోగాలు కొండంత ఒత్తిడిని కూడా భారతీయ యువతపై మోపుతున్నాయి. విపరీతమైన పోటీ, ఒకేసారి రెండు, మూడు ప్రాజెక్టులను పూర్తి చేయాల్సి రావడం, భిన్న స్వభావాలున్న క్లయింట్లను మెప్పించాల్సి రావడం, వేళాపాళా లేకుండా పని చేయడం, గంటలు, రోజుల తరబడి ఆఫీసులోనే అతుక్కుపోవడం వంటి సమస్యలు ఈ రంగంలో చాలా ఎక్కువ. ఉద్యోగంలో టార్గెట్లకు తోడు, చిన్న వయసులోనే కొనుక్కొని అందరికీ గర్వంగా చూపించుకున్న ఇంటి ఈఎంఐ కొండలా కూర్చుని ఆందోళనకు గురి చేస్తుంటుంది. మానసిక సమస్యలకు తోడు వ్యాయామం లేకపోవడం, మద్యపానం, ధూమపానం వంటి దురలవాట్లు ఉంటే, అటువంటి వారి పరిస్థితి మరీ దుర్భరంగా మారుతోందని సెక్సాలజిస్టులు వివరిస్తున్నారు. ఫలితంగా, ఉద్యోగుల్లో జీవనశైలి జబ్బులు పెరిగిపోతున్నాయని, యువతుల్లో ఊబకాయం, హార్మోన్ సమస్యలు, యువకుల్లో వీర్యకణాల లోపం సంతాన లేమి సమస్య పెరగడానికి ప్రధాన కారణాలని చెబుతున్నారు. లాప్‌టాప్‌ను గంటల తరబడి ఒడిలో పెట్టుకుని పని చేయడం వల్ల ఆ వేడికి వీర్యకణాల సంఖ్య, నాణ్యత తగ్గుతుందని ఇప్పటికే పలు అధ్యయనాలు స్పష్టం చేశాయి.



ఇలా చేస్తే మేలు..

- ఒత్తిళ్లను దూరంగా ఉంచడం
- నిత్యం వ్యాయామం
- ఆరోగ్యకరమైన ఆహారం
- ధూమపానం, మద్యపానానికి గుడ్‌బై
- రోజూ సూర్యోదయ వేళలో జీవిత భాగస్వామితో కలిసి కాసేపు వ్యాహ్యాళికి వెళ్లడం..
- వ్యాయామం కుదరకపోతే కనీసం లిఫ్ట్ వాడకం మానేసి మెట్లు ఎక్కడం.
- కుదిరితే ధ్యానం, యోగా వంటివి చేయడం.

పల్చనవుతున్న వీర్యపుష్టి

ప్రపంచవ్యాప్తంగా యువత 'నిర్వీర్య'మవుతోంది. గతంతో పోలిస్తే.. యువకుల్లో వీర్యకణాల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతో పాటు పునరుత్పాదక శక్తి సన్నగిల్లుతోందని తాజా పరిశోధనల్లో తేలింది. అమెరిన్ సొసైటీ ఆఫ్ ఆండ్రాలజీ ఉత్తర అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా ఖండాల్లో యువకుల్లో వీర్యకణాల స్థితిగతులపై పరిశోధనలు జరిపింది. 4 దశాబ్దాల క్రితంతో పోలిస్తే వీర్యకణాల వృద్ధి 52 శాతం తగ్గిందని వెల్లడించింది. ఇది ఆందోళన కలిగించే విషయమని పరిశోధనకు సారథ్యం వహించిన షన్నా స్వాన్ తెలిపారు. ఆసియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికాల్లో కూడా ఈ సమస్య ఉంది. ఇక వీర్యకణాల సాంద్రత తగ్గడంపై వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 1973లో ఒక మిల్లీలీటరు వీర్యంలో సగటున 99 మిలియన్ల వీర్యకణాలు ఉండేవి. 2011నాటికి అవి 47 మిలియన్లకు పడిపోయాయి. మిల్లీలీటరు వీర్యంలో 40 మిలియన్ల కణాల కంటే తక్కువ ఉంటే సంతానం కలిగే అవకాశాలు తక్కువ అని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. 15 మిలియన్ల కంటే తక్కువుంటే సంతాన భాగ్యం ఉండదని ఆ సంస్థ తెలిపింది.

ఇద్దరూ ఉద్యోగులైతే..

సాఫ్ట్‌వేర్ కావచ్చు.. మరో రంగం కావచ్చు. భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగులు అయితే సైకోటిక్ ఇంపోటెన్సీ ఎక్కువగా కనిపిస్తోంది. అలసట, ఒత్తిడి వారి కోరికలను చంపేస్తున్నాయి. 'వారానికి ఐదు రోజులే ఆఫీసు. రెండు రోజులు ఎంజాయ్' అని వాళ్ల గురించి ప్రతి ఒక్కరూ భావిస్తారు. కానీ, ఆ ఐదు రోజులూ ఉదయాన్నే పోయి రాత్రికి రావడం. మిగిలిన రెండు రోజులూ దుస్తులు ఉతుక్కోవడం, ఇల్లు శుభ్రం చేసుకోవడం, షాపింగ్‌లతో బిజీ. వెరసి, ఆ రెండు రోజులూ రాత్రయ్యేసరికి అలిసిపోవడమే. "ప్రకృతి ఏమంటుంది? పొద్దున తినాలి. రాత్రి పడుకోవాలి. కానీ, మనం రాత్రీపగలు తేడా లేకుండా చేసేశాం. దీనికితోడు, సరైన డైట్ కూడా ఉండటం లేదు. దీర్ఘకాలంలో స్పెర్మ్ క్వాలిటీ తగ్గడానికి, లైంగిక పటుత్వం కోల్పోవడానికి ఇవి కారణాలు. భార్యాభర్తలిరువురూ ఉద్యోగులైతే ఈ సమస్యలు ఇంకాస్త ఎక్కువ. ఒకే ఇంట్లో ఉన్నా కమ్యూనికేషన్ ఉండడం లేదు. లైంగిక వాంఛలకు కమ్యూనికేషన్ ముఖ్యం" అని జూబ్లీహిల్స్‌లోని అవీస్ ఆస్పత్రిలో సెక్సాలజిస్టు డాక్టర్ షర్మిలా మజుందార్ వివరించారు. ఇక, ఎక్కువసేపు కదలకుండా కూర్చోవడం కూడా లైంగిక పటుత్వం తగ్గడానికి కారణాల్లో ఒకటని డాక్టర్లు వివరిస్తున్నారు. ఐటీ రంగం విస్తరించకముందు ఈ లైంగిక పటుత్వం పెద్ద సమస్యగా కనిపించేది కాదని, ఇప్పుడు అది జడలు విప్పి కరాళ నృత్యం చేయడానికి ఇది కూడా కారణమేనని స్పష్టం చేస్తున్నారు. "పెళ్లయిన రెండో ఏడాది నుంచే సంతాన లేమి సమస్యతో ఫెర్టిలిటీ సెంటర్ల చుట్టూ తిరగడం ఇటీవల పెరిగింది. అసలు సంసారమే చేయకుండా పిల్లలు కావాలనుకుని వస్తుండడం కూడా ఇటీవల పెరిగింది" అని మరో డాక్టర్ తెలిపారు.

మనదేశంలో..

2015లో మన దేశంలో 22 కోట్ల మంది సంతానలేమితో బాధపడుతున్నారు. 2020 నాటికి అది 25 కోట్లకు పెరుగుతుందని అంచనా. మన దేశంలో 2.2 నుంచి 3.3 కోట్ల మంది దంపతులు శాశ్వత సంతాన లేమితో బాధపడుతున్నారు. ప్రపంచంలో మరేదేశంలో లేని విధంగా శాశ్వత సంతానలేమితో బాధపడే దంపతుల సంఖ్య భారతదేశంలో నానాటికీ పెరిగిపోడం పట్ల నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంతానలేమికి 40 నుంచి 50 శాతం మహిళల్లో ఉన్న లోపాలు కారణం కాగా, 30 నుంచి 40 శాతం మగవారిలో ఉన్న లోపాలు ప్రధాన కారణం అని వైద్య నిపుణులు చెబుతున్నారు. గతంతో పోల్చితే ఇటీవల కాలంలో యువకుల్లో ఈ లోపాలు పెరిగిపోవడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది.

–స్పెషల్ డెస్క్, హైదరాబాద్ సిటీ



కదలకుండా కూర్చుంటే..

సెక్స్‌ను ఎంజాయ్ చేయడం చాలా మందికి తెలియదు. ఉదాహరణకు కొందరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లనే తీసుకుందాం. వారిలో చాలామంది ఒత్తిడిలో ఉంటారు. వారి బుర్రల్లో బాస్‌లు, క్లయింట్లూ తిరుగుతూ ఉంటారు. నా దగ్గరకు వచ్చేవారిలో ఇలాంటివారే ఎక్కువ. అంతేకాదు.. 80 శాతం సాఫ్ట్‌వేర్ వారే విడాకులు తీసుకుంటున్నారు. హార్మోన్లు సరిగా పని చేయాలంటే శరీర కదలిక ముఖ్యం. వ్యాయామం లేకుండా ఎక్కువ సేపు కూర్చుంటే స్పెర్మ్ కౌంట్, లైంగిక పటుత్వం తగ్గిపోతాయి. స్ట్రెస్ హార్మోన్లు పెరిగితే వీర్య కణాలు తగ్గిపోవడమే కాదు.. హార్ట్ ప్రాబ్లమ్స్ కూడా వస్తాయి. మహిళల్లో అయితే పీరియడ్స్ సరిగా ఉండవు. పీసీఓడీ, ఒబేసిటీ లాంటి సమస్యలు వస్తాయి. ఒబేసిటీ వస్తే సెక్స్ సరిగా చేయలేరు.

– డాక్టర్ సమరం

స్ట్రెస్.. ఏం చేస్తుంది?

యువతలో లైంగిక వాంఛలు తగ్గడానికి, అంగస్తంభనవంటి సమస్యలకు.. ఒత్తిడికి సంబంధమేంటి? ఆఫీసులో పని ఒత్తిడి వీటికి ఎందుకు దారి తీస్తుంది? చూద్దాం..! ఫోన్‌లో బ్యాటరీ చార్జింగ్ తగ్గుతూ.. క్రిటికల్ స్టేజ్‌కు అంటే ఏ 15 శాతానికో 10 శాతానికో వచ్చినప్పుడు మనం ఏం చేస్తాం? స్క్రీన్ బ్రైట్‌నెస్ (కాంతి)ని తగ్గించేస్తాం. లొకేషన్ ఎనేబుల్ చేసి ఉంటే దాన్ని ఆఫ్ చేసేస్తాం. అవసరాన్ని బట్టి.. వైఫై, మొబైల్ డేటాలనూ ఆపేస్తాం. ఫోన్‌కాల్స్ చేసుకునే ఆప్షన్ తప్ప మిగతా ఆప్షన్లన్నిటినీ డిజేబుల్ చేస్తాం కదూ? శరీరం కూడా అదే పని చేస్తుంది. మనిషి ఒత్తిడికి గురి కాగానే.. శరీరానికి అత్యంత ఆవశ్యకమైన రక్తసరఫరా, హృదయ స్పందనల వంటివాటిపైనే దృష్టి సారిస్తుంది. జీవక్రియల లెక్కలో శృంగారం లగ్జరీ. నిత్యావసరం కాదు. కాబట్టి.. కార్టిసాల్‌ను భారీగా పెంచేసి టెస్టోస్టీరాన్ స్థాయుల్ని తగ్గించి అంగస్తంభనను డి..జే..బు..ల్ చేసేస్తుంది!

సారు అలా సర్‌ప్రైజ్ అయ్యారు

(వరంగల్ అర్బన్, ఆంధ్రజ్యోతి)

"పుట్టిన రోజు వేడుకను జరుపుకొనేందుకు జయశంకర్ సార్ ఇష్టపడేవారు కాదు. ఆ రోజు వచ్చిందంటే మాత్రం ఎక్కడున్నా తప్పకుండా వెంకటేశ్వర స్వామి గుడికి వెళ్ళి పూజలు చేసేవారు. ఓసారి గమ్మత్తు జరిగింది. సారు 70వ పుట్టినరోజు వేడుకను ఆయనకు చెప్పకుండా ఏర్పాట్లు చేశాం. అమెరికాలో ఉంటున్న సారు తమ్ముడి పిల్లలు, నేను కలిసి రహస్యంగా 2 నెలల ముందే ఏర్పాట్లు ప్రారంభించాం. జన్మదినం సందర్భంగా గ్రాండ్ సెలబ్రేషన్‌తో ఆయనను సర్‌ప్రైజ్ చేయాలనేది మా ప్లాన్. వంద మందిదాకా దేశ, విదేశాల్లోని ఆత్మీయులకు ఆహ్వానాలు పంపాం. నేరుగా హన్మకొండ అశోకా హోటల్లోని సమావేశ మందిరానికి రావాలని, సార్‌కు ముందుగా పుట్టిన రోజు అభినందనలు చెప్పకూడదని చెప్పాం. అనుకున్నట్టుగానే పుట్టినరోజున సాయంత్రం అతిథులంతా అక్కడికి చేరుకున్నారు. మరి వేదిక వద్దకు జయశంకర్ సారును రప్పించడం ఎలా? అయితే, ఆయన తమ్ముడి పిల్లలు అనిల్, సమీరా.. "అందరం కలిసి అశోక హోటల్‌కు వెళ్లి దోశ తిందాం.. పెదనాన్నా" అని సారుతో అన్నారు. ఆయన సరేనని వారితో కలిసి అక్కడికి వచ్చారు. "పైన ఉన్న కాన్ఫరెన్స్ హాల్‌ను చూసిన తర్వాత తిందాం" అని వారు బతిమాలడంతో "ఖాళీ హాల్ చూడటం ఏం సరదారా మీకు" అంటూ ఆయన నవ్వుతూ మెట్లెక్కి సమావేశ మందిరంలోకి అడుగుపెట్టాడు. అప్పటికే అక్కడికి చేరుకున్న అతిథిగణమంతా లేచి నిలబడి చప్పట్లతో స్వాగతం పలికారు. ఊహించని ఈ ఆత్మీయతకు ఆయనకు కన్నీళ్లు ఆగలేదు. ఉబికి వస్తున్న కన్నీళ్ల తో ఆయన పుట్టిన రోజు వేడుక కోసం సిద్ధం చేసిన కేక్‌ను కట్ చేశా రు. "ఏ పని కూడా నాకు చెప్పకుండా చేయని బ్రహ్మం.. ఈ విషయం చెప్పలేదు. అయినా ఇది నాకు ఎంతో సంతోషం కలిగిస్తోంది" అన్నారు. ఇంత మంది ఆత్మీయులు తన కోసం ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి రావడం ఆనందంగా ఉందన్నారు. ఆయన కళ్ళలో ఎన్నడూ చూడనంత ఆనందాన్ని ఆరోజు చూశాం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడాలని ఆయన తన చివరి ఊపిరి దాకా ఆకాంక్షించారు. జయశంకర్ సార్‌ను రాష్ట్రప్రభుత్వం సమున్నతంగా గౌరవిస్తోంది. అయితే ట్యాంక్ బండ్‌పై జయశంకర్ సార్ విగ్రహం ఏర్పాటు చేస్తారన్నారు. రాష్ట్ర రాజధానిలో సార్ విగ్రహం ఉంటే తెలంగాణ ప్రజలు ఎంతో సంతోషిస్తారు. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించాలి"



నేడు జయశంకర్ సార్ పుట్టినరోజు సందర్భంగా దత్తపుత్రుడు బ్రహ్మం

సచివాలయంలో అమాత్యులేరీ?

నెలల తరబడి మొహం చాటేస్తున్న మంత్రులు.. సొంత నియోజకవర్గాల్లో కార్యక్రమాలకే పరిమితం

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పరిపాలనకు కేంద్రం.. సచివాలయం. మంత్రులంతా నిత్యం ఇక్కడికి వచ్చి పాలనాపరమైన బాధ్యతలను చూడడంతోపాటు ప్రజల నుంచి వచ్చే విజ్ఞప్తులను స్వీకరించి.. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకొనే వేదిక. కానీ, ప్రస్తుతం సచివాలయం పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా మారింది. మంత్రులు సచివాలయానికి రావడమే మానేశారు. మంత్రివర్గంలో 17 మంది మంత్రులుండగా.. సగానికి పైగా మంత్రులు ఎప్పుడో ఒకసారి మాత్రమే వస్తున్నారు. ఓ కీలక మంత్రి ఏకంగా మూడు నెలలుగా సచివాలయంలో అడుగే పెట్టలేదు. గ్రేటర్ హైదరాబాద్ నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న ముగ్గురు మంత్రులు మాత్రమే ప్రతిరోజూ సెక్రటేరియట్‌లో కనిపిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, తలసాని శ్రీనివాసయాదవ్ మాత్రమే రెగ్యులర్‌గా వస్తున్నారు. ఇక తలసాని అయితే సెలవు రోజుల్లో కూడా సెక్రటేరియట్‌లో కనిపిస్తారని పేరుంది. ఇతర మంత్రులంతా ఎక్కువగా సొంత నియోజకవర్గాల్లోనే ఉంటున్నారు. ఎన్నికలు మరో రెండేళ్లలోపే జరగనుండటం, సీఎం కేసీఆర్ తరచూ సర్వేలు చేయిస్తూ.. గెలుపోటములపై హెచ్చరికలు చేస్తుండడం వల్లే వారు నియోజకవర్గాలకు పరిమితమవుతున్నారని, అందుకే సచివాలయానికి రావడంలేదని తెలుస్తోంది.

తగ్గిన సందర్శకుల సంఖ్య

మంత్రుల హాజరు సరిగా లేకపోవడంతో సందర్శకుల సంఖ్య తగ్గిపోయింది. డీ బ్లాకులో గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉండే మంత్రి పేషీని ఓపీగా పిలుస్తారు. ఆ మంత్రి అడపాదడపా సచివాలయానికి వస్తున్నా.. విజ్ఞప్తులతో వచ్చేవారి సంఖ్యను తట్టుకోలేక ఓ దశలో ఇతర మంత్రుల చాంబర్‌లో కూర్చోవడం గమనార్హం. ఓ కీలక మంత్రి చాంబర్‌కు భారీగా సందర్శకులు వస్తుండటంతో ఆయన మూడు నెలలుగా సచివాలయం వైపే కన్నెత్తిచూడలేదు. కాగా పూర్వపు వెనుకబడిన జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులైతే ఆరు నెలలుగా తమ హాజరీని తగ్గించుకున్నారని తెలుస్తోంది. దీంతో తమ సమస్యలను మంత్రులకు చెప్పుకుందామని ఎంతో దూరం నుంచి వచ్చేవారు నిరాశకు గురవుతున్నారు. ఆయా శాఖల్లోని ఇన్‌వార్డుల్లో తమ అర్జీలను సమర్పించి పోతున్నారు. సీఎంవో ప్రత్యేక సెల్‌కు మూడేళ్లలో 70 వేలకు పైగా ఆర్జీలు రాగా.. ఎన్ని పరిష్కారమయ్యాయో లెక్కల్లేవు. అమాత్యులకు కూడా అదేస్థాయిలో అర్జీలు వచ్చినట్లు సమాచారం.

తిరుమల లడ్డూకు 214 ఏళ్ల తీపి చరిత్ర



తిరుమల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల వెళ్లి ఏడుకొండలవాడిని దర్శించుకుని లడ్డూ ప్రసాదం స్వీకరిస్తేనే భక్తులకు తృప్తి! ఇంటికి వెళ్లి ప్రసాదం పదుగురికీ పంచితే అదో సంతృప్తి. నోరూరించే తిరుమల లడ్డూకు తీపి చరిత్ర ఉంది. 1803లో తొలిసారిగా లడ్డూకు తొలి రూపమైన బూందీని ప్రసాదంగా ప్రవేశపెట్టారు. అంటే 214 సంవత్సరాల కిందట అన్నమాట! శ్రీవారి ఆలయంలో పల్లవుల కాలం నుంచే ప్రసాదాల తయారీ మొదలైంది. రెండో దేవరాయల కాలం నుంచి ప్రసాదాల తయారీ మరింత పెరిగింది. ఆ సమయంలోనే స్వామికి నైవేద్య వేళలు ప్రవేశపెట్టారు. భక్తులకు అందజేసే ప్రసాదాన్ని తిరుపొంగలి అనే పిలిచేవారు. తర్వాత సుఖీయం, అప్పం, వడ, అత్తిరసం, మనోహరపడి అంటూ రకరకాల ప్రసాదాలను ప్రవేశపెట్టారు. దూరప్రాంతాలకు తీసుకెళ్లేందుకు భక్తులు వడను మాత్రమే కోరేవారు. దీనిని గుర్తించి అప్పటి మద్రాసు ప్రభుత్వం.. 1803 నుంచి శ్రీవారి ఆలయంలో ప్రసాదాల విక్రయాన్ని ప్రారంభించింది. అప్పుడే లడ్డూకు తొలిరూపమైన బూందీని తీపి ప్రసాదంగా ప్రవేశపెట్టారు. 1940లో బూందీని లడ్డుగా తయారుచేసి విక్రయించడానికి శ్రీకారం చుట్టారు.



రెగ్యులర్ చేయాలంటూ నిరసన తెలుపుతున్న ట్రిపుల్ ఐటీ కాంట్రాక్ట్ ఉద్యోగులు

ఆ వర్సిటీలో అంతా కాంట్రాక్టు ఉద్యోగులే

బాసర ట్రిపుల్ ఐటీలో ఎనిమిదేళ్లుగా ఇదే పరిస్థితి

- రెగ్యులర్ చేయాలంటూ ఆందోళన

బాసర, ఆగస్టు 5: ఏ ప్రభుత్వరంగ సంస్థలోనైనా దాదాపు అంతా రెగ్యులర్ ఉద్యోగులే పనిచేస్తుంటారు. ఏవైనా పోస్టులు ఖాళీగా ఉండి.. సకాలంలో భర్తీ చేయలేని పరిస్థితి ఉంటే అవసరం మేరకు కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగులు పనిచేయడం చూస్తుంటాం. కానీ, నిర్మల్ జిల్లా బాసరలోని రాజీవ్‌గాంధీ సాంకేతిక వైజ్ఞానిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ)లో మాత్రం అందరూ కాంట్రాక్టు ఉద్యోగులే. అటెండర్ నుంచి పరిపాలనాధికారి వరకు అంతా కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న వారే ఉన్నారు. ఈ యూనివర్సిటీ ఏర్పాటై ఎనిమిదేళ్లు గడుస్తున్నా పూర్తిగా తాత్కాలికంగానే నడుస్తోంది. వర్సిటీలో 169 మంది అధ్యాపకులతోపాటు ఇతర విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న 113 మంది కూడా కాంట్రాక్టు పద్ధతిలోనే పనిచేస్తున్నారు. కేవలం 21 మంది అధ్యాపకులు మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులున్నారు. ఇక వర్సిటీ వైస్ చాన్సలర్‌తోపాటు డైరెక్టర్, పరిపాలనాధికారి, డీన్‌లు, చీఫ్ వార్డెన్‌లు, ఎగ్జామినేషన్ కంట్రోలర్ వంటి కీలక పోస్టుల్లో మాత్రం ఇన్‌చార్జులు కొనసాగుతున్నారు. కాగా పీహెచ్‌డీ చేసి.. కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నవారు ఎప్పుడైనా పర్మినెంట్ కాక పోతుందా అన్న నమ్మకంతో కొనసాగుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం కేసీఆర్ పలు శాఖల్లో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకున్నారు. ఇందుకు మార్గదర్శకాలు కూడా విడుదల చేశారు. అయితే అందులో స్వయం ప్రతిపత్తి గల యూనివర్సిటీలను మాత్రం పేర్కొనలేదు. దీంతో ఎంతో ఆశతో ఉన్న బాసర ట్రిపుల్ ఐటీ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు ఉద్యోగులు నిరాశకు గురయ్యారు. వీరంతా తమను రెగ్యులరైజ్ చేయాలంటూ ఎంతో కాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఎన్నోసార్లు నిరసనలు తెలిపినా ఫలితం లేకుండా పోయింది. దీంతో బాసర ఆర్జీయూకేటీలో గత 25 రోజుల నుంచి విధులు నిర్వహిస్తూనే.. ప్రతిరోజూ భోజన విరామ సమయంలో నిరసన తెలుపుతున్నారు. యూనివర్సిటీ నుంచిగానీ, ప్రభుత్వం నుంచిగానీ స్పందన లేకపోవడంతో ఈ నెల రెండో, మూడో వారంలో విధులను బహిష్కరించి సమ్మె చేయనున్నట్లు ప్రకటించారు.



బాసరలోని ఆర్జీయూకేటీ


అఫ్ఘాన్ ఒలింపిక్ శాంతి పతకం అందుకుంటున్న గజల్ శ్రీనివాస్

గజల్ శ్రీనివాస్‌కు శాంతి పతకం

కాబూల్, ఆగస్టు 5: గజల్‌గాయకుడు, స్వచ్ఛఆంధ్ర బ్రాండ్ అంబాసిడర్ డాక్టర్ గజల్ శ్రీనివాస్‌కు అఫ్ఘానిస్థాన్ ఒలింపిక్ శాంతి పతకం దక్కింది. శాంతి, స్నేహ గీతాలను ఆలపించి తన శాంతియాత్ర ద్వారా భారత్-అఫ్ఘాన్‌ల ప్రజల మధ్య సుహృద్భావ వాతావరణాన్ని నెలకొల్పుతున్నారంటూ ఆయనకు ఆఫ్ఘాన్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మహ్మద్ జహీర్ అక్బర్ పతకంతో సత్కరించారు.


వేమునూర్ వద్ద ఇంటెక్‌వెల్ పనులను పరిశీలిస్తున్న అధికారులు

కాళేశ్వరం ప్రాజెక్టు అద్భుతం: ఎస్‌కే జోషి

ధర్మారం, ఆగస్టు 5: కాళేశ్వరం ప్రాజెక్టును అత్యాధునిక టెక్నాలజీతో, అద్భుతంగా నిర్మిస్తున్నారని రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎస్.కె.జోషి, వైద్య ఆరోగ్యశాఖ చీఫ్‌సెక్రటరీరాజేశ్వర్ తివారీ అన్నారు. శనివారం పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం వేమునూర్ వద్ద నిర్మిస్తున్న ఇన్‌టేక్‌వెల్ నిర్మాణ పనులను, సాయంపేట వరకు అండర్ టన్నెల్ నిర్మాణ పనులను వారు పరిశీలించారు.

వీఏఓలకు ఏప్రిల్ నుంచే గౌరవ వేతనం

హైదరాబాద్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వీఏఓలకు రూ.3 వేల గౌరవ వేతనం ఏప్రిల్ నుంచే ఇస్తామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. 18,836 మంది వీఏఓలకు గౌరవ వేతనం ఇస్తామన్న హామీని నిలబెట్టుకున్నామని, ప్రభుత్వ పథకాలు అర్హుల కు అందేలా వీఏఓలు కూడా కృషి చేయాలన్నారు. గౌరవ వేతనం అందజేస్తున్నందుకు వీఏఓలు శనివారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో జూపల్లిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీకాంత్ కిడ్నాప్ కేసులో మరో ఇద్దరి అరెస్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణకు చెందిన డాక్టర్ శ్రీకాంత్ గౌడ్‌ను ఓలా డ్రైవర్ కిడ్నాప్ చేసిన కేసులో ఇద్దరు కీలక నిందితులు సుశీల్, అనూజ్ సోదరులను ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ దగ్గరలోని దురాలా గ్రామంలో అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. వారిపై రూ.50 వేల చొప్పున రివార్డు ఉంది. ఇదే కేసులో గత నెలలో నలుగురు నిందితులను అరెస్టు చేశారు.

తుమ్మలను పరామర్శించిన ఎంపీ కవిత

హైదరాబాద్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును నిజామాబాద్ ఎంపీ కవిత పరామర్శించారు. ఆయనత్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

మునిసిపాలిటీల్లో స్వచ్ఛ ఆటో ట్రిప్పర్లు

హైదరాబాద్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ తరహాలో రాష్ట్రంలోని 72 మునిసిపాలిటీల్లో డ్రైవర్ కం ఓనర్ స్కీం కింద స్వచ్ఛ ఆటో ట్రిప్పర్ వాహనాలను సమకూర్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. వాహనాల కొనుగోలుకు బ్యాంకుల నుంచి రుణాలు సమకూరుస్తారు. లబ్ధిదారుల వాటాగా ఎస్సీ, ఎస్టీలు 10%, ఇతరులు 20% చెల్లించాలి. బ్యాంకు రుణాన్ని ఐదేళ్లలో చెల్లించాలి. ప్రతి ఆటో ట్రిప్పర్‌కు 650-750 నివాస గృహాలు, ఇతర వాణిజ్య సముదాయాలను కేటాయిస్తారు. గృహాల నుంచి యూజర్ చార్జీలను మునిసిపాలిటీ నిర్ణయించిన మేరకు వసూలు చేసుకోవాలి.

ఒక్కరోజులోనే నెరవేరిన సీఎం హామీ

మేడ్చల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లాలో తొలి గ్రామ సభలు నిర్వహించిన సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు ఒక్కరోజులోనే నెరవేరాయి. శామీర్‌పేట్ మండలం కేశవరం, లక్ష్మాపూర్ గ్రామాలకు శుక్రవారం సీఎం కురిపించిన వరాల అమలుకు శనివారం అనుమతులు జారీ అయ్యాయి. ప్రభుత్వం కేశవరం గ్రామానికి రూ.12.26 కోట్లు, లక్ష్మాపూర్‌కు రూ.15.50కోట్లు మంజూరు చేసింది.

పరిహారం ఇచ్చాకే ఖాళీ చేయిస్తాం: సర్కారు

హైదరాబాద్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి):మిడ్‌మానేరు ప్రాజెక్టు నిర్మాణంతో నిర్వాసితులుగా మారుతున్న గ్రామస్థులకు పరిహారం చెల్లించిన తర్వాతే అక్కడి ప్రజలను ఖాళీ చేయిస్తామని రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రభుత్వ న్యాయవాది(జీపీ) హైకోర్టుకు హామీ ఇచ్చారు. పరిహారం చెల్లించకుండానే గ్రామాన్ని ఖాళీ చేయాలంటూ వేములవాడ తహసీల్దార్ ఇచ్చిన నోటీసులను సవాల్ చేస్తూ కరీంనగర్ జిల్లాకు చెందిన మల్లేశంతోపాటు 45 మంది దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లను జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు విచారించారు. తదుపరి విచారణను ఈనెల 11కు వాయిదా వేశారు.


ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద ధర్నాకు కిషన్ రెడ్డి మద్దతు

రైతే రాజన్నాడు.. బేడీలు వేస్తున్నాడు: లక్ష్మణ్

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రైతులు రాజుల్లా బ్రతికే విధంగా చేస్తానన్న సీఎం కేసీఆర్.. గిట్టుబాటుధర అడిగిన రైతుల చేతికే బేడీలు వేస్తున్నాడని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె. లక్ష్మణ్ ధ్వజమెత్తారు. టీఆర్ఎస్ పాలనలో వ్యవసాయరంగం సంక్షోభంలో కూరుకుపోయిందని విమర్శించారు. వ్యవసాయ రంగ సమస్యలపై బీజేపీ కిసాన్‌మోర్చా శనివారం నిర్వహించిన ఒకరోజు వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కేంద్రం తీసుకువచ్చిన ఫసల్‌బీమా యోజన అమలులో టీఆర్ఎస్ సర్కారు విఫలమయిందని విమర్శించారు. తమ బాధలు సీఎంకు చెప్పుకుందామంటే ప్రగతిభవన్‌లోకి కాలుపెట్టే అవకాశం కూడా రైతులకు చిక్కటం లేదని అన్నారు. కేటీపీఎస్ 5, 6 దశల ప్లాంట్ల నిర్మాణం నుంచి నాన్-ఇయర్లీ మెయింటెనెన్స్ కింద పనిచేస్తున్న కార్మికులను ఆన్యువల్ కాంట్రాక్ట్ కార్మికుల మాదిరిగానే పరిగణించాలని బీజేఎల్పీ నేత కిషన్‌రెడ్డి విద్యుత్ సంస్థల యాజమాన్యాలను కోరారు.

పంచాయతీలకు జాయింట్ 'చెక్' పవర్

- సర్పంచ్‌తో పాటు కార్యదర్శి సంతకం

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల నిధుల వినియోగంలో జాయింట్ 'చెక్' పవర్ విధానం కొనసాగనుంది. ఇక నుంచి సర్పంచ్‌తో పాటు, కార్యదర్శి కూడా సంతకం చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. 'ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు గ్రామ కార్యదర్శిని ఎగ్జిక్యూటివ్ అథారిటీగా నియమించింది. ఆయా పథకాల నిధులతో పాటు పంచాయతీల నిధులు డ్రా చేసేందుకు సర్పంచ్‌తో పాటు కార్యదర్శికి కూడా పవర్ ఇచ్చారు. ఇక నుంచి చెక్కులపై ఇద్దరూ సంతకం చేయాల్సి ఉంటుంది..' అని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పంచాయతీల సొంత నిధుల వినియోగంపై జాయింట్ చెక్ పవర్‌ను కొంతకాలం మినహాయించడం, ఆ విధానాన్ని గతంలో కోర్టు కొట్టివేయడంతో ఇప్పుడు సవరణలు చేశారు.

మస్తు సెలవులు

- 12 నుంచి 4 రోజులు సెలవు

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు బొనాంజా! రెండో శనివారం.. ఆదివారం.. కృష్ణాష్టమి, పంద్రాగస్టు.. వరుస సెలవులు. ఈనెల 12 నుంచి 15 వరకు నాలుగు రోజులు ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు రానున్నాయి. 16న పని దినం కాగా.. 17న పార్సీ నూతన సంవత్సరం (ఐచ్ఛిక సెలవు). దాంతో ఉద్యోగులు 16న సీఎల్ పెట్టుకుంటే.. వరుసగా ఆరు రోజులు సెలవులు వాడుకోవొచ్చు. దాంతో ఉద్యోగులు విహార యాత్రలకు ప్లాన్ చేసుకుంటున్నారు. ఇదే కాక ఈనెల 6, 7 తేదీలు కూడా సెలవులు వచ్చాయి. 6వ తేదీ ఆదివారం కాగా, 7న రాఖీపౌర్ణమి (ఐచ్ఛిక సెలవు). ఈనెల 25న (శుక్రవారం) వినాయక చవితి -సెలవు దినం. 27 ఆదివారం. శనివారం లీవు పెట్టుకుంటే మూడు రోజులు కలిసి రానుంది. ఇలా ఆగస్టు నెలంతా సెలవుల సందడి ఉంది.

చెరువుతోనే తెలంగాణ బతుకు

- రాష్ట్రంలో చెరువు లేని గ్రామమే లేదు
- భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్ రావు
- నీరునే ఇంటిపేరుగా పెట్టుకున్న హరీశ్: నందిని సిధారెడ్డి

చిక్కడపల్లి/హైదరాబాద్, ఆగస్టు 5: యావత్ తెలంగాణ ప్రజల బతుకు చెరువులతో ముడిపడి ఉందని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. సత్కళాభారతి ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ కవి డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్యులు రచించిన కాకతీయ వైభవం పద్య కావ్యం ఆవిష్కరణ కార్యక్రమం వైభవంగా జరిగింది. తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధారెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించారు. రచయిత శ్రీనివాసాచార్యులు ఆ పుస్తకాన్ని హరీశ్‌రావుకు అంకితమివ్వగా మంత్రి ఆయన కాళ్లకు నమస్కరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 65 వేల చెరువుల పూడికలు తీసి నీటితో నింపాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. పూర్తి ఆయకట్టుకు నీళ్లందిచడమే తమ లక్ష్యం అన్నారు. తెలంగాణాలో చెరువులు లేని గ్రామమే లేదని, కాకతీయుల ఔన్నత్యాన్ని, జలం ఆవశ్యకత, ప్రజలతో జలం సంబంధాన్ని ఈ రచనలో చక్కగా చెప్పారన్నారు. దాశరథి తర్వాత రుబాయి కవితలు రాసిన తెలంగాణ కవి డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్యులు అని కొనియాడారు. నందిని సిధారెడ్డి మాట్లాడుతూ తన్నీరు అంటే తమిళంలో నీరు అని, నీరునే ఇంటిపేరుగా హరీశ్ పెట్టుకున్నారని అన్నారు. అధ్యక్షత వహించిన ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి మాట్లాడుతూ మిషన్ కాకతీయకు నేతృత్వం వహిస్తున్న మంత్రి హరీశ్‌కు పుస్తకం అంకితం ఇవ్వడం సముచితమేనన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ ఎల్లూరి శివారెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


హరీశ్‌ను సత్కరించి 'కాకతీయ వైభవం' పుస్తకాన్ని అంకితం చేస్తున్న శ్రీనివాసాచార్యులు

కాంట్రాక్టు పనులపై జీఎస్టీ తగ్గింపు

- 18% నుంచి 12 శాతానికి కుదింపు
- భవిష్యత్తు ప్రాజెక్టులకే వర్తింపు
- జీఎస్టీ కౌన్సిల్ సమావేశం అంగీకారం
- టెక్స్‌టైల్ పన్ను తగ్గింపునకూ ఓకే: కేటీఆర్
- సెప్టెంబరు 9న భేటీ హైదరాబాద్‌లో



న్యూఢిల్లీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వివిధ కాంట్రాక్టు పనులపై జీఎస్టీలో విధించిన పన్ను శాతాన్ని తగ్గించడానికి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అంగీకరించారని మంత్రి కేటీఆర్ వెల్లడించారు. ప్రస్తుతమున్న 18 శాతం పన్నును 12 శాతానికి తగ్గించడానికి జీఎస్టీ కౌన్సిల్ అంగీకారం తెలిపిందని, ఇది భవిష్యత్తులో చేపట్టబోయే ప్రాజెక్టులకు వర్తిస్తుందని వివరించారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జైట్లీ అధ్యక్షతన శనివారం జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం తరపున కేటీఆర్ పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. "ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వాల ప్రాథమిక కర్తవ్యం సాగు, తాగునీరు అందించడం. సమాజంలో అట్టడుగున ఉన్నవారికి ఇళ్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన చేయడం. తెలంగాణలో ప్రస్తుతం రూ.2.30 లక్షల కోట్ల వ్యయంతో వివిధ పనులు జరుగుతున్నాయి. వాటిలో లక్ష కోట్లకు పైగా విలువైన ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులు, 20 వేల కోట్లతో మిషన్ కాకతీయ; మిషన్ భగీరథ - 43 వేల కోట్లు, 18 వేల కోట్లతో హౌజింగ్ పనులతోపాటు మున్సిపల్, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించిన మరో 30 వేల కోట్ల రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ పనులపై జీఎస్టీలో 18 శాతం పన్ను విధిస్తే 19 వేల కోట్ల అదనపు భారం పడుతుంది. దాన్ని తగ్గించాలని కౌన్సిల్ సమావేశంలో డిమాండ్ చేశాం. అవసరమైతే ఈ అంశంపై కోర్టుకు వెళ్తామని, కానీ 18 శాతాన్ని ఒప్పుకోబోమని తేల్చి చెప్పాం. దాంతో ప్రస్తుతమున్న 18 శాతం నుంచి 12 శాతానికి తగ్గించడానికి అంగీకరించారు" అని కేటీఆర్ వివరించారు. అయితే, ఇప్పటికే పనులు జరుగుతున్న, టెండర్ అయిపోయిన ప్రాజెక్టులపై 5 శాతం మాత్రమే పన్ను విధించాలని చేసిన డిమాండ్‌ను పరిశీలిస్తామని ఆర్థిక మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. తన డిమాండ్‌కు జార్ఖండ్, గుజరాత్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలు మద్దతు పలికాయని, సమర్థనీయమైన డిమాండ్ అని చాలా రాష్ట్రాలు అభిప్రాయపడ్డాయని తెలిపారు. ఆరు శాతం పన్ను తగ్గించడం ద్వారా భవిష్యత్తులో చేపట్టబోయే ప్రాజెక్టులపై కొంత భారం తగ్గుతుందన్నారు. అలాగే, టెక్స్‌టైల్ రంగంపై విధించిన పన్నును తగ్గించడానికి కూడా కౌన్సిల్ అంగీకరించిందని వెల్లడించారు. అలాగే, గ్రానైట్, బీడీ పరిశ్రమపై విధించిన పన్నును తగ్గించాలని విజ్ఞప్తి చేశామని తెలిపారు. మరోవైపు, ఇప్పటి వరకూ 20 జీఎస్టీ కౌన్సిల్ సమావేశాలు జరిగాయని, కానీ, తెలంగాణలో ఒక్క సమావేశం కూడా జరగనందున వచ్చే సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించాలని కోరానని కేటీఆర్ చెప్పారు. దానికి జీఎస్టీ కౌన్సిల్ అంగీకరించిందని, సెప్టెంబరు 9న జరిగే సమావేశం హైదరాబాద్‌లో జరుగుతుందని తెలిపారు.



నేనూ మీ అభిమానినే..!

అభిమానానికి ప్రాంతీయ భేదాలు.. పార్టీలు.. గుర్తులు కనిపించవు అనడానికి ఈ చిత్రమే ఉదాహరణ. ఈ ఫొటోలో సెల్ఫీ తీస్తున్నదెవరో గుర్తుపట్టారా?.. ఇంకెవరు ఆమె తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కుమార్తె, టీఆర్ఎస్ పార్టీ ఎంపీ కవిత. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో భాగంగా ఓటు వేయడానికి శనివారం ఎంపీలంతా పార్లమెంట్ భవన్‌కు తరలివచ్చారు. వారిలో తన అభిమాన నటుడు చిరంజీవి కనిపించడంతో వెంటనే ఫోన్ తీసిన కవిత.. ఇలా సెల్ఫీలో బంధించారు.

పోలీస్ వైఫైలో నయీం 'షాడో'!

- శేషన్న జాడను పసిగట్టిన నిఘావర్గాలు

హైదరాబాద్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): గ్యాంగ్‌స్టర్ నయీం నీడను నిఘా వర్గాలు గుర్తించాయి. నయీం కుడిభుజం లాంటి శేషయ్య అలియాస్ శేషన్న ఆచూకీని నిఘా వర్గాలు పసిగట్టేశాయి. నయీం ఎన్‌కౌంటర్ తర్వాత కనిపించకుండాపోయిన శేషన్న ఆచూకీని ఇటీవలే గుర్తించినట్లు తెలిసింది. రెక్కీ నిర్వహించడం, ప్రత్యర్థులను బెదిరించడం, మాట వినని వారిని తీవ్రస్థాయిలో చిత్రహింసలకు గురిచేయడంలో శేషన్న నిష్ణాతుడు. నయీం నేర సామ్రాజ్య విస్తరణలో అతనిదే కీలక పాత్ర. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన శేషన్న గతంలో కొంతకాలం పీపుల్స్‌వార్ పార్టీలో పనిచేసి బయటకొచ్చాడు. కొద్ది రోజుల క్రితం పోలీస్ బలగాలు నల్లమలలోనూ పెద్ద ఎత్తున గాలించిన క్రమంలోనే శేషన్న ఎక్కడున్నాడనే దానిపై పక్కా సమాచారాన్ని నిఘా వర్గాలు సేకరించగలిగాయి. నయీం దందాలపై సిట్ రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 197 కేసులు నమోదు చేసింది. ఆయా కేసులకు సంబంధించి ఇప్పటికే న్యాయస్థానాల్లో 18 చార్జిషీట్లు దాఖలు చేశారు. మరికొన్ని కేసుల్లో చార్జిషీట్లు దాఖలు చేసేందుకు దర్యాప్తు అధికారులు సిద్ధమవుతున్నారు. కాగా నయీం కేసుల్లో నిందితులుగా ఉన్న వారిలో పలువురు ఇప్పటికే బెయిల్‌పై విడుదలయ్యారు. మరికొన్ని కేసుల్లో తమవద్ద ఆధారాలు లేవని కేసు మూసివేతకు అనుమతి కోరుతూ దర్యాప్తు అధికారులు కోర్టును ఆశ్రయించారు.

కేసీఆర్ భగ్గు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రం అనుసరిస్తున్న ఏకపక్ష విధానానికి వ్యతిరేకంగా న్యాయ పోరాటం చేయాలని తీర్మానించారు. ఇదే అంశంపై ఆదివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాయాలని నిర్ణయించారు. ఇప్పటికే పనులు జరుగుతున్న ప్రాజెక్టులకు జీఎస్టీ వర్తింపజేస్తే తెలంగాణకే కాకుండా అన్ని రాష్ట్రాలకూ అన్యాయం జరుగుతుందని కేసీఆర్ స్పష్టం చేశారు. దీనిని జాతీయ సమస్యగా పరిగణించాలని విన్నవిస్తున్నారు. గతంలో జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశాల్లోనూ ఈ అంశాన్ని ప్రభుత్వం లేవనెత్తింది. శనివారం ఢిల్లీలో జరిగిన సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం తరపున మంత్రి కేటీఆర్ మరోసారి తన వాదనలు వినిపించారు. నీటిపారుదల ప్రాజెక్టులు, మిషన్ భగీరథ, గృహ, రహదారుల నిర్మాణం వంటి కార్యక్రమాలకు జీఎస్టీని ఎత్తివేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. దాంతో, ఈ నాలుగు ప్రాజెక్టులకూ భవిష్యత్తులో జరగబోయే పనులకు జీఎస్టీని 18 నుంచి 12 శాతానికి తగ్గిస్తున్నట్లు కౌన్సిల్ తీర్మానించింది. అదే సమయంలో, జీఎస్టీ అమల్లోకి రాక ముందు ప్రారంభించి ఇప్పటికీ సాగుతున్న పనులకు కూడా 12 శాతం జీఎస్టీ వసూలు చేయాలని కౌన్సిల్ నిర్ణయించింది. ఈ నిర్ణయంపై సీఎం కేసీఆర్ మండిపడుతున్నారు. జీఎస్టీ అమల్లోకి రాకముందు టెండర్లు పిలిచిన పనులకు ఇప్పుడు 12 శాతం ఎలా వసూలు చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులకు జీఎస్టీని అమలు చేయడం అన్యాయమన్నారు. జూలై ఒకటికి ముందు ప్రారంభించిన ప్రాజెక్టులకు జీఎస్టీ అమలు చేస్తే ఒక్క తెలంగాణ ప్రభుత్వానికే రూ.19 వేల కోట్ల నష్టం వాటిల్లుతుందని పునరుద్ఘాటించారు. దీనిని తెలంగాణ రాష్ట్ర సమస్యగా కాకుండా జాతీయ సమస్యగా పరిగణనలోకి తీసుకోవాలని విన్నవించారు. ఇది బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత తీసుకున్న నిర్ణయమని, అమలు చేయడం కష్టమని వివరిస్తున్నారు. ప్రాజెక్టుల వ్యయాన్ని కూడా బడ్జెట్‌లో పొందుపరచాల్సి ఉంటుందని, ఆర్థిక సంవత్సరం మధ్యలో ఇది సాధ్యం కాదని సీఎం అభిప్రాయపడ్డారు. జీఎస్టీ వర్తింపుతో అంచనా వ్యయాలు పెరుగుతాయని, పెరగనున్న అంచనాలను ఇప్పుడు బడ్జెట్‌లో పొందుపర్చలేమని తెలిపారు. కాబట్టి కేంద్రం తన నిర్ణయాన్ని పునః సమీక్ష చేసుకోవాలని డిమాండ్ చేశారు. తాము పదే పదే చేస్తున్న విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకోకపోతే న్యాయ పోరాటానికి దిగుతామని హెచ్చరించారు.

11న మోదీతో భేటీ

ఈనెల 11వ తేదీన ఉప రాష్ట్రపతిగా వెంకయ్య నాయుడు ప్రమాణ స్వీకారానికి హాజరుకావడానికి సీఎం కేసీఆర్ ఢిల్లీ వెళ్లనున్నారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని నేరుగా కలిసి జీఎస్టీపై చర్చించాలని కేసీఆర్ భావిస్తున్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. నాలుగు అంశాలపై జీఎస్టీ అమలును పునః సమీక్ష చేయాలని గుర్తు చేయడంతోపాటు రిజర్వేషన్లపై ఒక పత్రాన్ని సమర్పించనున్నారని సమాచారం.

హామీల అమలులో కేసీఆర్ విఫలం

టీఆర్ఎస్ సర్కారును నిలదీయాలి.. ఉద్యమానికి ఊపు తెచ్చింది కాంగ్రెస్సే

- మేం అధికారంలోకి రాగానే కరీంనగర్‌లో.. మెడికల్ కళాశాల ఏర్పాటు: జానారెడ్డి
- పొన్నం నిరశన దీక్షకు సంఘీభావం

కరీంనగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో సీఎం కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత కె.జానారెడ్డి ఆరోపించారు. సకల జనులకు వ్యతిరేకంగా పనిచేస్తూ నియంతృత్వ పాలన సాగిస్తున్నా టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు అడుగడుగునా నిలదీయాలని పిలుపునిచ్చారు. కరీంనగర్‌లో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేస్తామన్న హామీని సీఎం కేసీఆర్ నిలబెట్టుకోవాలంటూ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష శిబిరాన్ని శనివారం జానారెడ్డి సందర్శించి సంఘీభావం తెలిపారు. పొన్నం ప్రభాకర్ దీక్షకు అనుమతి ఇవ్వకుండా, దీక్షకు విద్యార్థులను పంపించవద్దని యాజమాన్యాలను, రావద్దని విద్యార్థులను ప్రభుత్వం హెచ్చరించడం శోచనీయమన్నారు. శాంతి భద్రతల రక్షణ సాకుతో దీక్షను భగ్నం చేసే కుట్రను మేధావులు, విద్యార్థులు, అన్నివర్గాల ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రోజుకో రీతిలో చేపట్టిన ధర్నాలు, నిరసనలు, ఆందోళనలకు అప్పటి సీమాంధ్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చి ఉండకపోతే తెలంగాణ వచ్చి ఉండేదా? అని ప్రశ్నించారు. తాము అధికారంలో ఉండి కూడా కిరణ్‌కుమార్‌రెడ్డి సర్కారుపై అంతర్గతంగా ఒత్తిడి తెచ్చి అనుమతులు ఇప్పించామని తెలిపారు. సీమాంధ్ర ఎమ్మెల్యేలంతా రాజీనామా చేస్తే రాత్రికి రాత్రి కేసీఆర్ తన ఇంటికి వచ్చింది నిజం కాదా? అని జానారెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు నాంది పలికింది, కేసీఆర్‌కు రాజకీయ జన్మనిచ్చింది కూడా కరీంనగర్ జిల్లాయేనని, ఈ జిల్లా ప్రజల రుణం తీర్చుకునేందుకు మెడికల్ కళాశాల ఇచ్చి హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. లేదంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏర్పాటు చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కటకం మృత్యుంజయం, సీఎల్పీ ఉప నేత టి.జీవన్‌రెడ్డి, ఆరెపల్లి మోహన్, సిరిసిల్ల రాజయ్య, సుద్దాల దేవయ్య, కోడూరి సత్యనారాయణగౌడ్, బొమ్మ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


పొన్నం ప్రభాకర్ నిరాహార దీక్షకు మద్దతుగా కూర్చున్న సీఎల్పీ నేత జానారెడ్డి, కాంగ్రెస్ నాయకులు

అనుమతి నిరాకరణతో ఇంటి వద్దనే దీక్ష..

కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో చేయ తలపెట్టిన దీక్షకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో పొన్నం ప్రభాకర్ తన ఇంటివద్దే దీక్ష చేపట్టారు. ఆయనకు మద్దతుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. అరెస్టు చేస్తారని ప్రచారం జరగడంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని పెద్ద సంఖ్యలో కార్యకర్తలను తరలించారు. దీక్షకు బీజేపీ, ఆమ్‌ఆద్మీ పార్టీలతోపాటు పలు కుల, స్వచ్ఛంద సంఘాలు, జిల్లా ప్రజలు సంఘీభావం తెలిపారు. 1200 మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. పొన్నం నివాసాన్ని దిగ్బంధం చేయగా.. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు రాత్రంతా పొన్నం నివాసంలోనే ఉండి అరెస్టు చేయకుండా రక్షణగా నిలిచారు.

ప్రజల్లోకి వెళ్దాం

- కోదండను కలుపుకుందాం
- సీపీఎం రాష్ట్ర కమిటీ నిర్ణయం

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అధికార టీఆర్ఎస్‌పై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని సీపీఎం రాష్ట్ర కమిటీ అభిప్రాయపడింది. మంథని మధుకర్, నేరెళ్ల ఘటనలతో పాటు, రాష్ట్రంలో జరుగుతున్న పలు సంఘటనల వల్ల స్థానికంగా టీఆర్ఎస్ ప్రజలకు దూరమవుతోందని సీపీఎం అంచనా వేస్తోంది. ఈ క్రమంలో మరింతగా ప్రజల్లోకి వెళ్లాలని, టీమాస్‌ను విస్తృతం చేయాలని నిర్ణయించింది. సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశం శనివారం ఎంబీ భవన్‌లో జరిగింది. టీ-మాస్‌ను విస్తృతం చేయాలని, జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ కోదండరామ్ నేతృత్వంలోని సంఘాలూ అందులో భాగస్వామ్యం అయ్యేలా చూడాలని నిర్ణయించారు. వివిధ పార్టీల నేతల చేరికతో టీఆర్ఎస్‌లో వర్గాలు పెరిగాయని, దీంతో ఆ పార్టీ ప్రజలకు దూరమవుతోందని సమావేశం అభిప్రాయపడింది. జాతీయ మహాసభలను వచ్చే ఏడాది హైదరాబాద్‌లో ఏప్రిల్ 11 నుంచి 15 వరకు నిర్వహించాలని భావిస్తున్నారు. రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై లోతైన అధ్యయనం చేయాలని సీపీఎం రాష్ట్ర నేతలకు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు సూచించారు. వామపక్ష నేతలకు ప్రజలతో సంబంధాలు కీలకమని వీరభద్రం పేర్కొన్నారు.

నవ్య

కుటుంబ కదంబం

ఫ్రెండ్స్ అందరూ కలిసి సరదాగా గడపాలంటే సినిమాలు ఓ ఆప్షన్. మరి సినిమా నటీనటులు తమ ఫ్రెండ్స్‌తో ఎలా గడుపుతారు? వారి ఆప్షన్స్ ఎలా ఉంటాయి.. ఆరుబయట అందరిలా తిరిగే స్వేచ్ఛ ఉండదుగా... మరి దోస్తులతో వారి బాతాఖానీ ఎక్కడ సాగుతుంది..? దేని గురించి చర్చ నడుస్తుంది? 'స్నేహితుల దినోత్సవం' సందర్భంగా సినిమా పరిశ్రమలోని ఓ యంగ్ ఫ్రెండ్స్ బ్యాచ్‌ను 'నవ్య' పలకరించింది..



happy Friendship Day



ఎక్కడో పుట్టి... ఎక్కడో పెరిగి..!

నాకు స్నేహం విలువ తెలుసు!

- లక్ష్మీ మంచు

జీవితం చాలా వేగంగా సాగుతోంది. నా చిన్నప్పటి నుంచి నాతో కలిసి మెలిసి తిరిగిన ఫ్రెండ్స్ ఇప్పుడు నాతో టచ్‌లో లేరు. తుమ్మినా దగ్గినా అన్నీ వాళ్లకే చెప్పుకునేదాన్ని. అకారణంగా మా ఫ్రెండ్‌షిప్‌లో టచ్ పోయింది. మా మధ్య ఈర్ష్యలు లేవు. ఎలాంటి తారతమ్యాలు లేవు. గొడవలు అసలేం లేవు. అయినా విడిపోయాం. అందువల్ల నాకు ఫ్రెండ్‌షిప్ వేల్యూ తెలుసు. అందుకే ఇప్పుడు సినిమా పరిశ్రమలో నాకున్న స్నేహాలను చాలా జాగ్రత్తగా చూసుకుంటున్నాను. మా స్నేహానికి బౌండరీ వేసుకుని, ఫెన్సింగ్ వేసుకుని కాపాడుకుంటున్నాను. ఎందుకంటే మేం సెలబ్రిటీలం. సోషల్ మీడియా వచ్చాక ప్రతి ఒక్కరూ ఒపీనియన్ చెప్పేవారే. మేం వేసుకున్న డ్రస్సు నుంచి లిప్‌స్టిక్ రంగు వరకు ప్రతి ఒక్కరికీ ఒక ఒపీనియన్ ఉంటుంది. దాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తుంటారు.. అలాంటి వారిని వాట్సాప్‌లోనూ, ట్విట్టర్‌లోనూ నేను బ్లాక్ చేసినంతగా ఎవరూ చేసి ఉండరేమో. అందుకే ఫ్రెండ్స్‌తో పార్టీలకు వెళ్లడాన్ని పెద్దగా ఇష్టపడను. షూటింగులనుంచి వచ్చాక స్నానం చేసి ఏ పైజామాలో వేసుకుని సన్నిహితులంతా ఎవరో ఒకరి ఇంట్లో కలవడానికి ఇష్టపడతాం. సరదాగా కబుర్లు చెప్పుకుని టీవీలు చూస్తూ, నచ్చింది తింటూ గడుపుతాం. నాకు పరిశ్రమలో చాలా మంది ఫ్రెండ్స్ ఉన్నారు. రానా, చరణ్, బన్ని, నితిన్, రెజీనా , తాప్సీ, ప్రకాశ్ అన్నయ్య, నవీన్, సాయిధరమ్‌తేజ్.. లిస్టు సాగుతూ ఉంటుంది. విష్ణు, మనోజ్ ఫ్రెండ్సంతా నా ఫ్రెండ్సే. నితిన్‌ని టిన్‌టిన్ అని పిలుస్తాం. ఎన్టీఆర్, మనోజ్ ఒక చోట చేరారంటే నేను వారి దరిదాపుల్లో కూడా ఉండను. వాళ్ల మాటల్ని, గొడవలను వినడానికి కూడా ఎక్స్‌ట్రా ఎనర్జీ కావాలి. వామ్మో.. నేను వాళ్ల మధ్య తలదూర్చను. రెజీనా వాళ్ల అమ్మకైతే నాకు, మనోజ్‌కీ గొడవలు తీర్చడానికే సరిపోతుంది. ఆవిడ చెన్నై నుంచి వచ్చే ప్రతిసారీ కేకు తెస్తుంది. 'నాకు కావాలంటే నాకు కావాలి' అని నేను, మనోజ్ కొట్టుకుంటాం. ఆవిడ సర్దిచెప్పి 'ఈసారి రెండు తెస్తానులే' అని అంటుంది.

నేను చేసే సేవా కార్యక్రమాలంటే ఆవిడకి చాలా ఇష్టం. తెలిసిన వాళ్ల ద్వారా సాయం చేయిస్తుంటుంది.

తాప్సీ ది గ్రేట్!

తాప్సీతో నా ఫ్రెండ్‌షిప్ అందరికీ తెలిసిందే. 'చూడు తాప్సీ.. నువ్వు షైన్ అయ్యేకొద్దీ..ఆ వెలుగులు నామీద కూడా పడుతూ ఉంటాయి. వేసే ప్రతి అడుగూ జాగ్రత్తగా వెయ్యి' అని చెప్తుంటా. ఇటు తెలుగులోనూ, అటు బాలీవుడ్‌లోనూ తను చేస్తున్న ప్రాజెక్టులు చూస్తే నాకు చాలా ఆనందంగా అనిపిస్తుంది. అటు హీరోలతోనూ, హీరోయిన్‌లతోనూ అంత తేలిగ్గా ఎలా కలిసిపోగలుగుతావ్? అని చాలా మంది అడుగుతుంటారు. ఎందుకంటే వాళ్లెవరూ నాకు పోటీకాదు. నేను 18 ఏళ్ల అమ్మాయిగానూ, 80 ఏళ్ల వృద్ధురాలిగానూ నటించగలను. అందుకే అందరితోనూ నేను హ్యాపీగా ఉంటా.



రకుల్ ముందుంటుంది..!

రకుల్‌కి మా ఇంట్లో దోశలు, చికెన్ పులుసు చాలా ఇష్టం. 'హాఫ్ దోశ చాలు..' అని చెబుతుంది. కానీ టేస్ట్ చేసి వదలబుద్ధి వేయక మాటల్లో పడి మూడు తినేస్తుంది. 'ఇలా ఎందుకు నాతో తినిపిస్తావ్' అని గొడవచేస్తుంది. అలాగని ఆ పిల్లకు చిన్న చిన్న కోరికలుండవు. కొత్త రెస్టారెంట్ ఓపెన్ కావడమే ఆలస్యం.. 'వెళ్దాం వెళ్దాం' అని గొడవ చేస్తుంది. అర్ధరాత్రి ఐస్‌క్రీమ్‌లకు సై అంటుంది. అయినా ఐదు గంటలకు లేచి జిమ్‌కి వెళ్తుంది. షూటింగ్ నుంచి వచ్చాక కూడా వర్కవుట్ తప్పనిసరి. ఆ పిల్ల చేసే వర్కవుట్‌లు చూస్తే అదేదో ఒలింపిక్స్ కి ట్రెయిన్ అయినట్టు ఉంటుంది. ఈ విషయంలో ఆ పిల్లకు గట్టిపోటీ ఇచ్చేది రవితేజ మాత్రమే. ఇద్దరూ ఫిట్‌నెస్ మీద అమితాసక్తి ఉన్నవాళ్లే.

భీమవరం స్పెషల్స్!

రవితేజ చాలా క్యూటెస్ట్ పర్సన్. తనకన్నీ ఆశ్చర్యమే. మ్యూజిక్ ఫెస్టివల్‌కి ఫస్ట్‌టైమ్ మేమే తనని తీసుకెళ్లాం. తనకున్నవన్నీ హెల్దీ హ్యాబిట్సే. ఏ బ్యాడ్ హాబిట్స్ ఉండవు. నేను ఒక రోజు రవికి ఫోన్ చేయకుండా వాళ్లమ్మకి ఫోన్ చేసి.. ఇంటికి వెళ్లిపోయా. అక్కడ తింటూ రవికి ఫోన్ చేశా.. ముందుగా ఎందుకు చెప్పలేదు అని అన్నాడు. ' నీకు చెప్పి వస్తే అన్నీ ఆకులు అలములు పెడతావు. ఇప్పుడైతే భీమవరం స్పెషల్స్ అన్నీ లాగిస్తున్నా' అని చెప్పా. వాళ్లింట్లో 365 రోజులూ జున్ను ఉంటుంది. రవి మాత్రం తినడు. 'మా రవి ఏవీ తినడమ్మా.. నువ్వన్నా చెప్పు తినమని' అని ఆంటీ అడుగుతుంటే తల్లిప్రేమ అని అనుకుంటా. ఓసారి రామోజీ ఫిల్మ్ సిటీలో నేను ఓ ఫ్లోర్‌లో, రవి మరో ఫ్లోర్‌లో షూటింగ్ చేస్తున్నాం. 'ఇంటి నుంచి క్యారేజ్ తెప్పించు' అని అన్నా. పే..ద్ద క్యారేజ్ వచ్చేసింది. భోజనానికి కూర్చున్నాం. రవి తినేసి వెళ్లిపోయి ఓ షాట్ చేసుకుని వచ్చాడు. అయినా నేను తింటూనే ఉన్నా.. 'నా తల్లే... ఏం తింటున్నావ్.. తినూ... మొత్తం తినేయ్' అని నాకు దిష్టి తీసి మెటికలు విరిచాడు. ఆ సీన్ ఎప్పుడూ నా కళ్లముందు నిలిచిపోతుంది.

మై ఫ్యామిలీ..!

నాని ముందు తన సినిమా పాటలన్నీ మాకే వినిపిస్తాడు. మా చైతూ, అఖిల్ అయితే అసలు బంగారు కొండలే. అప్పుడప్పుడూ రాశీఖన్నా కూడా మాతో కలుస్తుంటుంది. ఇక సుమంత్, సుప్రియ వాళ్లందరూ మా కుటుంబ సభ్యుల్లాగే. స్వప్నదత్ 'గుండెల్లో గోదారి' సమయంలో ఫోన్ చేసి 'లక్ష్మీ నీకేమైనా సాయం కావాలా.. చెప్పు. నేను చేస్తాను' అంటూ ఎన్ని సార్లు అడిగిందో. ఇప్పుడు వాళ్లు చేస్తున్న 'సావిత్రి' చిత్రంలో చిన్నప్పటి సావిత్రిలాగా మా అమ్మాయిని చూపించమని అడుగుతున్నా. 'ఒక్క షాట్‌లో నా కూతుర్ని చూపించవే తల్లీ.. తన తొలి ఎంట్రీ సావిత్రిలాగా అయితే బావుంటుంది' అని అడిగా. అంత చనువు ఉంది తనతో. మేమిద్దరం కలిసి ఆ సినిమా కోసం నాన్నగారిని ఒప్పించడాన్ని అసలు మర్చిపోలేను.

తెలుగు సినిమా స్టార్స్ అందరూ కలిసికట్టుగా ఉండాలని నాకు, రానాకు, బన్నీకి చాలా ఉండేది. మేం ముందు పార్టీలను అరేంజ్ చేసి అందర్నీ పిలిచి ఈ వాతావరణాన్ని ఏర్పరచాం. దాంతో తెలుగు పరిశ్రమ చాలా హెల్దీగా ఉంది. ఒకరి సినిమా విడుదలైనప్పుడు మిగిలిన సెలబ్రిటీలు ట్వీట్లు చేసి ప్రోత్సహించే సంస్కృతి మన దగ్గర ఉన్నంతగా మిగిలిన పరిశ్రమల్లో లేదు.

హోలీ... కేళీ!

- రాశీఖన్నా

నాకు హైదరాబాద్‌లో ఫ్రెండ్స్ ఇద్దరే. రవితేజగారు, రకుల్ ప్రీత్‌సింగ్. 'బెంగాల్ టైగర్' నుంచి రవితేజగారు ఫ్రెండ్ అయ్యారు. 'జోరు' నుంచే నాకు రకుల్‌తో పరిచయం ఉంది. ఆ తర్వాత అది ఫ్రెండ్‌షిప్‌గా మారింది. ఇద్దరం ఒకే హోటల్‌లో ఉండేవాళ్లం. తన ద్వారా మిగిలిన వాళ్లందరూ (లక్ష్మీ మంచు, రానా, అఖిల్, రెజీనా, నాని) పరిచయమయ్యారు. ఈ టీమ్ అందరితో కలిసి గత ఏడాది రకుల్ ఇంట్లో మేం సెలబ్రేట్ చేసుకున్న హోలీని నేను జీవితంలో మర్చిపోలేను. నాకు ఎప్పుడు తీరిక దొరికినా వారిని కలుస్తాను. అప్పుడెప్పుడో రకుల్ ఒకసారి ఏదో ఓ హోటల్ నుంచి బిర్యాని తెప్పించింది. అప్పటినుంచి నేను ఎక్కడ బిర్యానీ తిన్నా ఆ టేస్ట్ మాత్రం రావట్లేదు. లక్ష్మీగారు వెరీ నైస్ హార్ట్ లేడీ. ఫన్ లవింగ్ వ్యక్తి. వెరీ చిల్డ్ ఔట్. రవిగారు, రకుల్ నాకు కొన్ని ఫిట్‌నెస్ టిప్స్ చెప్పారు. కానీ ఎవరి శరీరతత్వాన్ని బట్టి వారు ఫిట్‌నెస్ సూత్రాలను ఎంపిక చేసుకోవాలని నాకు అనుభవం వల్ల తెలిసింది.



అందరం కలిస్తే.. రచ్చ రచ్చే!

- రకుల్ ప్రీత్‌సింగ్

లక్ష్మీమంచు, రెజీనా, రాశీఖన్నా, రానా, ప్రకాశ్ కోవెలమూడి, నాని, అఖిల్, రవితేజగారు నా క్లోజ్ ఫ్రెండ్స్.

దాదాపుగా ప్రతి రెండు మూడు రోజులకు ఒకసారి కలుస్తాం. సాయంత్రాలు షూటింగ్‌లు అయిపోయాక ఖాళీ దొరికితే ఎవరో ఒకరింటికి అందరం చేరుకుంటాం. మేకప్‌లు, స్పెషల్ డ్రెస్‌లు ఏమీ ఉండవు. అందరం దాదాపుగా పైజామాల్లోనే కనిపిస్తాం. నైట్ సూట్‌ల్లో ఒకరింటికి మరొకరు వెళ్లగలిగే చనువు ఉంటుంది. ప్రకాశ్ ఇల్లు, రానా ఇల్లు, లక్ష్మీ ఇల్లు, నా ఇల్లు.. ఇలా ఎవరో ఒకరి ఇంటికి చేరుకుంటాం. అదీ, ఇదీ అనే తేడా లేకుండా అన్నీ మాట్లాడుకుంటాం. పని ఒత్తిడి గురించి ఎవరూ నోరు విప్పరు. మా వాట్సాప్ గ్రూపులోనూ ఎప్పుడూ ఏదో ఒక చర్చ జరుగుతూనే ఉంటుంది. అందరిలోకీ నేనే ఎక్కువ మాట్లాడుతుంటా. అందరం కలిసినప్పుడు నచ్చినవి తింటుంటారు కాబట్టి ఫిట్‌నెస్ టాక్ ఉండదు. మా గ్రూప్‌లో ఎవరికీ ఈగోకు స్పెల్లింగ్ కూడా తెలియదు. ఈ మధ్య ఓ నెల రోజులు లండన్‌కి వెళ్లాను. అప్పుడు ఫ్రెండ్స్‌ని ఎంత మిస్ అయ్యానో మాటల్లో చెప్పలేను.

తొలిఫ్రెండ్..!

ఈ బ్యాచ్‌లో నాకు ఫస్ట్ పరిచయం రెజీనా. తనతో రెండు సార్లు యుఎస్ ట్రిప్పులకు కూడా వెళ్లా. ఇద్దరం రూమ్ షేర్ చేసుకున్నాం. రెజీనా చాలా ఫన్ గర్ల్.. ఏదీ అతిగా పట్టించుకోదు. తను ఎవరినీ పోటీగా ఫీల్ కాదు.

లక్ష్మీ.. తల్లి!

లక్ష్మీ నాకు తల్లిలాంటిది. మా తమ్ముడు ఏమైనా తప్పు చేసినా తిడుతుంది. మంచి పని చేస్తే మెచ్చుకుంటుంది. నేను మొన్న లండన్ నుంచి ల్యాండ్ అయి ఫోన్ ఆన్ చేయగానే లక్ష్మీ దగ్గర నుంచి "ఏం కావాలి దోస కావాలా? ఇంకేమైనా తింటావా?లంచ్ పంపనా? కుక్ వస్తానందా?" అని మెసేజ్‌లు వస్తూనే ఉన్నాయి.



చాలా సైలెంట్..!

మా గ్యాంగ్‌లో అత్యంత సైలెంట్ వ్యక్తి రాశీఖన్నా. ఎప్పుడైనా ఒకసారి తనకి మూడ్ వస్తే మాత్రం.. 'అందరం కలుద్దాం కలుద్దాం' అని అంటుంది.

రానా.. బిర్యానీ!

రానాకి బిర్యానీలు చాలా ఇష్టం. చాలా వెరైటీలు తెప్పిస్తాడు. అందరినీ సమానంగా ట్రీట్ చేస్తాడు. చాలా మంచి హోస్ట్. దేని గురించి అడిగినా పది జవాబులు చెప్పగల సామర్థ్యం అతనికుంటుంది.

పాజిటివ్.. ఎనర్జీ!

రవితేజగారు.. వెరీ ఫన్నీ, వెరీ పాజిటివ్ పర్సన్. తను ఎప్పుడూ ఎనర్జిటిక్‌గా ఉంటాడు. నాన్సెన్స్ యాటిట్యూట్ ఉండదు. నేను రవిగారు అనే పిలుస్తా. 'గారు' ఎందుకు రవి అను అని అంటారు. కానీ నేను ఆయన్ని 'కిక్2' కోసం తొలిసారి కలిసినప్పటి నుంచి రవిగారు అనే అంటున్నా. అలవాటు పోవడం లేదు.



ట్రైనింగ్‌కి పంపిస్తా

ప్రకాశ్ కోవెలమూడి నా క్లోజెస్ట్ ఫ్రెండ్. ఒన్ ఆఫ్ ద నైసెస్ట్ మెన్ ఎగ్జిస్టింగ్ ఇన్ దిస్ వరల్డ్. నేను టూర్లకు వెళ్లినప్పుడు ప్రకాశ్‌ని చాలా మిస్ అవుతుంటా. తను నన్ను ఫన్నీ నేమ్స్ తో పిలుస్తాడు. క్లమ్సీ, స్మైలీ ఫేస్.. ఇలా రకరకాలుగా పిలుస్తాడు. అందరూ సీరియస్‌గా మాట్లాడుతుంటే నేను, ప్రకాశ్ 'మనం ఇప్పుడు కాస్త కామెడీ చేద్దామా' అని సైగలు చేసుకుంటాం. మా ఇద్దరికీ ఒకటే కామెడీ టైమింగ్. ఎప్పుడైనా నాకు బోయ్‌ఫ్రెండ్ కనుక వస్తే, ప్రకాశ్ దగ్గరికి ట్రైనింగ్‌కి పంపిస్తా. ట్రైనింగ్ పర్ఫెక్ట్ గా ఉంటే ఓకే, లేకుంటే బాయ్‌ఫ్రెండ్‌ని బయటికి పంపిచేస్తా.

తను స్పెషల్!

మా గ్యాంగ్‌లో నాని చాలా మంచోడు. తను చాలా హార్డ్ వర్కింగ్, సో డెడికేటెడ్, ఎప్పుడు మాట్లాడినా చాలా తెలివిగా అనిపిస్తాడు. ప్రతి విషయాన్నీ తను అప్రోచ్ అయ్యే విధానం కొత్తగా ఉంటుంది. వెరీ క్రియేటివ్ పర్సన్.

ఫ్రెండ్లీ.. డార్లింగ్!


అఖిల్ నాకు డార్లింగ్. చాలా మంచి అబ్బాయి. మా తమ్ముడు వయసు వాడు. చాలా పాజిటివ్, స్మార్ట్. అదే సమయంలో ఇన్నొసెంట్. అక్కినేని ఫ్యామిలీ నుంచి వచ్చినప్పటికీ చాలా మామూలుగా ఉంటాడు.

• డా. చల్లా భాగ్యలక్ష్మి









బాక్సాఫీస్ ఫైట్

అందరి దృష్టి ఈ నెల 11వ తేదీపై కేంద్రీకృతమవుతోంది. కారణం.. మూడు ఆసక్తికర సినిమాలు ఒకదానితో మరొకటి బాక్సాఫీస్ వద్ద 'నువ్వా.. నేనా?' అంటూ కత్తులు దూస్తుండటం. అవేమీ టాప్ హీరోల సినిమాలు కాదు. అయినా చిత్రసీమలో, ప్రేక్షకుల్లో ఉత్కంఠకు కొదువలేదు. కారణం.. ఒక్కో సినిమాకు ఒక్కో ప్రత్యేకత ఉండటం. ఆ సినిమాలు.. 'జయ జానకి నాయక', 'నేనే రాజు నేనే మంత్రి', 'లై'. ఇప్పటికే ఈ మూడు సినిమాల ట్రైలర్లు ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించి, అంచనాలను భారీగా పెంచేశాయి.

ఒకే రోజు మూడు సినిమాలు వంద కోట్లు!

ఒక దానికి వరుసగా రెండు బ్లాక్‌బస్టర్ సినిమాలను అందించిన బోయపాటి శ్రీను దర్శకుడైతే, ఇంకో దానిలో 'బాహుబలి' చిత్రాలతో దేశవ్యాప్తంగా ఎంతో పేరు సంపాదించుకొన్న రానా కథానాయకుడు. మరొకటి మునుపటి సినిమాతో విజయాలు సాధించిన హీరో నితిన్, దర్శకుడు హను రాఘవపూడి కాంబినేషన్‌లో రూపొందినది. పైకి చూసేందుకు మధ్యతరహా సినిమాలుగా కనిపిస్తున్నప్పటికీ మూడింటి బడ్జెట్ కలిపి రూ. వంద కోట్ల పైమాటే! సాధారణంగా సంక్రాంతి, దసరా వంటి పండుగ సీజన్‌లో రెండు లేదా మూడు సినిమాలు పోటీ పడుతుండటం సాధారణంగా జరిగేదే. సంక్రాంతికి 'ఖైదీ నంబర్ 150', 'గౌతమిపుత్ర శాతకర్ణి' వంటి భారీ సినిమాలతో పాటు 'శతమానం భవతి', 'హెడ్‌కానిస్టేబుల్ వెంకట్రామయ్య' అనే చిన్న సినిమాలు కూడా విడుదలవడం, వాటిలో మూడు ప్రేక్షకాదరణ పొందడం చూశాం.

తగ్గే ప్రసక్తే లేదు..

ఇప్పుడున్నది పండుగ సీజన్ కానీ, వేసవి సీజన్ కానీ కాదు. అయినా మూడు సినిమాలు ఒకేసారి ఎందుకు విడుదలవుతున్నట్లు? వరుసగా ఐదు రోజుల పాటు మంచి వసూళ్లను సాధించే అవకాశం ఉండటం! 11న విడుదల చేస్తే మూడు రోజుల వీకెండ్‌తో పాటు 15వ తేదీ (మంగళవారం) స్వాతంత్ర్యదినం రావడంతో.. ఐదు రోజుల పాటు ప్రజలు హాలీడే మూడ్‌లో ఉంటారనీ, ఇది సినిమాకు ప్రయోజనం కలుగుతుందనీ దర్శక నిర్మాతలు భావిస్తున్నారు. అందుకే తమ సినిమాను వాయిదా వేయడానికి ఎవరూ సిద్ధంగా లేరు. ఫలితం పోటీ అనివార్యం! నిజానికి ఒకే సమయానికి మూడు సినిమాలు విడుదలైతే వసూళ్లపై ఆ ప్రభావం తప్పకుండా పడుతుంది. అందుబాటులో ఉండే థియేటర్లు తగ్గడంతో ఆ మేరకు కలెక్షన్లూ తగ్గుతాయి. దీంతో నిర్మాతల్లో టెన్షన్. ఏదో ఒక సినిమా వాయిదా పడితే, మూడింటికీ ప్రయోజనం లభిస్తుందని అనుకున్నారు. తమిళంలో ధనుష్ సినిమా 'విఐపి 2' ఆగస్టు 11నే విడుదలవుతుండటంతో 'నేనే రాజు నేనే మంత్రి' చిత్రాన్ని 11 నుంచి 18కు వాయిదా వేయాలని నిర్మాత సురేశ్‌బాబు భావిస్తున్నట్లు సోషల్ మీడియాలో బాగా ప్రచారం జరిగింది. కానీ అది కేవలం వదంతేనని తేలిపోయింది. అలాగే ఆయనకూ, 'లై' నిర్మాతలైన 14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్ వారికీ మధ్య చర్చలు నడిచాయనీ, కానీ ఆ చర్చలు ఫలవంతం కాలేదనీ వినిపించింది.



అంతటా భారీతనమే!

సొంతంగా మార్కెట్‌లేని ఒక హీరో చిత్రాన్ని ఎంత వ్యయంతో రూపొందించాలి? మహా అయితే పది లేదా పదిహేను కోట్లతో. కానీ బెల్లంకొండ శ్రీనివాస్ సినిమాని ఏకంగా రూ. 50 కోట్ల వ్యయంతో తీశారంటే.. ఏదో ఒక విశేషం ఉండాలి. ఆ విశేషం.. బోయపాటి శ్రీను! అవును. స్టార్ హీరోకు సమానంగా ఇమేజ్ ఉన్న దర్శకుల్లో బోయపాటి ఒకరు. 'లెజెండ్', 'సరైనోడు' వంటి వరుస బ్లాక్‌బస్టర్స్ తర్వాత బోయపాటి శ్రీను రూపొందించిన చిత్రం 'జయ జానకి నాయక'. మాస్‌కు బాగా కనెక్టయ్యే యాక్షన్, ఎమోషనల్ సీన్స్‌కు బోయపాటి పెట్టింది పేరు. అందుకే "బోయపాటి శ్రీను ఉన్నారన్న ధైర్యంతోనే ఇంత భారీగా చిత్రాన్ని నిర్మించాను" అని నిర్మాత మిర్యాల రవీందర్‌రెడ్డి ధీమాగా చెప్పారు. ఆ ధీమాతోనే ఒక బీచ్ ఫెస్టివల్ సాంగ్‌కు రూ. 3 కోట్లు ఖర్చు పెట్టారు. 'అల్లుడు శీను'తో హీరోగా పరిచయమైన బెల్లంకొండ శ్రీనివాస్‌కు రెండో సినిమా 'స్పీడున్నోడు'.. చేదు అనుభవాన్ని మిగిల్చింది. ఇలాంటి నేపథ్యంలో ఆయనతో సినిమా చేయడానికి ఏ పెద్ద దర్శకుడు సాహసిస్తాడు? కానీ శ్రీనివాస్ తండ్రి, పేరుపొందిన నిర్మాత బెల్లంకొండ సురేశ్‌తో ఉన్న అనుబంధం కారణంగా 'జయ జానకి నాయక'ను తన భుజాల మీదకు ఎత్తుకున్నారు బోయపాటి. "కావాలనుకుంటే పెద్ద స్టార్‌తో సినిమా చేయడానికి అవకాశం ఉన్నా, నాతో సినిమా చేయడానికి ముందుకొచ్చారు బోయపాటి. ఎప్పటికీ ఆయనకు రుణపడి ఉంటాను" అని కృతజ్ఞత చాటుకున్నారు శ్రీనివాస్. ఇందులోని హీరో పాత్ర కోసం ఆయన చాలా కష్టపడ్డారు. కండలు పెంచారు. యాక్షన్ సన్నివేశాల్లో నటించడానికి ఒళ్లు హూనం చేసుకున్నారు. "జీవితంలో కష్టం వచ్చిన ప్రతిసారీ జీవితాన్ని వదులుకోలేం. కానీ ప్రేమను వదిలేస్తాం. నేను వదలను. ఎందుకంటే నేను ప్రేమించా" అంటాడు ఒక సన్నివేశంలో హీరో. అదే ఆయన క్యారెక్టరైజేషన్. ఆయన సరసన నటించిన రకుల్‌ప్రీత్‌కు నటనకు అవకాశం ఉన్న భిన్న తరహా పాత్ర లభించింది. ఆమెది ప్రేక్షకుల సానుభూతికి నోచుకొనే పాత్ర. సినిమా అంతా భారీ తారాగణంతో కనువిందు చేస్తుందని అంటున్నారు. జగపతిబాబు, శరత్‌కుమార్, తరుణ్ అరోరా, వాణీ విశ్వనాథ్ వంటి వాళ్లు ఇందులో నటించారు. ఈ సినిమాకు మార్కెట్‌లో క్రేజ్ రావడానికీ, బడ్జెట్‌కు తగినట్లే బిజినెస్ కావడానికీ దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ కూడా కారణమే. 'వీడే వీడే', 'నువ్వేలే నువ్వేలే' పాటలు బాగా పాపులర్ అయ్యాయి. రకుల్‌ప్రీత్ కేరక్టర్ సానుభూతిని కలిగించేదిగా ఉంటుంది.

ఆసక్తికర కాంబినేషన్

కొద్ది రోజులుగా వార్తల్లో నిలిచిన చిత్రం 'నేనే రాజు నేనే మంత్రి'. ప్రపంచంలోనే తొలిసారిగా ఒక చిత్రానికి 'ఆగ్‌మెంటెడ్ రియాలిటీ టెక్నాలజీ' ద్వారా ప్రచారం నిర్వహిస్తోన్న చిత్రంగా ఇది పేరు పొందింది. 'బాహుబలి' చిత్రాల్లో భయంకరమైన ప్రతినాయకుడు భల్లాలదేవగా భయపెట్టి, 'ఘాజీ' చిత్రంలో నాయకుడిగానూ మెప్పించి, దేశవ్యాప్తంగా కీర్తి సంపాదించిన తర్వాత, టైటిల్ రోల్‌లో రానా ఈ చిత్రాన్ని చేశారు. అయితే తేజ దర్శకత్వంలో చేయడమే ఆసక్తిని రేకెత్తించింది. కారణం.. ఒకటిన్నర దశాబ్దం నుంచి తేజకు సరైన హిట్టు లేదు. 'జయం' (2002) తర్వాత ఆయన చేసిన సినిమాలేవీ ఆశించిన రీతిలో ఆడలేదు. ఈ నేపథ్యంలో ఆయన దర్శకత్వంలో నటించి రానా సాహసం చేస్తున్నాడని అనుకున్న వాళ్ల సంఖ్య తక్కువేమీ కాదు. "నేను ఆయన మునుపటి సినిమాల ఫలితం గురించి ఆలోచించలేదు. ఈ కథ నాకు బాగా నచ్చింది. నేను పోషించిన జోగేంద్ర కేరక్టర్‌లోని వైవిధ్యం ఛాలెంజింగ్‌గా అనిపించింది. తేజ ఎంత మంచి టెక్నీషియనో నాకు తెలుసు. సినిమా చూసుకున్నాక చాలా హ్యాపీగా ఫీలయ్యాను. ఈ సినిమా మా ఇద్దరికీ చాలా మంచి పేరు తేవడం ఖాయం" అని ఆశాభావం వ్యక్తం చేశారు రానా. ట్రైలర్‌లో ఆయన చెప్పిన "నేనెప్పుడు చావాలో నేనే డిసైడ్ చేస్తా. నువ్వెప్పుడు చావాలో కూడా నేనే డిసైడ్ చేస్తా. నా జీవితానికి నేనే రాజు నేనే మంత్రి" అనే డైలాగ్‌తో రానా క్యారెక్టరైజేషన్ ఏమిటనేది ఊహించుకోవచ్చు. ఒక గ్రామంలో ఫైనాన్స్ వ్యాపారం చేసుకొనే జోగేంద్ర జీవితంలోకి కొన్ని రాజకీయ శక్తులు ప్రవేశించి, అలజడి సృష్టిస్తే.. తానే రాజకీయ నాయకుడిగా మారి ఏం చేశాడనేది ఈ చిత్ర కథ. ఆయన భార్య రాధ పాత్రలో కాజల్ అగర్వాల్, దేవికారాణి అనే మరో ఆసక్తికర పాత్రలో కేథరిన్ నటించారు. అనూప్ రూబెన్స్ సంగీతంతో సన్నివేశాలకు మరింత బలం చేకూరిందని టాక్. ఈ సినిమా కోసం తాను రెమ్యూనరేషన్ ఏమీ తీసుకోలేదని రానా తెలిపారు. అయితే సినిమా బిజినెస్‌లో ఆయనతో పాటు, దర్శకుడు తేజకూ వాటా ఉందని సమాచారం. కిరణ్‌రెడ్డి, భరత్ చౌదరి సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమాకు, తర్వాత కాలంలో సురేశ్‌బాబు కూడా వాటాదారుగా అడుగుపెట్టారు. రూ. 25 కోట్లు వ్యయమైన ఈ చిత్రానికి సంబంధించిన ప్లస్ పాయింట్.. తెలుగుతో పాటు తమిళంలోనూ విడుదల కానుండటం, హిందీలోనూ శాటిలైట్ హక్కులకు మంచి ధర రావడం! 'బాహుబలి'తో తమిళనాట కూడా రానా పేరు సుపరిచితమైంది. అందుకే 11న తమిళనాట ధనుష్ సినిమా 'విఐపి 2' విడుదల ఉన్నప్పటికీ, అదే రోజు రెండు భాషల్లోనూ చిత్రాన్ని విడుదల చేయడానికే సురేశ్‌బాబు మొగ్గు చూపారు.







అబద్ధం కాదు!

దృశ్యం

సోషల్ మీడియాలో బాగా క్రేజ్ సంపాదించుకున్న సినిమా ఏదంటే 'లై' పేరే కనిపిస్తుంది. దృశ్యపరంగా ఈ సినిమా అత్యున్నత స్థాయిలో ఉంటుందని విజువల్స్ తెలియజేస్తున్నాయి. గడ్డంతో ఉన్న నితిన్ రూపం యువతలో మంచి క్రేజ్ తెచ్చింది. ఈ చిత్రానికి ముందు నితిన్ చేసిన 'అ..ఆ..' చిత్రం రూ. 50 కోట్లు వసూలు చేసి, సంచలనం సృష్టించింది. దర్శకుడు హను రాఘవపూడి సైతం ఫుల్ ఫామ్‌లో ఉన్నారు. ఆయన మునుపటి చిత్రం 'కృష్ణగాడి వీరప్రేమగాథ' భారీ విజయాన్ని సాధించింది. వాస్తవానికి ఆయన అఖిల్ రెండో సినిమాను డైరెక్ట్ చేయాల్సింది. కొన్ని కారణాల వల్ల అది కార్య రూపం దాల్చకపోవడంతో నితిన్‌తో ఈ సినిమా చేశారు. ఎక్కువ భాగం షూటింగ్ అమెరికాలో జరపడం వల్ల భారీగానే ఖర్చయింది. రూ. 30 కోట్లకు మించి ఈ చిత్రానికి నిర్మాతలు ఖర్చు పెట్టారని సమాచారం. ఒక లక్ష్యం కోసం అమెరికా వెళ్లే హీరో.. అక్కడ హీరోయిన్ మేఘా ఆకాశ్‌తో ప్రేమలో పడి ఎలాంటి అనుభవాలు ఎదుర్కొన్నాడనేది కథ. అయితే ఆసక్తికర కథనమే చిత్రానికి ఆయువుపట్టు అని సమాచారం. అన్నింటికీ మించి ఈ చిత్రానికి సంబంధించిన విశేషం.. 'మా పల్లెలో గోపాలుడు' నుంచి 'ఒకే ఒక్కడు' వరకు హీరోగా తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో మంచి స్థానం సంపాదించుకొన్న అర్జున్.. విలన్‌గా కనిపించనుండటం! ప్రతినాయక పాత్రను పోషించడం ఆయనకు ఇదే మొదటిసారి. అలాగే అంతర్జాతీయంగా పేరుపొందిన పోకర్ ఆటగాడు, హాలీవుడ్ నటుడు డాన్ బిల్జీరియన్ ఇందులో నటించారు. 'లై' (ఎల్ఐఈ) అనే ఆంగ్ల పదంలో 'ఎల్' అంటే 'లవ్', 'ఐ' అంటే 'ఇంటలిజెన్స్', 'ఈ' అంటే 'ఎనిమిటీ' అని దర్శకుడు అంటున్నారు. వీటిలో ఇంటలిజెన్స్, ఎనిమిటీ.. అనేవి హీరో, విలన్‌కు సంబంధించినవని తెలుస్తోంది. అర్జున్, నితిన్ మధ్య శత్రుత్వం (ఎనిమిటీ) ఏమిటి, మేధస్సు (ఇంటలిజెన్స్)తో ఒకరిపై మరొకరు పైచేయి సాధించేందుకు ఏం చేశారనే విషయాన్ని బలమైన స్క్రీన్‌ప్లేతో దర్శకుడు హను చూపించారని అంతర్గత సమాచారం. టీజర్‌లోని "అబద్ధం తోడు లేకుండా ఏ కురుక్షేత్రం పూర్తవదట" అనే డైలాగ్ ఇప్పటికే బాగా ప్రాచుర్యం పొందింది. కొంత కాలం విరామంతో మళ్లీ బిజీ అవుతున్న సీనియర్ మ్యూజిక్ డైరెక్టర్ మణిశర్మ ఈ చిత్రంలో 'బొంభాట్', 'లగ్గం టైమ్', 'మిస్ సన్‌షైన్' పాటలతో 'హి ఈజ్ బ్యాక్' అనిపించుకున్నారు. 11 నుంచి ఈ చిత్రాన్ని 18కి వాయిదా వేయమని నిర్మాతలపై ఒత్తిడి వచ్చినా వాళ్లు పోటీకే సిద్ధమయ్యారు. మార్చి 30న నితిన్ పుట్టినరోజునే ఈ చిత్రాన్ని ఆగస్ట్ 11న విడుదల చేస్తామని తాము ప్రకటించిన విషయాన్ని వాళ్లు గుర్తు చేశారు.

• యజ్ఞమూర్తి





అందుకే.. 'బిగ్‌బాస్' నుంచి వచ్చేశా!

"నా సింగింగ్ స్టైల్ వేరుగా ఉంటుంది. నా తరహా పాటలు ఎవరూ పాడలేరేమో అని నా ఫీలింగ్" అని చెబుతుంటే గాయని మధుప్రియ కంఠంలో ఆత్మవిశ్వాసం నిండుగా ధ్వనించింది. తెలుగు టెలివిజన్‌లో అతి స్వల్పకాలంలోనే బాగా పాపులర్ అయిన 'బిగ్ బాస్' తెలుగు రియాలిటీ షో నుంచి రెండు వారాల తర్వాత బయటకు వచ్చేసిన ఆమె ఆ షో గురించీ, తన ఇష్టాయిష్టాల గురించీ 'నవ్య'తో ప్రత్యేకంగా ముచ్చటించారు. ఆ విశేషాలు ఆమె మాటల్లోనే...

నేను రాసి, పాడిన 'ఆడపిల్లనమ్మా' పాటతో నాకు గుర్తింపు వచ్చింది. సినిమా పాటలు తక్కువ పాడా. కొన్ని సినిమాల్లో రెండు మూడు లైన్‌లు పాడిన పాటలున్నాయంతే. సమాజంలో చైతన్యం తీసుకొచ్చే పాటలు పాడటానికే ప్రాధాన్యమిస్తా. ఈ మధ్యనే మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ తెలంగాణ ట్రాఫిక్ పోలీస్‌ల సౌజన్యంతో పాడిన 'మాయదారి మత్తూ.. అవ్వ మాకు సిత్తూ' పాట 'ఆడపిల్లనమ్మా' తరహా పేరు తీసుకొచ్చింది.

మొదటిపాటే హిట్..

శేఖర్ కమ్ములగారి 'ఫిదా'లో ఓ పాట పాడాలంటూ 'దిల్ రాజుగారి ఆఫీస్ నుంచి ఫోన్ వచ్చింది. వెంటనే కలిశా. పాట గురించి వివరాలు చెప్పి, పక్కా తెలంగాణ యాసతో కావాలని చెప్పారు. 'మధుప్రియ ఎలా పాడుతుందో అదే స్టైల్లో పాడు' అని ట్రాక్, లిరిక్ ఇచ్చారు. 'మేం చెప్పినట్లే పాడాలి' అనే నిబంధనలు ఏమీ పెట్టకుండా స్వేచ్ఛ కూడా ఇచ్చారు. అంతే 'వచ్చిండే మెల్లామెల్లగ వచ్చిండే' అని గొంతెత్తి పాడాను. సినిమాల్లో పూర్తిస్థాయి సింగర్‌గా పాడిన తొలి పాట ఇదే అనుకోవచ్చు. నా మొదటి పాటే ఇంత పెద్ద హిట్ కావడం చాలా ఆనందంగా ఉంది. 'మధుప్రియ పాటకు ఫిదా అయిపోయాం' అని శేఖర్‌గారు, దిల్ రాజుగారు అనడం చాలా ఆనందంగా అనిపించింది.

ఎలాంటి పాటైనా పాడతా...

నా వాయిస్ చాలా గట్టిగా ఉంటుంది కాబట్టి ఏ పాటిచ్చినా పాడగలను. 'ఫిదా' ముందువరకూ మధుప్రియ 'జానపదాలు, ఉద్యమగీతాలు, ఆడపిల్లల పాటలు పాడుతుంద'ని అనుకున్నారు. 'ఫిదా' వచ్చాక ఈ అమ్మాయి సినిమా పాటలు కూడా పాడగలదు' అని అర్థం చేసుకున్నారు. చాలామంది సింగర్లు మ్యూజిక్ డైరెక్టర్ల దగ్గరకు వెళ్లి పాడి, డెమోలిచ్చి అవకాశాలు అడుగుతారని విన్నా... కానీ నేనైతే ఏ సంగీత దర్శకుడి దగ్గరికి వెళ్లి అవకాశాలు అడగలేదు. వచ్చిన అవకాశాల్ని విని యోగించుకున్నానంతే. అడగకపోవడమే నాకు అవకాశాలు తక్కువ కావడానికి కారణం అనుకుంటా. ప్రతిభ ఉన్న చోటుకి పని వస్తుందని నమ్ముతా.

'బిగ్ బాస్' అని తెలీదు..

'స్టార్ మా' నుంచి ఓ రోజు కాల్ వచ్చింది. 'బిగ్ బాస్' షో గురించి అని వాళ్లు చెప్పలేదు 'ఓ షో ఉంది. మీరు చేస్తారా? మూడు నెలలు ఫోన్‌కి, ఫ్యామిలీకి దూరంగా ఉండాలి? ఎలాంటి కమ్యూనికేషన్ ఉండదు' మీరు ఓకే అనుకుంటే ముంబై నుంచి మా టీమ్ వచ్చి మాట్లాడతారు' అని చెప్పారు. కొంచెం ఆలోచించి సరేనన్నా. వాళ్ల టీమ్ వచ్చి షో డిటైల్స్ చెప్పి 'హిందీ 'బిగ్ బాస్' చూడండని చెప్పి వెళ్లిపోయారు. 'బిగ్ బాస్' షో ఇంకో పదిరోజుల్లో ప్రారంభమవుతుందనగా కాల్ చేసి సెలెక్ట్ అయ్యారని చెప్పారు. జూలై 14న హైదరాబాద్ నుంచి లోనావాలా వెళ్లాం.

కంట తడిపెట్టుకున్నారు...

ఎన్టీఆర్‌గారు హోస్ట్ చేస్తున్నారనీ, 'బిగ్ బాస్' షో ఎలా ఉంటుందోననే కుతూహలం ఎక్కువగా ఉండేది. మొదటిరోజు ఎన్టీఆర్ అన్న ఎంట్రీ అదిరింది. నన్ను గుర్తుపడతారో.. లేదో.. ఎలా రిసీవ్ చేసుకుంటారో అని టెన్షన్ పడ్డా. ఎందుకంటే ఫస్ట్ టైమ్ ఆయన్ని ఓ వేదిక మీద కలవడం. 'ఆడపిల్లనమ్మా నేను ఆడపిల్లనాని' పాట పాడుతూ 'అమ్మా' అని నన్ను పిలిచారు. నేను 'అన్నా' అన్నాను. ఎప్పుడో వేదికపై పాడిన పాటను గుర్తు చేసుకుని కంటతడిపెట్టారు. ఆయన నోట 'అమ్మా' అనే పిలుపు, ఆయన భావోద్వేగానికి లోనవడం చూసి తెలియకుండానే నేనూ భావోద్వేగానికి లోనయ్యా. ఆయనతో వేదిక షేర్ చేసుకోవడం ఆనందంగా అనిపించింది.

మూడు రోజులు బాగానే ఉన్నాం...

ఫోన్, వాచ్ ఏవీ అందుబాటులో లేకుండా 14 మంది 'బిగ్‌బాస్' హౌస్‌లోకి వెళ్లాం. పెద్ద గది, కిచెన్, లాన్ ఇలా అన్ని ఏర్పాట్లు బాగున్నాయి. 'బిగ్ బాస్' చెప్పినట్టే అక్కడ అందరూ నడుచుకోవాలి. ఎవరి పని వాళ్లు చెయ్యాలి. అక్కడున్న కెమెరాల ద్వారా ప్రతిక్షణం ఏం జరుగుతుందో 'బిగ్ బాస్'కి తెలిసిపోతుంది. లోపలికి వెళ్లిన మూడు రోజుల వరకూ ఒకరితో ఒకరు అంతా బాగానే ఉన్నాం. అందరిలో నేను చిన్న అమ్మాయిని కాబట్టి బాగా చూసుకునేవారు.

ఓరి దేవుడో అనిపించింది...

షో గురించి చెప్పినప్పుడు అంతా బాగానే అనిపించింది. లోపలికి వెళ్లాక తెలిసింది ఇదొక వింత ప్రపంచం అని. ఈ రోజుల్లో చిన్న పిల్లాడు కూడా ఫోన్, గేమ్స్ లేకుండా ఉండలేకపోతున్నాడు. అలాంటిది మాలాంటి వాళ్లు మూడు నెలలు ఫోన్, టైమ్ చూసుకోవడానికి వాచ్, ఎంటర్‌టైన్‌మెంట్ కోసం టీవీ కూడా లేకుండా ఎలా ఉండగలం. నాలుగో రోజుకే నాకు నరకం కనిపించింది.. ఇల్లు, ఫ్యామిలీ, భర్త అందరూ గుర్తొచ్చేశారు. నచ్చిన ఫుడ్ లేదు. పాటలకీ, ఫోన్‌కీ అలవాటైన నాకు మరీ కష్టంగా అనిపించింది. టైమ్ తెలుసుకోవాలంటే ఆకాశాన్ని చూసి అంచనా వేసుకోవడమే. కనీసం ఫోన్ అందుబాటులో ఉన్నా బాగుండేదేమో. ఏమీ లేకపోవడంతో అక్కడ ఉండటం నా వల్ల కాలేదు. అందుకే సభ్యులందరినీ రిక్వెస్ట్ చేసి నామినేట్ చేయించుకుని నాకు నేనుగా బయటికొచ్చేశా. నేను ఎలిమినేట్ కాలేదు. కోపంతో నన్నెవరూ పంపలేదు. చివరివరకూ షోలో ఉండుంటే బావుండేది.

ఎన్నో ప్రయోగాలు చేశాం..

హౌస్‌లో ఉన్న 14 మందికి పనులు అప్పగించినప్పుడు తప్పకుండా చెయ్యాల్సిందే. కొందరు అవన్నీ పట్టించుకోలేదు. నేనైతే నా పని చేసుకుంటూ వెళ్లిపోయా. అయినప్పటికీ 'మధుప్రియ ఏం చెయ్యట్లేదు, ఎప్పుడూ ఏడుస్తూనే ఉంటుంది' అన్న విమర్శ కూడా వినిపించింది. అవన్నీ నేను పట్టించుకోలేదు. పని చేశానా లేదా అన్నది నా మనస్సాక్షికి తెలుసు. హౌస్‌లో 24 గంటలపాటు మేం చేసినవాటిలో గంట మాత్రమే టీవీలో చూపిస్తారు. 24 గంటల్లో మహా అయితే నాలుగు గంటలు పని ఉంటుందేమో! మిగిలిన టైమ్ అంతా ఆటలు, పాటలు, టామ్ అండ్ జెర్రీ ఫైట్స్.. ఎన్నో ప్రయోగాలు చేశాం. వాటిలో కొన్నైనా చూపించి ఉండే బావుండేదని నా అభిప్రాయం. టీవీ వాళ్లకు కూడా కొన్ని నిబంధనలు ఉంటాయి కదా... దానికి మనం ఏం అనలేం.



ఆ వాయిస్ కిక్ ఇచ్చేది..

సోమవారం నుంచి శుక్రవారం వరకూ హౌస్‌లో ఉన్న పద్నాలుగు మంది మొహాలే కనిపించేవి.. శనివారం రాగానే ఎక్కడలేని హుషారు వచ్చేది. ఎందుకంటే ఆ రోజు ఎన్టీఆర్ వస్తారు కాబట్టి. ఆయన మాట వింటేనే కొత్తగా ఉండేది. హౌస్‌లో నేను బాగా ఎగ్జైటింగ్ ఫీల్ అయింది దేనికీ అంటే బిగ్‌బాస్ వాయిస్‌కే అని చెప్తా. ఆయన వాయిస్ వింటే తెలియని భయం, ఆనందం కలిగేది. ఆయన ఎలా ఉంటారో తెలుసుకోవాలని ట్రై చేశా.

• ఆలపాటి మధు ఫొటో: గోపీకృష్ణ

జీవితాంతం తోడుండేది స్నేహం ఒక్కటే!

నాన్న, అమ్మ, స్నేహితులు, ప్రేమికుల కోసం ఒక్కో రోజు కేటాయించి పండగలు చేసుకోవడం నాకు నచ్చదు. జన్మనిచ్చిన అమ్మానాన్నలను ప్రతి క్షణం ప్రేమించాలి. స్నేహితుల మధ్య స్నేహబంధం మరింత బలపడాలి. ప్రేమికులకు ప్రతి రోజూ ప్రేమికుల రోజుగానే ఉండాలి. ఏదో ఒక రోజు అనుకుని ఆ రోజు మాత్రం ఎక్కడాలేని ప్రేమను కురిపించేసి, పార్టీలు చేసుకోవడం నాకు నచ్చదు. అమూల్య నా ప్రాణస్నేహితురాలు. అయిదో తరగతిలో మా స్నేహం ప్రారంభమైంది. ఇప్పటికీ ఒకేలా ఉన్నాం. కష్టమైనా, సుఖమైనా చనువుగా స్నేహితులతోనే పంచుకోగలం. చాలా విషయాలు తనతోనే పంచుకుంటా. ఎన్ని బంధాలున్నా స్నేహబంధం ఎప్పటికీ మారదు. అమూల్య తర్వాత నా భర్త శ్రీకాంత్ కూడా నా బెస్ట్ ఫ్రెండ్. ఆయనతో పిన్ టు పిన్ షేర్ చేసుకుంటా. ఫ్రెండ్‌షిప్ డే అనీ, ఇంకోటని సందర్భాలు చూసుకుని బహుమతులు ఇచ్చుకోవడం మా ఇద్దరికీ నచ్చదు. మాకు ఎప్పుడు ఇచ్చుకోవాలనిపిస్తే.. అప్పుడే బహుమతులు ఇచ్చుకుంటాం.










DR. D.RAMANAIDU PRESENTS
AUGUST 11th RELEASE
BLUE PLANET Entertainments
నేనే రాజు నేనే మంత్రి
TEJA
SURESH BABU KIRAN REDDY BHARATH CHOWDARY
ANUP RUBENS VENKAT.C.DILIP KOTAGIRI VENKATESWARA RAO PARCHURI BROTHERS
LAXMI BHUPALA NARAYAN REDDY SURENDRA KRISHNA SHANKAR RAVI VERMA
PANTHER NAGARAJ VIVEK KUCHIBOTLA ABHIRAM DAGGUBATI
U/A
A SURESH PRODUCTIONS (P) LTD AND BLUE PLANET ENTERTAINMENTS LLP PRODUCTION


VENKAT BOYANAPALLI PRESENTS
ఆగస్ట్ 11 న విడుదల
14 REELS
HANU RAGHAVAPUDI
లై
LIE
LOVE INTELLIGENCE ENMITY
RAM ACHANTA GOPI ACHANTA ANIL SUNKARA
MANI SHARMA YUVARAJ S.R.SHEKHAR RAJU SUNDARAM KECHA HARISH KATTA AVINASH KOLLA KRISHNA KANTH
ADITYA MUSIC
/14reels /14reelsofficial /14reels


MIRYALA SATHYANARAYANA REDDY PRESENTS
DWARAKA CREATIONS
A BOYAPATI SREENU FILM
ROCKSTAR DSP
ఈ వారమే బ్రహ్మాండమైన విడుదల
జయ జానకి నాయక
MIRYALA RAVINDER REDDY BOYAPATI SREENU
DEVI SRI PRASAD
CHITYALA SAIKUMAR REDDY
M.RATHNAM RISHI PUNJABI SAHI SURESH KOTAGIRI VENKATESWARA RAO RAM-LAXMAN PREM RAKSHITH VAMSI SHEKAR

టెకీ రైతులు.. హైటెక్ సేద్యం

ఎంటెక్ నుంచి సాగు బాటలో..

ఆదర్శంగా నిజామాబాద్ యువ రైతు నవీన్

నిజామాబాద్‌కు చెందిన మగ్గిడి నవీన్ కుమార్ ఎంటెక్ చదివారు. కొన్నాళ్లు ఉద్యోగం చేశారు. మనసు వ్యవసాయం వైపు మళ్లింది. స్వగ్రామం చేరుకున్నారు. బ్యాంక్‌లోన్ తీసుకుని పాలీహౌస్ ప్రారంభించారు. తొలి సంవత్సరమే మంచి లాభాలు గడించారు. అరుదైన చామంతుల నర్సరీ ఏర్పాటు చేసి తెలుగు రాష్ట్రాల్లోని జిల్లాలన్నింటికీ చేమంతి నారు సరఫరా చేస్తున్నారు. భేషైన సాగు పద్ధతులు అవలంబిస్తున్న ఆ యువరైతు పేరు ఇప్పుడు అంతటా మారుమోగుతున్నది.


పాలీహౌస్‌లో సాగవుతున్న తెల్ల చామంతి

నిజామాబాద్‌లోని కంఠేశ్వర్‌కు చెందిన మగ్గిడి నవీన్ కుమార్ ఉస్మానియా యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చదివారు. కొంత కాలం ఉద్యోగం చేశారు. ఎవరి దగ్గరో ఉద్యోగం చేసే కంటే పుట్టిన ఊళ్లో సొంతంగా వ్యవసాయం చేసుకుంటే మేలని భావించారు. డిచ్‌పల్లి మండలంలోని బీబీపూర్ తండా శివారులో కొంత భూమి సేకరించి పాలీహౌస్ సేద్యం చేయాలని సంకల్పించారు. అందుకోసం ఖర్చు భారీగా అవుతుంది. పాలీహౌస్ నిర్మాణం కోసం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని తెలిసి దరఖాస్తు చేసుకున్నారు. 1.3 కోట్ల రూపాయలు ఖర్చు చేసి పాలీహౌస్ నిర్మించుకున్నారు. అందులో 90 లక్షల రూపాయలు ప్రభుత్వం సబ్సిడీ కింద ఇచ్చింది.

పాలీహౌస్ సేద్యంలో మెళకువలు తెలుసుకున్న నవీన్ రొటీన్ పంటలను వదిలేసి మంచి ఆదాయం ఇచ్చే పంటల సాగు ప్రారంభించారు. చామంతి, బీర, టమాటా, చెర్రీ టమాటా, క్యాప్సికం, వంకాయ, చిక్కుడు, బీర, సొర, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, క్యారెట్, బీట్‌రూట్ పంటల సాగు చేపట్టారు. వీటి సాగులో ఆధునిక పద్ధతులు అవలంబించడంతో భారీగా దిగుబడులు సాధించాడు నవీన్. పాలీహౌస్‌లో పండించిన నాణ్యమైన పంటలను హైదరాబాద్, నిజామాబాద్, కరీంనగర్ తదితర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు ఈ యువ రైతు. తను పండించిన పంటలను స్వయంగా విక్రయించడం ద్వారా అధిక లాభాలు గడిస్తున్నారు.



పాలీహౌస్ సాగు ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చు. మరెక్కడా లేని విధంగా పాలీహౌస్ నిర్మాణానికి ఉద్యానవన శాఖ భారీ మొత్తంలో సబ్సిడీ అందజేస్తోంది. నిజానికి ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వకపోతే పాలీహౌస్ ఏర్పాటు చేయలేకపోయేవాడిని. ప్రస్తుతం పూలు, కూరగాయలకు ఎక్కువ డిమాండ్ ఉంది. మార్కెట్‌కు అనుగుణంగా పాలీహౌస్‌లో సాగు చేస్తే రైతులకు భారీగా లాభాలు ఆర్జించే అవకాశం వుంది.

– నవీన్, రైతు, నిజామాబాద్

లాభాల తెల్ల చామంతులు

మార్కెట్‌లో ఏ వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్ ఉన్నదో గమనించి ఆ పంటలు సాగు చేయడం నవీన్ ప్రత్యేకత. ఈ సీజన్‌లో పూలకు మంచి డిమాండ్ ఉంటుందని గ్రహించన ఆయన చేమంతి పూల సాగు ప్రారంభించారు. పాలీహౌస్‌లో చేమంతులు విరగకాశాయి. కేవలం చేమంతి పూల ద్వారా ఏడాది కాలంలో 15 లక్షల ఆదాయం సంపాదించారు నవీన్. చేమంతి సాగు చేపట్టడంతో ఆగకుండా చేమంతి నారును పెంచడం లాభదాయకం అని తెలుసుకున్నారా ఆ యువరైతు.చామంతి నర్సరీని ఏర్పాటు చేసి రాష్ట్రంలోని 30 జిల్లాలకు మొక్కలను సరఫరా చేయడం ప్రారంభించారు నవీన్. దీనివల్ల అదనపు ఆదాయం పొందుఉన్నారు.

బీరసాగు భళా

పాలీహౌస్‌లో అర ఎకరంలో యాంటీ పాలీనేషన్ ద్వారా బీరకాయ పంటను సాగుచేసి మంచి దిగుబడులు సాధించాడు. వ్యవసాయ అధికారులు, ఉద్యానవన శాఖ అధికారుల సలహాలు, సూచనలు ఎప్పటికప్పుడు తీసుకుంటున్నారు. పంటలకు చీడపీడలు సోకకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తక్కువ భూమిలో ఎక్కువ పంటలను సాగుచేసి అధిక లాభాలు గడిస్తున్నారు ఈ రైతు. యాంటీ పాలినేషన్ ద్వారా బీరకాయ సాగు చేయడంతో ఆయనకు ఈ సీజన్‌లో 3లక్షల రూపాయలు ఆదాయం సమకూరింది. మిగిలని పంటల సాగు ద్వారా ఉద్యోగంలో వచ్చే జీతం కంటే స్వయంకృషితో అధిక ఆదాయం పొందుతున్నారు నవీన్. తనతో పాటు పది మందికి జీవనోపాధి కల్పిస్తున్నారు అ విద్యాధిక రైతు.

– ఆంధ్రజ్యోతి ప్రతినిధి, డిచ్‌పల్లి


నవీన్‌ను అభినందిస్తున్న మంత్రి

మంత్రి అభినందన

బీబీపూర్‌తండా శివారులో జాతీయ రహదారి పక్కనే పాలీహౌస్ ద్వారా పంటల అధిక దిగుబడి సాధిస్తున్న రైతు నవీన్‌కుమార్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు. ఎంటెక్ చదివినా పాలీహౌస్‌ను ఏర్పాటు చేసుకొని కూరగాయలు, పూలసాగు చేస్తున్న రైతు నవీన్ యువతకు అందరికీ ఆదర్శ ప్రాయుడని మంత్రి పేర్కొన్నారు.

ఒక దేశం సుసంపన్నం అయ్యేందుకు మూడు మార్గాలున్నాయి. ఒకటి యుద్ధం. రెండు వ్యాపారం. దేశం ఆర్థికంగా ఎదిగేందుకు ఈ రెండింటికంటే అత్యంత గౌరవప్రదమైన, అద్భుతమైన మార్గం వ్యవసాయం. – బెంజిమెన్ ఫ్రాంక్లిన్

కృషి

అన్న పీజీ.. తమ్ముడు బీటెక్

ఇద్దరు కలిశారు.... అనుకున్నది సాధించారు

తొర్రూరు: ఉన్నత విద్యను అభ్యసించినప్పటికి ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వంత శక్తిపై ఆధారపడ్డారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామ శివారు కొత్తగూడెంకు చెందిన కందాడి అశోక్‌రెడ్డి ఎంఎస్సీ, ఆయన సోదరుడు కందాడి రవికిరణ్‌రెడ్డి బీటెక్ విద్యను చదివారు. తల్లిదండ్రులు పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. పంటల సాగులో తగిన లాభాలు రాకపోవడంతో తమ వ్యవసాయ క్షేత్రంలో నూతన పంటలను సాగు చేయాలని ఆలోచన చేశారు. డ్రిఫ్ పద్ధతిలో పంటలను సాగు చేస్తున్నారు. ఉద్యానవన శాఖ ద్వారా సబ్సీడిపై 2.5 ఎకరాల్లో శాశ్వత పందిర్ల నిర్మాణం, క్రిపర్ మెష్ ద్వారా కూరగాయల సాగు కొనసాగిస్తున్నారు. పందిరి నిర్మాణం కోసం రూ. 4.80లక్షలు, క్రిపర్ మెష్ కోసం రూ. 1.20లక్షలు ఖర్చు చేశారు.


కాకర, బీర తోటల పంట దిగుబడిని చూపుతున్న రైతు అశోక్‌రెడ్డి

స్వయంగా అమినో యాసిడ్స్ తయారు

మొక్కల పెరుగుదల ఆరోగ్యవంతంగా ఉండడం కోసం అమినో యాసిడ్స్‌ను స్వయంగా తయారు చేసుకుంటున్నారు. పది కిలోల పచ్చి చేపలను తీసుకవచ్చి ముక్కలుగా చేసి పది కేజీల బెల్లం, పది లీటర్ల నీరుపోసి ఒక పెద్ద కుండలో వేసి ప్రతిరోజు కలుపుతూ పైన గాలి సోకకుండా మూత పెడతారు. తొలుత కొన్ని రోజుల తరువాత దుర్వాసన వస్తుంది. తరువాత సువాసన వచ్చిన తరువాత 50 ఎంఎల్ ద్రావణంలో పది లీటర్ల నీటిని కలిపికూరగాయల మొక్కలపై పిచికారి చేస్తారు. ఎప్పటికప్పుడు ఉద్యానవన శాఖ, స్వర్ణఫల్ కంపెనీల సలహాలు, సూచనలను పాటిస్తున్నారు. వాస్తవానికి లైట్ ట్రాఫ్ ద్వారా రూ. 1500 ఉన్న ఉద్యానవనశాఖద్వారా 95శాతం సబ్సీడితో రూ. 150కి అందిస్తున్నారు. పండు ఈగలను బంధించడానికి ఒక బాక్స్‌లో తియటి పదర్థాం ఏర్పాటు చేస్తారు. లైట్ వెలుతురుకు పురుగులు అందులోకి ప్రవేశించి మళ్లి బయటికిరాకుండా వేడితో చనిపోతాయి. కూరగాయలు సాగు చేస్తున్న క్షేత్రానికి కషాయాలు, మందుల పిచికారి మౌంటెడ్ స్ప్రేయర్ వినియోగిస్తున్నారు. వాస్తవానికి ట్రాక్టర్ ద్వారా మామిడి తోటలకు వినియోగిస్తారు. ఈ పరికరాన్ని మార్పు చేసి ఒక ఎలక్ట్రికల్ మోటారును స్టాండ్‌పై బిగించి డ్రమ్ములో పోసిన మందును స్ప్రే చేస్తారు. గంటలో ఎకరం క్షేత్రానికి స్ప్రే చేయవచ్చు. పరికరం రూపకల్పన కోసం రూ.20వేల ఖర్చు వస్తుంది.

రసాయన ఎరువులు వాడకుండా పంటల సాగు

రసాయనిక ఎరువులు వాడకుండా ప్రకృతి సిద్ధమైన కషాయాలను వినియోగిస్తూ కూరగాయల సాగును కొనసాగిస్తున్నాడు. బీర, కాకర, టమాట, ఉల్లి, కొత్తిమీర,సొరకాయ, నేలచిక్కుడు పంటలను సాగు చేస్తున్నారు. బోజ పద్ధతిలో పసుపు సాగు చేస్తున్నారు.

పంటల సాగులో ఆధునిక పద్ధతులు పాటిస్తున్నాము

సాంప్రదాయ పద్ధతులకు భిన్నంగా పంటల సాగులో ఉద్యానవన శాఖాధికారుల సలహాలు, సూచనలతో పాటు ప్రకృతి సిద్ధంగా ఆలోచనలను అమలు చేస్తూ పంటల సాగు కొనసాగిస్తున్నాం. ప్రభుత్వం ద్వారా వచ్చే సబ్సీడీలతో పాటు సాంకేతికతను వినియోగించడం ద్వారా కూరగాయల దిగుబడి అధికంగా సాధిస్తున్నాం మాతో పాటు ప్రతిరోజు 20 మంది కూలీలకు ఉపాధి కల్పిస్తున్నాం. ఎవరికైనా సూచనలు కావాలంటే 9989555855, 9849567430లో అందుబాటులో ఉంటాం

– కందాడి అశోక్‌రెడ్డి

సింగరేణిలో సోలార్ ప్లాంట్లు

- 50-100 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు
- నివేదిక కోరిన సీఎండీ శ్రీధర్

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): థర్మల్ విద్యుత్ ఉత్పాదనలో అడుగుపెట్టి విజయాలు సాధిస్తున్న సింగరేణి సంస్థ, సౌర విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి పెట్టింది. ఆరు జిల్లాల్లోని సంస్థ ఖాళీ స్థలాలలో 50 నుంచి 100 మెగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్ ప్లాంట్లు నెలకొల్పాలని సంస్థ యోచిస్తోంది. ఈ అంశంపై శనివారం సింగరేణి భవన్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్‌కు టీఎస్ రెడ్‌కో ప్రతినిధులు సుధాకర్‌రావు, ఆర్.సునిల్‌కుమార్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. కాగా, సౌర విద్యుత్ ప్లాంట్‌కు అవసరమయ్యే సామాగ్రి, ఉపకరణాల విడిభాగాలపై బీహెచ్ఈఎల్ ప్రజంటేషన్ ఇచ్చింది. ఈ క్రమంలో సింగరేణిలో 12 చోట్ల సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు సాధ్యసాధ్యాలపై నివేదిక ఇవ్వాలని సంస్థ సీఎండీ ఆదేశించారు. అనంతరం ఆయన సింగరేణి థర్మల్ ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహించారు. సంస్థకు చెందిన జైపూర్ ప్లాంట్ ఇప్పటి వరకు 7,255 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేయగా, అందులో 6,757 మిలియన్ యూనిట్లు రాష్ట్రానికి సరఫరా చేశారు.

ఎరువుల దుకాణాల్లో టోల్ ఫ్రీ నంబర్లు

- వ్యవసాయ శాఖకు అంచనాల కమిటీ సూచన

కల్తీ ఎరువులు, పురుగు మందులపై ఫిర్యాదు చేసేందుకు అన్ని ఎరువుల దుకాణాల్లో టోల్ ఫ్రీ నంబర్లు అందుబాటులో ఉంచాలని, ఆ నంబరును విస్తృతంగా ప్రచారం చేయాలని శాసనసభ అంచనాల కమిటీ సూచించింది. అసెంబ్లీలోని కమిటీ హాలులో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులతో శనివారం సమావేశమైన అంచనాల కమిటీ, వ్యవసాయ బడ్జెట్‌పై సమీక్ష జరిపింది. ఛైర్మన్ సోలిపేట రామలింగారెడ్డి అధ్యక్షతన సమావేశమైన కమిటీ వ్యవసాయ రుణ మాఫీతో పాటు, రాష్ట్రంలో కరువు పరిస్థితులు, రైతులకు చెల్లిస్తున్న ఇన్‌పుట్ సబ్సిడీ.. తదితర వివరాలు ఆరా తీసింది. రైతులకు సబ్సీడీపై ట్రాక్టర్ల పంపిణీ పథకాన్ని పారదర్శకంగా అమలు చేయాలని, మార్కెట్‌లో ధర తగ్గినపుడు ఆ మేర రైతుకు లబ్ధి చేకూర్చాలని, ఈ అంశాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించాలని కమిటీ ఆదేశించింది. పట్టుపురుగు ఉత్పత్తుల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరింది. పట్టును కొనుగోలు కేంద్రాలకు తరలించే బాధ్యతను ఆయా కేంద్రాల నిర్వాహకులే తీసుకోవాలనికమిటీ సూచించింది. కమిటీ సభ్యులు వేముల వీరేశం, అంజయ్య యాదవ్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, వ్యవసాయ శాఖ కార్యదర్శి పార్థసారథి, కమిషనర్ జగన్మోహన్ హాజరయ్యారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

- ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో ఢిల్లీలో ప్రదర్శన
- 7 నుంచి ఢిల్లీలో లొల్లి: జాజుల

న్యూఢిల్లీ/హైదరాబాద్: బీసీలకు చట్ట సభల్లో 50శాతం రిజర్వేషన్ కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు చట్ట సభల్లో ప్రాతినిధ్యం లభించని కులాలకు ప్రత్యేకంగా 20 శాతం సీట్లను అదనంగా సృష్టించి, ఆంగ్లో ఇండియన్ తరహాలో నామినేట్ చేయాలని సూచించారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో ఢిల్లీలో వందలాది మందితో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. 50 శాతం రిజర్వేషన్లకు సంబంధించి ఏపీ, తెలంగాణ సీఎంలు ప్రధాని మోదీపై ఒత్తిడి తేవాలని కోరారు. దేశంలో 56 శాతం జనాభా ఉన్నా బీసీలకు విద్యా, రాజకీయ, ఆర్థిక, పారిశ్రామిక రంగాల్లో అన్యాయం జరుగుతోందన్నారు. బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ఈ నెల 7 నుంచి మూడు రోజుల పాటు ఢిల్లీలో 'బీసీల లొల్లి' పేరిట ఉద్యమం చేస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో నలుగురి మృతి

ఎద్దును రక్షించబోయి అసువులు బాసిన అన్నదాత



జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రేచపల్లిలో మృతి చెందిన మదన్‌లాల్, మహబూబాబాద్ జిల్లా జమాండ్లపల్లి శివారు చంద్రుతండాలో విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన రైతు శక్రు, దుక్కిటెద్దు

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్: రాష్ట్రంలో శనివారం విద్యుదాఘాతంతో నలుగురు వ్యక్తులు, ఒక ఎద్దు మృత్యువాత పడ్డారు. సూర్యాపేట జిల్లా మోతె మండలం రాఘవాపురంలో పెద్దింటి శ్రీకాంత్(22), వీరబోయిన మహేష్(18) విద్యుదాఘాతంతో మృతి చెందారు. బోరుబావికి విద్యుత్ కనెక్షన్ ఇస్తుండగా వీరు విద్యుదాఘాతానికి గురయ్యారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. జగిత్యాల జిల్లాలోని సారంగాపూర్ మండలం రేచపల్లిలో మదన్‌లాల్ (45)అనే కౌలు రైతు విద్యుత్ మోటర్‌ను సరి చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. వ్యవసాయ పనుల్లో తోడుగా ఉండే మూగజీవిని రక్షించబోయి అన్నదాత మృత్యు ఒడిలోకి చేరాడు. మహబూబాబాద్ జిల్లా చంద్రు తండాకు చెందిన రైతు సునావత్ శక్రు(55) శుక్రవారం రాత్రి దుక్కిటెద్దులను తన ఇంటి ఎదుట వరండాల్లో కట్టేశాడు. బట్టలు ఆరేసుకునేందుకు కట్టిన ఇనుపవైరుకు ఎద్దు కొమ్ము తగిలింది. సదరు వైరుకు విద్యుత్ ప్రవాహం రావడంతో అది కిందపడింది. ఈ శబ్దానికి రైతు శక్రు బయటకు వచ్చి చూశాడు. గతంలో మూర్చవ్యాధితో సదరు ఎద్దు ఇలాగే పడేది ఆ సమయంలో చెవులు మూయడంతో తేరుకునేది. అదేరీతిన మూర్చతో కిందపడిందని బావించి రైతు తన చేతులతో ఎద్దుచెవులను మూశాడు. విద్యుతషాక్ తగిలి అక్కడిక్కడే మృతి చెందాడు. ఓవైపు దుక్కిటెద్దు, సమీపంలోనే మరో వైపు రైతు మృత్యు ఒడిలోకి జారుకున్నారు.


భక్తులకు మొక్కలు అందజేస్తున్న కలెక్టర్

జగిత్యాలలో వృక్ష ప్రసాదం


జగిత్యాల: హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జగిత్యాల జిల్లా జిల్లా కలెక్టర్ శరత్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రముఖ పుణ్యక్షేత్రాలైన కొండగట్టు ఆంజనేయస్వామి, ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి, సారంగాపూర్‌లోని దుబ్బరాజన్నస్వామి ఆలయాల్లో 'వృక్షప్రసాదం' కార్యక్రమాన్ని చేపట్టారు. వివిధ రకాల పండ్లు, పూల మొక్కలను తెప్పించి ఆలయ ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య పూజలు చేయిస్తున్నారు. వాటిని 'వృక్షప్రసాదం' పేరిట భక్తులకు ఒక్కో మొక్క అందజేస్తున్నారు. వృక్ష ప్రసాదం పేరిట 50 వేల మొక్కలు అందించాలని లక్ష్యం నిర్ణయించగా ఇప్పటివరకు 25వేల మొక్కలు అందజేసినట్లు కలెక్టర్ శరత్ తెలిపారు.

ఉత్తమ్ ఇంటి ముట్టడికి టీఆర్ఎస్ యత్నం

- సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసన
- అడ్డుకున్న పోలీసులు.. ఉత్తమ్ దిష్టిబొమ్మ దహనం

హుజూర్‌నగర్, ఆగస్టు 5: సీఎం కేసీఆర్‌పై టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ ఇతర నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేశారని, కోర్టుల్లో కేసులు వేస్తూ రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో టీఆర్ఎస్ కార్యకర్తలు శనివారం ఉత్తమ్ ఇంటిని ముట్టడించేందుకు ప్రయత్నించారు. అయితే రహదారి బంగ్లా నుంచి వెళ్తున్న కార్యకర్తలను పోలీసులు మధ్యలోనే అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, టీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు రోడ్డు స్టాపర్లను అడ్డంగా పెట్టడంతో వారు రోడ్డుపై బైఠాయించి ఉత్తమ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అల్లంప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ బంగారు తెలంగాణ కోసం పాటుపడుతుంటే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అడ్డం కులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. సూర్యాపేట జిల్లాను సస్యశ్యామలం చేసే కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుకునేందుకు కాంగ్రెస్ నాయకులు కేసులు వేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు కొండానాయక్, వెంకటనారాయణ, నాగేశ్వరరావు, రాంబాబు, నర్సింహారావు, బాలకృష్ణ పాల్గొన్నారు.


టీఆర్ఎస్ కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు



విద్యార్థులతో కారు ఆకృతి

- గత గిన్నీస్ బుక్ రికార్డు బ్రేక్

హన్మకొండ, ఆంధ్రజ్యోతి: సఫల్ భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 3వేల మందికిపైగా విద్యార్థులతో కారు ఆకృతి ప్రదర్శన నిర్వహించింది. గిన్నీస్ బుక్ రికార్డును బ్రేక్ చేసింది. శనివారం సేయింట్ గ్యాబ్రియల్ స్కూల్ గ్రౌండ్‌లో సఫల్ భారతి ఈ ఫీట్‌ను చేపట్టింది. గత సంవత్సరం చెన్నైలో 1660 మంది విద్యార్థులతో ఇలాగే కారు ఆకృతిలో నిర్వహించిన ప్రదర్శన గిన్నీస్ బుక్‌లోకి ఎక్కింది. దీనిని అధిగమించాలని సఫల్ భారత్ ఫౌండేషన్ 3250 మంది విద్యార్థులతో ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. విద్యార్థులు కారు ఆకారంలో సుమారు 10 నిమిషాల పాటు కూర్చున్నారు.

ఫిబ్రవరిలోగా ప్రధానాలయ నిర్మాణం పూర్తి

యాదాద్రి పునర్నిర్మాణ పనులు పరిశీలించిన సీఎంవో కార్యదర్శి భూపాల్‌రెడ్డి

యాదాద్రి, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వారి ప్రధాన ఆలయాన్ని ఫిబ్రవరిలోగా పూర్తి చేయాలని సీఎంవో కార్యదర్శి భూపాల్‌రెడ్డి కోరారు. గోపురాలు, ప్రాకార మండపాలు, రక్షణగోడతో పాటు కొండపై పనుల్లో వేగం పెంచాలని శిల్పులు, నిర్మాణ సంస్థలను ఆదేశించారు. శనివారం ఆయన వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు, కలెక్టర్ అనితారామచంద్రన్, ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ రవీందర్‌రావు, ఆర్కిటెక్ట్ ఆనందసాయి, స్తపతులు సుందరరాజన్, వేలు ఆలయ అధికారులతో యాదాద్రి ప్రధాన ఆలయ నిర్మాణ పనుల్లో ప్రగతి, పెద్దగుట్ట వద్ద టెంపుల్ సిటీ లేఅవుట్ అభివృద్ధి పనులను పరిశీలించారు.

యాదాద్రిని సందర్శించిన చైనా బృందం

యాదాద్రి కొండపై క్షేత్రపాలకుడు ఆంజనేయ స్వామి కాంస్య విగ్రహ ఏర్పాటుకు చైనా బృందం శనివారం యాదాద్రి క్షేత్రాన్ని సందర్శించింది. చైనాకు చెందిన ఎరోసన్ ఇంజనీరింగ్ సంస్థకు చెందిన డాంగ్ బృందం కొండపై 108 అడుగుల ఆంజనేయస్వామి కాంస్య విగ్రహం ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలించారు. మరో మూడు సంస్థలు పరిశీలన అనంతరం తమ బిడ్స్ అందిస్తారని, వాటిని పరిశీలించిన తర్వాత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు.

ఉన్నత విద్యలో మార్పులు రావాలి

- జయశంకర్ స్మారకోపన్యాసంలో చంద్రకాంత్ కొకాటే



కేయూక్యాంపస్: దేశ వ్యాప్తంగా ఉన్నత విద్య రంగంలో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మార్పులు రావాల్సిన అవసరం ఉందని బెల్గాం వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ చంద్రకాంత్ కొకాటే అన్నారు. శనివారం కేయూలో జరిగిన తెలంగాణ సిద్ధాంతకర్త కొత్తపల్లి జయశంకర్ 5వ స్మారక ఉపన్యాసంలో మాట్లాడుతూ భారతదేశంలో 'ఉన్నత విద్య: ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్ సవాళ్లు' అనే అంశంపై సుదీర్ఘ ఉపన్యాసం చేశారు.

బిఎస్‌ఎన్‌ఎల్ 'రక్షా బంధన్' ఆఫర్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రక్షా బంధన్ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ప్రీపెయిడ్ కస్టమర్ల కోసం బిఎస్‌ఎన్‌ఎల్ సరికొత్త టారిఫ్ వోచర్లు/ కాంబో వోచర్లను అందుబాటులోకి తెచ్చింది. 74 రూపాయల ఎస్‌టివితో రీచార్జ్ చేసుకుంటే.. బిఎస్‌ఎన్‌ఎల్ నెట్‌వర్క్‌కు అపరిమితంగా కాల్స్ చేసుకోవచ్చు. అంతేకాకుండా ఇతర నెట్‌వర్క్‌ల కోసం 74 నిమిషాలు, 1జిబి డేటా లభిస్తుంది. దీని కాలపరిమితి ఐదు రోజులు. ఎస్‌టివి 188 రూపాయలతో రీచార్జ్ చేసుకుంటే 189 రూపాయల టాక్‌టైమ్, డెడికేటెడ్ ఎకౌంట్‌లో 31 రూపాయలతోపాటు 1జిబి డేటా లభిస్తుంది. దీని కాలపరిమితి 14 రోజులు. 289 రూపాయల ఎస్‌టివితో రీచార్జ్ చేసుకుంటే 289 రూపాయల టాక్‌టైమ్, డెడికేటెడ్ ఖాతాలో 51 రూపాయలతోపాటు 1జిబి డేటా పొందవచ్చు. దీని కాలపరిమితి 28 రోజులు. 389 రూపాయల ఎస్‌టివితో రీచార్జ్ చేసుకుంటే 389 రూపాయల టాక్‌టైమ్, డెడికేటెడ్ ఖాతాలో 71 రూపాయలతోపాటు 1జిబి ఉచిత డేటా లభిస్తుంది. దీని కాలపరిమితి 30 రోజులు.

రిటర్న్ ఫైల్ చేయలేదా.. అయినా పర్వాలేదు..

ముంబై: ఆదాయం పన్ను రిటర్న్స్ (2016-17 ఆర్థిక సంవత్సరానికి) దాఖలు చేసేందుకు గడువు శనివారంతో ముగిసింది. ఆఖరు నిమిషం రద్దీని తట్టుకునేందుకు వీలుగా ఆదాయం పన్ను శాఖ అధికారులు విస్తృతంగా ఏర్పాటు చేశారు. సీనియర్ సిటిజన్స్, 5 లక్షల రూపాయలలోపు వార్షికాదాయం ఉన్నవారు ఆదాయం పన్ను రిటర్న్స్ (ఐటిఆర్) దాఖలు చేసేందుకు శనివారం అర్ధరాత్రి వరకు ఐటి క్షేత్ర కార్యాలయాలను తెరిచే ఉంచారు. 5 లక్షల రూపాయల పైబడి వార్షికాదాయం ఉన్న వారు విధిగా ఇ-ఫైలింగ్‌చేయాల్సిందే. వాస్తవానికి టాక్స్ రిటర్న్స్ ఫైల్ చేయడానికి గడువు జూలై 31 నుంచి ఆగస్టు 5 వరకు ప్రభుత్వం పొడగించింది. గడువు పొడగించినా అనివార్య కారణాల వల్ల రిటర్న్స్ ఫైల్ చేయలేకపోయినవారు చాలా మంది ఉంటారు. ఏం పర్వాలేదు. ఆలస్యంగానైనా రిటర్న్స్ దాఖలు చేసే అవకాశం ఉంది. గడువు అయిపోయిన కారణంగా 2016-17 ఆర్థిక సంవత్సరానికి ఇక రిటర్న్స్ ఫైల్ చేసే అవకాశమే ఉండదని ఆందోళన పడవద్దు. 2018 మార్చి వరకు రిటర్న్ ఎప్పుడైనా ఫైల్ చేయవచ్చు. అయితే గడువు దాటిన తర్వాత రిటర్న్స్ ఫైల్ చేయడంలో కొన్ని ఇబ్బందులున్నాయి. చట్ట ప్రకారం లభించే పన్ను రాయితీలను వినియోగించుకోవడం సాధ్యం కాదు. ఉదాహరణకు ఆలస్యంగా రిటర్న్స్ దాఖలు చేయడం వల్ల, పెట్టుబడి నష్టాలను తర్వాత అసెస్‌మెంట్ సంవత్సరాలకు క్యారీఫార్వర్డ్ చేసే అవకాశం ఉండదు. ఒక సంవత్సరంలో చవిచూసిన పెట్టుబడి నష్టాలను ఆ తర్వాత సంవత్సరాల్లో సంపాదించే పెట్టుబడి లాభాలకు సెటాఫ్ చేసుకునే వెసులుబాటు ఐటి చట్టాలు కల్పిస్తున్నాయి.

ఉదాహరణకు స్టాక్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేసే ఒక వ్యక్తి 2016-17 ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడులపై నష్టాలను చవిచూశాడు. 'క్యాపిటల్ గెయిన్' హెడ్ కింద ఈ నష్టాలను తర్వాత సంవత్సరాల్లో వచ్చే క్యాపిటల్ గెయిన్స్ లాభాలతో సెటాఫ్ చేసుకునే వెసులుబాటు వల్ల పన్ను రాయితీలు పొందవచ్చు. ఒక సంవత్సరంలోని షార్ట్ టర్మ్ కాపిటల్ నష్టాలను తర్వాత సంవత్సరాల్లోని దీర్ఘకాలిక, స్వల్పకాలిక కాపిటల్ లాభాల్లో పన్ను రాయితీలకు వాడుకోవచ్చు. ఒక వ్యక్తి 2016-17లో భారీగా ఇన్వెస్ట్‌మెంట్ నష్టాలను చవిచూశాడు. 2017-18లో ఇన్వెస్ట్‌మెంట్ లాభాలను చవిచూశాడు. అయితే 2016-17లోని కాపిటల్ నష్టాలను 2017-18లోని లాభాలతో పూర్తిగా సెటాఫ్ చేసుకోలేకపోయాడనుకుందాం. అయినప్పటికీ చింతించాల్సిన అవసరం లేదు. ఒక అసెస్‌మెంట్ ఇయర్‌లోని నష్టాలను తర్వాత వరుసగా ఎనిమిది అసెస్‌మెంట్ సంవత్సరాల వరకు సెటాఫ్ చేసుకునే అవకాశం ఐటి చట్టాలు కల్పిస్తున్నాయి.

ఇది కాకుండా పన్ను బకాయిలున్న వ్యక్తులు సకాలంలో రిటర్న్స్ దాఖలు చేయని పక్షంలో ఈ బకాయిపై అపరాధవడ్డీని చెల్లించాల్సి వస్తుంది. పన్ను రిటర్న్ ప్రకారం చెల్లించిన పన్నుల కంటే ఇంకా ఎక్కువ పన్ను బకాయి ఐటి అధికారుల పరిశీలనలో తేలితే కూడా ఆ బకాయిని వడ్డీతో సహా చెల్లించాల్సి వస్తుంది. అందువల్ల రిటర్న్ దాఖలు చేయడంలో జాప్యమైనా పన్ను బకాయిలు ఏమైనా ఉంటే మాత్రం ముందుగానే చెల్లించడం మంచిదని నిపుణుల సలహా. అన్నింటిని మించి సెక్షన్ 271 ఎఫ్ కింద అసెస్‌మెంట్ అధికారులు ఆలస్యంగా రిటర్న్ ఫైల్ చేస్తే 5000రూపాయల వరకు జరిమానా విధించే అవకాశం కూడా ఉంది.

ట్రాక్టర్లు, టెక్స్‌టైల్స్‌పై తగ్గిన జిఎస్‌టి భారం

పన్ను లాభాలు బదిలీ చేయకపోతే చర్యలు
హైదరాబాద్‌లో జిఎస్‌టి కౌన్సిల్ తదుపరి భేటీ



న్యూఢిల్లీ : ట్రాక్టర్ల విడి భాగాలు, టెక్స్‌టైల్ జాబ్ వర్క్‌పై జిఎస్‌టి భారం తగ్గనుంది. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అధ్యక్షతన శనివారం జరిగిన జిఎస్‌టి మండలి ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. దీంతో ట్రాక్టర్ విడి భాగాలపై జిఎస్‌టి భారం 28 శాతం నుంచి 18 శాతానికి, జాబ్ వర్క్ పద్ధతిలో చేసే టెక్స్‌టైల్స్‌పై భారం 18 శాతం నుంచి ఐదు శాతానికి తగ్గుతుంది. ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ ఉన్న వర్క్ కాంట్రాక్ట్‌లపై విధించే జిఎస్‌టి పన్ను రేటును 12 శాతంగా ఖరారు చేసింది. తదుపరి జిఎస్‌టి మండలి సమావేశం సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో జరపాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు కేంద్ర-రాష్ట్రాల పన్నుల చెల్లింపు పరిధిలో ఉన్న 71 లక్షల మంది వ్యాపారులు, వ్యాపార సంస్థలు జిఎస్‌టికి మారినట్టు జైట్లీ చెప్పారు. కొత్తగా జిఎస్‌టి రిజిస్ట్రేషన్ కోసం మరో 15.67 లక్షల అప్లికేషన్లు వచ్చినట్టు తెలిపారు.

ఇ-వే బిల్లులు :

వస్తువుల రవాణాకు అత్యంత కీలకమైన ఇ-వే బిల్లుల నమూనాకూ జిఎస్‌టి మండలి సమావేశం ఆమోద ముద్ర వేసింది. పది కిలోమీటర్ల పైన రూ.50,000 కంటే విలువైన వస్తువుల రవాణా చేయాలంటే ఇక ఇ-వే బిల్లులు తప్పనిసరి. ఈ బిల్లును ఎప్పటి నుంచి అమలు చేసేది త్వరలో నోటిఫికేషన్ ద్వారా తెలియజేస్తామని జైట్లీ చెప్పారు. అయితే అక్టోబర్ 1 నుంచి ఈ విధానం అమలులోకి వస్తుందని భావిస్తున్నారు. జిఎస్‌టి మినహాయింపు ఉన్న వస్తువుల రవాణాకు మాత్రం ఇ-వే బిల్లు అవసరం లేదన్నారు. ఇ-వే బిల్లు చెల్లుబాటు కాలాన్నీ ఈ సమావేశంలో ఖరారు చేశారు. సరుకులు తీసుకెళ్లే దూరాన్ని బట్టి ఒకటి నుంచి 20 రోజుల పాటు చెల్లుబాటయ్యేలా ఇ-వే బిల్లులు జారీ చేస్తారు. ఒక ట్రక్కు రోజుకు వంద కిలోమీటర్లు ప్రయాణిస్తుందనే అంచనాతో ఈ బిల్లులు జారీ చేస్తారు.

వేటు తప్పదు

జిఎస్‌టి లాభాలను వ్యాపారులు వినియోగదారులకు బదిలీ చేయాల్సిందేనని జైట్లీ ఈ సందర్భంగా మరోసారి స్పష్టం చేశారు. లేకపోతే యాంటీ ప్రాఫిటీరింగ్ నిబంధన కింద చర్యలు తప్పవని హెచ్చరించారు. జిఎస్‌టితో పన్నుల భారం తగ్గిన వస్తువుల ధరలను వ్యాపారులు వినియోగదారులకు బదిలీ చేశారా? లేదా? అనే విషయం పరిశీలించేందుకు 15 రోజుల్లో ఒక స్క్రీనింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్టు చెప్పారు.

ఫ్లిప్‌కార్ట్ 'బిగ్ ఫ్రీడమ్ సేల్'

కనీస డిస్కౌంట్ 71 శాతం

న్యూఢిల్లీ: దేశీయ ఇ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ మరో భారీ డిస్కౌంట్ అమ్మకాలకు తెర తీస్తోంది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 9-11 తేదీల మధ్య 'ది బిగ్ ఫ్రీడమ్ సేల్: ఇండియా షాప్స్ బిగ్ దిస్ టైమ్' పేరుతో ప్రత్యేక అమ్మకాలు ప్రారంభిస్తోంది. ఇందులో 'లార్జెస్ట్ డెమోక్రసీ, లెజండరీ డీల్స్' ఆఫర్ కింద కొన్ని ఉత్పత్తులపై 71 శాతం కనీస డిస్కౌంట్ ఇవ్వనుంది. మంచి నాణ్యత ఉండే 30 రకాల వస్తువులపైనా 50 శాతం వరకు డిస్కౌంట్ ఇస్తున్నట్టు తెలిపింది. పురుషుల బట్టలు, యాక్సెసరీలు, సంప్రదాయ దుస్తులు, నగలపైనా ఈ మూడు రోజుల్లో ప్రత్యేక ఆఫర్లు ఉంటాయి.

ఎసిసిఎతో స్ట్రాటాజెమ్ ఒప్పందం

- విద్యార్థులకు ఉపాధి కోర్సులు



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న స్ట్రాటజెమ్, ఎసిసిఎ ప్రతినిధులు మహేష్, మార్టిన్. మధ్యలో నాగార్జునా వర్సిటీ విసి రాజేంద్ర ప్రసాద్.

హైదాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అకౌంటెన్సీ, ఫైనాన్స్, మేనేజ్‌మెంట్‌కు సంబంధించి అంతర్జాతీయ గుర్తింపు ఉన్న అసోసియేషన్ ఆఫ్ చార్టర్డ్ సర్టిఫైడ్ అకౌంట్స్ (ఎసిసిఎ) అందించే కోర్సులు తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాయి. హైదరాబాద్‌కు చెందిన స్ట్రాటజెమ్ ఫైనాన్షియల్ స్కూల్ అనే సంస్థ ఇందుకోసం ఎసిసిఎతో అవగాహనా ఒప్పందం (ఎంఒయు) కుదుర్చుకుంది. దాదాపు 180కిపైగా దేశాల్లో ఈ కోర్సులకు గుర్తింపు ఉందని స్ట్రాటజెమ్ ఫైనాన్స్ స్కూల్ సిఇఒ మహేష్ చెప్పారు. ఈ కోర్సుల్లో భాగస్వాములయ్యేందుకు గీతం యూనివర్సిటీతోపాటు కొన్ని ప్రైవేట్ కాలేజీలు ఇప్పటికే ముందుకొచ్చాయని చెప్పారు. మూడేళ్ల కాలవ్యవధి ఉండే ఈ కోర్సులో మూడు దశలు ఉంటాయి. ఇంటర్మీడియట్ ఎంఇసి, సిఇసితోపాటు, బికామ్, ఎంబిఎ ఫైనాన్స్ కోర్సుల్లో చేరిన విద్యార్థులు ఎసిసిఎ కోర్సుల్లో చేరవచ్చు. ఇంటర్మీడియట్ స్థాయిలోనే చేరితే ఇంటర్ పూర్తయ్యే సరికి ఒక లెవల్ పూర్తి చేయవచ్చని మహేష్ చెప్పారు. డిగ్రీ పూర్తయ్యే నాటికి డిగ్రీతో పాటు అంతర్జాతీయంగా ఉపాధి అవకాశాలున్న మరో డిగ్రీ లభిస్తుందన్నారు. ఒకో లెవల్ కోర్సుకు రూ.21,000 వరకు ఖర్చవుతుందని చెప్పారు.

ఎంఎన్‌సిల్లోనూ అవకాశాలు

	---	తిక్క పాండు, తండ్రి బాల్ నర్సయ్య	---
	---	తిక్క స్వామి తండ్రి రామయ్య	---
	---	తిక్క యాదయ్య, తండ్రి పెంటయ్య	---
	---	దర్శనం బస్వయ్య, తండ్రి ఎల్లయ్య	---
	---	సున్నం మల్లయ్య, తండ్రి నర్సింహ్మా	---
	---	తిక్క మల్లేశ్, తండ్రి బాలయ్య	---
	---	తిక్క నర్సింహ్మా, తండ్రి బాలయ్య	---
	---	తిక్క బాలయ్య, తండ్రి బాల్ నర్సయ్య	---
	---	దండెబోయిన నర్సింహ్మా, తండ్రి యాదయ్య	---
	---	తిక్క వెంకటయ్య, తండ్రి మల్లయ్య	---
	---	బిల్లా బస్వయ్య, తండ్రి రాజయ్య	---
	---	దారావత్ దర్బార్, తండ్రి పాండ్యా	---
	---	యిట్టబోయిన బాలమణి, తండ్రి అయిలయ్య	---
	---	మంచాల సాయమ్మ, భర్త సాలయ్య	---
24 ఖుష్కి/పట్టా 0.04 1/2	0.04 1/2	సల్లా అనిల్ కుమార్‌రెడ్డి, తండ్రి చంద్రారెడ్డి	---
33 ఖుష్కి/ప్రభుత్వ 2.31	0.28	బెజవాడ రాజారాం, తండ్రి నర్సయ్య	పహనీలోని బెజవాడ వారి పేరు ఉంది కానీ భూమిపై యన్. సత్యనారాయణ ఉన్నాడు.
	0.28	బెజవాడ లక్ష్మయ్య, తండ్రి నర్సయ్య	
	0.28	బెజవాడ కిష్టయ్య, తండ్రి నర్సయ్య	
	0.27	బెజవాడ సత్తయ్య, తండ్రి నర్సయ్య	
	---	పిట్టా రంగారెడ్డి, తండ్రి కిష్టరెడ్డి	---
	---	పిట్టా నర్సిరెడ్డి, తండ్రి కిష్టరెడ్డి	---
	---	పిట్టా అంజిరెడ్డి, తండ్రి కిష్టరెడ్డి	---
	---	సర్కారు	--
34 ఖుష్కి/చౌత,ఇనాం 0.13	0.13	బెజవాడ రాజారాం, తండ్రి నర్సయ్య	పహనీలోని బెజవాడ రాజారాం తండ్రి నర్సయ్య పేరు ఉంది కానీ భూమిపై యన్. సత్యనారాయణ ఉన్నాడు.
35 ఖుష్కి/పట్టా 2.23	0.07	గుడిపాటి దుర్గయ్య, తండ్రి మట్టయ్య	---
	2.16	సూర్యతేజ ప్లాటు	---
	---	ఓడూరి వినయ్ కుమార్‌రెడ్డి, తండ్రి కస్తూరిరెడ్డి	---
	---	శ్రీమతి పుష్పబాయి వరియా	---
	---	వి.నితిన్ నరేష్, తండ్రి డా. వి.నరేష్	---
	---	జిన రంజిత్‌రెడ్డి తండ్రి ఇంద్రసేనారెడ్డి	---
	---	ఈశ్వరవాక జయప్రకాశ్, తండ్రి చంద్రశేఖర్	---
	---	మనోజ్ కౌసిక్, తండ్రి జి.సి. కౌసిక్	---
	---	పిట్టా రంగారెడ్డి, తండ్రి కిష్టరెడ్డి	---
	---	పిట్ట అంజిరెడ్డి, తండ్రి కిష్టరెడ్డి	---
	---	గుంజ రవీందర్, తండ్రి రాజమౌళి	---
37 ఖుష్కి/పట్టా 2.06	2.06	షూక్సిమా వెంచర్ ప్లాట్లు	---
	---	సుగ్దలకే గుప్త	---
	---	నోముల బాలరాంరెడ్డి, తండ్రి రామస్వామి	---
	---	డా॥జి.మధుసూధన్‌రెడ్డి, తండ్రి చంద్రశేఖర్‌రెడ్డి	---
	---	యస్.నితిన్	---
	---	జే.చంద్రశేఖర్	---
	---	జే.ధీరాజ్ కుమార్	---
	---	మీర్ కౌసిక్ అలీఖాన్, తండ్రి ముఖఫత్ అలీఖాన్	---
	---	యం.డి.కూలీకూల్‌జామా	---
	---	శ్రీమతి చంద్రాదేవి	---
	---	మహ్మద్ తిహార్ అలీ	---
	---	శ్రీమతి బోగ మహాదేవి, భర్త చెన్నయ్య	---
	మొత్తం	**8.16 1/2**	

ఇట్టి నోటిఫికేషన్ భూసేకరణ భూ నిర్వాసితుల పునరావాసం మరియు పునరుద్దరణ చట్టం, 2013 (నెం.30/2013) లోని నియమకంలోని సెక్షన్ (11)1 ప్రకారం సంబంధిత భూ యాజమానులకు సరియైన భూ నష్టపరిహారం చెల్లించుటకు గాను నోటిఫికేషన్ జారీచేయనైనది.

భూమి యొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కలెక్టర్, యాదాద్రి-భువనగిరి మరియు భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టరు (భూ.సే), యాదాద్రి-భువనగిరి గారి కార్యాలయంలో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైన పని దినములలో కార్యాలయ వేళలలో తనిఖీ చేసుకోవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, యాదాద్రి-భువనగిరి గారు ప్రత్యేక ఉప కలెక్టరు (భూ.సే), యాదాద్రి-భువనగిరి గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించి సెక్షన్ 12 ప్రకారం పైన చూపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలుతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11 (4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయంలో జిల్లా కలెక్టర్, యాదాద్రి-భువనగిరి గారి అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారీచేసిన తేది నుండి ఆ ప్రకటనలో ఉదహరింపబడిన భూములకు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకం, తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు.

భూ సేకరణ విషయంలో సంబంధించిన భూ యాజమానులు ఏదైన అభ్యంతరములున్న యెడల చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం జిల్లా కలెక్టరు యాదాద్రి-భువనగిరి గారికి లిఖిత పూర్వకంగా తెలియజేయవలసి ఉన్నది. ఇట్టి ప్రకటన జారీ చేసిన (60) దినముల లోపల ఏమైనా అభ్యంతరములున్న యెడల వారి అభ్యంతరములు లిఖిత పూర్వకంగా తెలియజేయవలసి ఉన్నది.

సం/- **ప్రత్యేక ఉప కలెక్టరు (భూ.సే)** యాదాద్రి-భువనగిరిజిల్లా
సం/- **సంయుక్త కలెక్టర్,** యాదాద్రి-భువనగిరిజిల్లా
సం/- **జిల్లాకలెక్టర్,** యాదాద్రి-భువనగిరిజిల్లా

వెంకయ్య జయభేరి

(మొదటి పేజీ తరువాయి)

ఓట్లు వచ్చాయి. ఉభయ సభల్లో 785 మంది ఎంపీలుండగా, 771 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పద్నాలుగు మంది ఓటే యలేదు. మొత్తం 98.21 శాతం పోలింగ్ నమోదైంది. నమోదైన ఓట్లలో 11 చెల్లలేదు. మ్యాజిక్ ఫిగర్ 381 కన్నా అదనంగా 135 ఓట్లను వెంకయ్య నాయుడు సాధించారు. వెంకయ్యకు 68 శాతం, గాంధీకి 32 శాతం ఓట్లు పోలయ్యాయి. ఉభయ సభల్లో కలిపి ఎన్‌డీఏకు మెజారిటీ ఉన్నందున ఆయన విజయం ముందుగా ఊహించిదే. వ్యక్తిగతంగా ఆయనపై ఉన్న అభిమానంతో ఇతర పార్టీల ఎంపీలు కూడా ఆయనకు ఓటేశారు. దీంతో ఊహించినదాని కన్నా ఎక్కువ మెజారిటీ వచ్చింది. యూపీఏ కూటమి లోని కొన్ని పార్టీల ఎంపీలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్లు స్పష్టమవు తోంది. సాయంత్రం కౌంటింగ్ జరిగింది. వెంకయ్యనాయుడు గెలిచినట్లు రిటర్నింగ్ అధికారి, రాజ్యసభ సెక్రటరీ జనరల్ షంషేర్ షరీఫ్ ప్రకటిం చారు. వెంటనే ఆయన నివాసానికి వెళ్లి సర్టిఫికెట్‌ను అందజే శారు. భారీ తేడాతో గెలిచిన వెంకయ్యకు ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా స్వయంగా ఆయన నివాసానికి వెళ్లి అభినందనలు తెలిపారు. ఫలి తాలు రావడానికి ముందే హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంతకుమార్ పుష్పగుచ్ఛాలను ఇచ్చి అభినందనలు తెలియజేశారు. కేంద్ర మంత్రులు, వివిధ పార్టీల నేతలు కూడా వెంకయ్యనాయుడికి అభినందనలు తెలి పిన వారిలో ఉన్నారు.

11న ప్రమాణం

ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ పదవీకాలం ఈ నెల 10వ తేదీతో ముగుస్తోంది. 11న ఉదయం వెంకయ్యనా యుడు ప్రమాణ స్వీకారం చేస్తారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ రాష్ట్రపతి భవన్‌లో ఆయనతో ప్రమాణం చేయిస్తారు. వెంటనే వెంకయ్య రాజ్యసభ ఛైర్మన్‌గా కూడా పదవీ బాధ్యతలను చేపడతారు.

సెల్ఫీలే సెల్ఫీలు

న్యూఢిల్లీ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటేయడానికి పార్లమెంటుకు వచ్చిన ఎంపీలలో చాలామంది తమ తోటి సెలబ్రిటీ ఎంపీలతో సెల్ఫీలు దిగుతూ కనిపించారు. రాజ్యసభ నామినేటెడ్ ఎంపీలు రేఖ, సచిన్‌లు వచ్చినప్పుడు వారితో సెల్ఫీలు దిగేందుకు ఎక్కువ మంది ఎంపీలు ఆసక్తి చూపారు. టీఆర్ఎస్ ఎంపీ కవిత మెగాస్టార్ చిరంజీవితో సెల్ఫీలు దిగారు. ఆ సమయంలో అక్కడకు వచ్చిన కొంతమంది తెలుగు దేశం ఎంపీలతో కూడా ఆమె సెల్ఫీలు దిగారు.

మద్దతిస్తున్న పార్టీల ఎంపీలంతా వచ్చి ఓటేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటువేసే ప్రతి ఎంపీకి ముందే మడత పెట్టిన బ్యాలెట్ పేపర్ ఇచ్చేలా చూడాలని సూచించారు. తనకు అధికారులు మడత పెట్టకుండానే బ్యాలెట్ ఇచ్చారని తెలిపారు. పోలింగ్ ప్రారంభమైన తొలి మూడు గంటల్లోనే 70 శాతానికి పైగా ఎంపీలు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరి మరీ ఓటు వేశారు.

క్రాస్ ఓటింగ్

వెంకయ్యకు మద్దతునిస్తున్న పార్టీల బలాబలాలు కేవలం 505కే పరిమితం అయినప్పటికీ ఆయనకు 516 ఓట్లు రావడం గమనార్హం. ఓటు వేయని 14 మందిలో ఇద్దరు మాత్రమే బీజేపీ సభ్యులు. మిగతా 12 మంది యూపీఏ కూటమి సభ్యులే. ఎన్‌డీఏ ఎంపీలందరి ఓట్లు వెంకయ్యకు పడటంతో పాటు అదనంగా సుమారు 20 ఓట్లు క్రాస్ అయినట్లు అర్థం అవుతుంది. కాంగ్రెస్ మాత్రం రాష్ట్రపతి ఎన్నికల్లో తమ అభ్యర్థి మీరాకుమార్ కన్నా ఉప రాష్ట్రపతి అభ్యర్థి గోపాలకృష్ణ గాంధీకి ఎక్కువ ఓట్లు పోలయ్యాయని లెక్కలు చెబుతోంది. గోపాలకృష్ణ గాంధీకి ఉభయ సభల్లో 244 ఓట్లు వచ్చాయని, మీరాకుమార్ కన్నా 19 ఓట్లు పెరిగాయని పేర్కొంది. నిజానికి కొత్తగా మద్దతు పలికిన జేడీయూ, బీజేడీలకు 40 ఓట్లు ఉన్నా గాంధీకి కేవలం 19 ఓట్లు పెరగడం తగ్గడం కిందే లెక్క అంటున్నారు.

30 ఏళ్లలో అత్యధిక మెజారిటీ

ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో గత 30 ఏళ్లలో అత్యధిక మెజారిటీ సాధించి(272) వెంకయ్యనాయుడు రికార్డు నెలకొల్పారు. ఈ 30 ఏళ్లలో ఎవరికీ దక్కనన్ని ఓట్లు వెంకయ్యకు దక్కాయి. గతంలో షెకావత్ పోటీ చేసినపుడు అత్యధికంగా 759 ఓట్లు పోల్ కాగా, ఇప్పుడు ఆ రికార్డు కూడా బద్దలైంది. 771 ఓట్లు నమోదయ్యాయి. 1997 ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో కృష్ణకాంత్‌కు 168 ఓట్ల మెజారిటీ రాగా, షెకావత్‌కు 149 ఓట్ల మెజారిటీ వచ్చింది. ఆ తరువాత హమీద్ అన్సారీకి వరుసగా 233, 252 ఓట్ల మెజారిటీ వచ్చింది. రాష్ట్రపతి ఎన్నికల్లో మొత్తం 768 మంది ఎంపీలు ఓటేయగా, ఎన్‌డీఏ అభ్యర్థి రామ్‌నాథ్ కోవింద్‌కు 522 ఓట్లు వచ్చాయి. కోవింద్‌కు మద్దతు పలికిన జేడీయూ, బీజేడీలు(40 సీట్లు) ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో యూపీఏ అభ్యర్థి గోపాలకృష్ణ గాంధీకి మద్దతు తెలిపాయి. అయినా వెంకయ్యనాయుడికి 516 ఓట్లు రావడం గమనార్హం. వెంకయ్యకు 67 శాతం ఓట్లు నమోదయ్యాయి.



వెంకయ్య దంపతుల ఆనందహేల

రేపు వెంకన్న దర్శనానికి వెంకయ్య

న్యూఢిల్లీ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వెంకయ్యనాయుడు సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు. ఆదివారం కర్ణాటక బీజేపీ నేతల ఆత్మీయ సమావేశంలో పాల్గొని.. రాత్రికి తిరుమలకు చేరుకుంటారు. సోమవారం మధ్యాహ్నం నెల్లూరుకు వెళ్లి బంధువులు, ఆత్మీయులతో గడపనున్నారు. మంగళవారం మళ్లీ ఢిల్లీకి చేరుకుంటారు. వెంకయ్య ప్రధాని వద్ద ఉన్నపుడే ఏలూరు ఎంపీ మాగంటి బాబు తనతో వచ్చిన ఏలూరు ఎమ్మెల్యే బడేటి బుజ్జిని ప్రధానికి పరిచయం చేశారు. బడేటి బుజ్జి తన కూతురు వివాహానికి రావాల్సిందిగా ప్రధానికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ బడేటి బుజ్జి దివంగత నటుడు ఎస్వీ రంగారావు మనవడని తెలిపారు. తానూ ఎస్వీ రంగారావులా ఉంటానని స్నేహితులు అనేవారని వెంకయ్య తెలిపారు.





వెంకయ్యకు మిఠాయి తినిపిస్తున్న మోదీ

వేచి ఉన్న ప్రధాని

ఉదయం 10 గంటలకు పోలింగ్ ప్రారంభం కావడానికి ఐదు నిమిషాల ముందే ప్రధాని నరేంద్ర మోదీ పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. పోలింగ్ జరిగే 62వ నంబరు గదికి మోదీ వెళ్లినప్పుడు పోలింగ్‌కు ఇంకా సమయం ఉండటంతో ఆయనను లోపలికి అనుమతించలేదు. దీంతో కొద్దిసేపు అక్కడే ఉండి తనతో ఉన్న ఎంపీలందరికీ జాగ్రత్తగా ఓటేయాలని సూచించారు. ఎంపీల ఓట్లు చెల్లకపోతే తప్పుడు సందేశం వెళ్తుందని హెచ్చరించారు. మోదీతో పాటు వెంకయ్యనాయుడు కూడా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. తరువాత మోదీ గదికి వెళ్లి ఆయనతో సుమారు 40 నిమిషాల పాటు వెంకయ్య గడిపారు. ఓటింగ్ సరళిపై, ఆసుపత్రుల పాలైన ఎంపీలను ఢిల్లీకి తీసుకురావడంపై చర్చ జరిగింది. వెంకయ్య తరపున ఏజెంట్లుగా ఉన్న భూపేంద్ర యాదవ్‌ను ప్రధాని మోదీ తన గదికి పిలిపించి ఎన్‌డీఏతో పాటు బయటి నుంచి

అంకితభావంతో పని చేస్తారు: మోదీ

న్యూఢిల్లీ, ఆగస్టు 5: దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు వెంకయ్యనాయుడు అంకిత భావం, శ్రద్ధతో పనిచేస్తారని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఉపరాష్ట్రపతిగా ఓ రైతు బిడ్డ విజయం దేశాభివృద్ధికి కృషి చేస్తున్న ప్రతి ఒక్క రైతు విజయంగా భావిస్తున్నానని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా అన్నారు. రాజ్యసభ చైర్మన్‌గా వెంకయ్య తగిన వ్యక్తి అని శరద్ యాదవ్ అన్నారు. కేంద్రమంత్రులు స్మృతి ఇరానీ, జితేంద్ర సింగ్, జేపీ నడ్డా వెంకయ్యను అభినందించారు. పాలక బీజేపీ సిద్ధాంతాలతో ప్రతిపక్షం రాజీ పడబోదనే విషయాన్ని ఈ ఎన్నికలతో మరోసారి స్పష్టం చేశామని గులాం నబీ ఆజాద్ అన్నారు. రాజ్యసభ సజావుగా నడిచేందుకు సహకరిస్తామని కాంగ్రెస్ అధినేత్రి సోనియా హామీనిచ్చారు. వెంకయ్య ఏ పదవికైనా వన్నె తెస్తారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్, బీజేఎల్పీ నేత కిషన్‌రెడ్డి అన్నారు. వెంకయ్యను టీడీపీ-టీఎస్ అధ్యక్షుడు ఎల్.రమణ అభినందించారు.

ప్రత్యేక విమానంలో దేవేందర్‌గౌడ్

న్యూఢిల్లీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణంగా హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న తెలుగుదేశం రాజ్యసభ సభ్యుడు దేవేందర్‌గౌడ్ ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేయడానికి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వచ్చారు. ఆసుపత్రి నుంచే నేరుగా విమానాశ్రయానికి వచ్చి చార్టెడ్ విమానంలో తన కుమారుడు వీరేంద్రగౌడ్‌తో కలిసి ఢిల్లీకి వచ్చారు. మధ్యాహ్నం మూడు గంటల తరువాత ఓటేసిన దేవేందర్‌గౌడ్ వెంకయ్యనాయుడికి ఓటు వేయడానికే ప్రత్యేక విమానంలో వచ్చినట్లు తెలిపారు. సభకు అస్సలు రారని అపప్రధ మూటగట్టుకున్న రాజ్యసభ సభ్యులు సచిన్ టెండూల్కర్, రేఖలు కూడా వచ్చి ఓటేశారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో 14 మంది ఎంపీలు తమ ఓటు హక్కును వినియోగించుకోలేదు. వీరిలో బీజేపీ ఎంపీలు విజయ్ గోయల్, సన్‌వర్‌లాల్ జాట్‌లున్నారు. వీరు అనారోగ్యంతో హాస్పిటల్‌లో ఉన్నారు. కాంగ్రెస్‌కు చెందిన శ్రీమతి మౌసమ్ నూర్, శ్రీమతి రాణీ నారా కూడా ఓటేయలేదు.

ఇది బ్యాలెట్ విజయం: గోపాలకృష్ణ గాంధీ

"ఉపరాష్ట్రపతిగా విజయం సాధించి కొత్త ఆఫీసులోకి అడుగు పెడుతున్న వెంకయ్యనాయుడుకు నా అభినందనలు. ఇది బ్యాలెట్ విజయం. ప్రజాస్వామ్యం గెలిచింది" అని మహాత్మా గాంధీ మనుమడు గోపాల కృష్ణ గాంధీ అన్నారు. తనకు ఓటేసిన ప్రతిపక్ష సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. వెంకయ్యతో తనకు వ్యక్తిగత ద్వేషం లేదని, ఆయనతో సైద్ధాంతిక పోరాటమే చేశానని, ఈ పోరాటాన్ని కొనసాగిస్తానన్నారు.

ఉద్దండుడు.. నెల్లూరు నాయుడు!

అప్రతిహతం వెంకయ్య ప్రస్థానం

న్యూఢిల్లీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నాయుడు.. ముప్పవరపు వెంకయ్య నాయుడుకు ఢిల్లీలోని ఆయన సన్నిహిత వర్గాలు ప్రేమగా పెట్టుకున్న పేరు. సొంత పార్టీ వారే కాదు విపక్షాలు సైతం ఉద్దండుడిగా కొనియాడే ఆయన దేశంలో రెండో అత్యున్నత రాజ్యాంగ పదవిని అధిష్ఠించనున్నారు. యతి, ప్రాసల ప్రసంగంతో అందర్నీ మంత్ర ముగ్ధుల్ని చేసే వెంకయ్య తెలుగు ప్రజలకు దేశరాజధానిలో పెద్ద దిక్కు. సంఘ్ విద్యార్థిగా మొగ్గ తొడిగిన ఆయన ప్రస్థానం అప్రతిహతంగా వెలుగొందింది. వాజ్‌పేయి బహిరంగ సభకు రావాలంటూ ఊరూరా తిరిగి మైకులో ప్రకటనలు చేసిన వ్యక్తి.. పోస్టర్లను గోడలకు అంటించిన వ్యక్తి నేడు ఉపరాష్ట్రపతి స్థాయికి ఎదిగారంటే దీక్ష, నిబద్ధతలే కారణం. ఎమ్మెల్యే నుంచి కేంద్రమంత్రిగా.. బీజేపీ కార్యకర్త నుంచి జాతీయ అధ్యక్షుడిగా అలకరించని పదవి లేదు. రాజ్యసభ ఎంపీగా ఉన్న వ్యక్తి అదే సభకు చైర్మన్ కావడం ఇదే ప్రథమం. వెంకటాచలం మండలం చవటపాలెంలో 1949 జూలై 1న వెంకయ్య జన్మించారు. నెల్లూరు వీఆర్ హైస్కూలులో చదివారు. వీఆర్ కాలేజీలో పొలిటికల్ సైన్స్‌లో డిగ్రీ ఉత్తీర్ణులయ్యారు. విశాఖ ఏయూలో న్యాయశాస్త్రాన్ని అభ్యసించారు.

జన్మభూమి రుణం తీర్చుకున్న వెంకయ్య

- పుట్టి, పెరిగిన పల్లెలకు పట్టణ రూపు
- సింహపురిపైనా ఎనలేని మమకారం

నెల్లూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): దేశానికి రాజైనా.. తల్లికి బిడ్డే అన్న నానుడిని వెంకయ్యనాయుడు అక్షర సత్యమని నిరూపించారు. తల్లిలాంటి పుట్టిన ఊరు రుణం తీర్చుకోవడానికి అధిక ప్రాధాన్యమిచ్చేవారు. ఆయన పుట్టిన చవటపాలెం.. పెరిగిన శ్రీరామపురం పల్లెలు పట్టణాల రూపును సంతరించుకున్నాయి. నెల్లూరు జిల్లాపైనా వెంకయ్యకు ఎనలేని మమకారం. ఆయన రాజకీయ ప్రస్థానం జిల్లాలోని ఉదయగిరి నుంచి ప్రారంభమైంది. సింహపురి అభివృద్ధికి వెంకయ్య ఎనలేని కృషి చేశారు. 1978లో వెంకయ్య ఉదయగిరి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ఆ రోజుల్లో ఆయన ప్రచార ఖర్చు మొత్తం ప్రజలే చందాలు వేసుకొని భరించారు. 1983లో టీడీపీ ప్రభంజనంలో కూడా వెంకయ్యని రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించారు. కేంద్ర మంత్రిగా జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. రూ.1100 కోట్ల హడ్కో రుణంతో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పథకాలు, అమృత్ పథకం, రేడియో స్టేషన్, పాస్‌పోర్టు సేవా కేంద్రం, కామధేను ప్రాజెక్టు, ఎన్ఐవోటీ రీసెర్చ్ కేంద్రం నెల్లూరు నెక్స్ వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గ్రామీణ వికాసం ప్రధాన లక్ష్యంగా 'స్వర్ణ భారత్ ట్రస్ట్'ను 2001 లో స్థాపించారు. కాగా, ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్య నాయుడుకు బెంగళూరులో తొలి సత్కారం జరుగనుంది.

మీ ఆధార్ డేటా సురక్షితం

తాళం వేయండి.. అవసరమైతే తెరవండి.. లాక్, అన్‌లాక్ ప్రక్రియ సులభమైనదే.. యూఐడీఏఐ వెబ్‌సైట్‌లో సదుపాయం

న్యూఢిల్లీ, ఆగస్టు 5: ప్రజల ఆధార్ డేటాకు భద్రత ఉందా? ఆ సమాచారం గోప్యంగానే ఉంటోందా?- ఇవి కొన్నాళ్లుగా అందర్నీ తొలిచేస్తున్న ప్రశ్నలు! ఈ ఆందోళనకు కారణం.. గుట్టుగా ఉండాల్సిన ఆధార్ వివరాలు బట్టయలవుతున్నట్లు వస్తున్న వార్తలే. కొన్నాళ్ల కిందట ప్రముఖ క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీ కుటుంబ సభ్యుల 'ఆధార్' సమాచారం లీకవడం ఒక ఉదాహరణ. ఆ మాటకొస్తే దేశంలో 13 కోట్ల మంది ఆధార్ డేటా చోరీకి గురవడమో.. లీకవడమో జరిగిందని సెంటర్ ఫర్ ఇంటర్నెట్ సొసైటీ అధ్యయనంలో తేలింది. ప్రజల ఆధార్ సమాచారం లీక్ అయిందని స్వయంగా కేంద్రమే సుప్రీం కోర్టులో అంగీకరించింది. ఆధార్ డేటాను చట్ట విరుద్ధంగా ఉపయోగిస్తున్న ఖరగ్‌పూర్ ఐఐటీ పూర్వ విద్యార్థి అభినవ్ శ్రీవాత్సవ్‌ను కర్ణాటక పోలీసులు అరెస్టు ఘటనతో 'డేటా భద్రత'పై అనుమానాలు పెరిగాయి. ఆ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజినీర్ ఉపయోగించిన తన 'ఈ-కేవైసీ యాప్' మొన్నటి దాకా గూగుల్ ప్లే స్టోర్‌లో ఉండడం విశేషం.



అయితే ప్రజలు తమ ఆధార్ డేటాను భద్రంగా ఉంచుకునే మార్గం ఉందని ఆధార్ సంస్థ- యూఐడీఏఐ అంటోంది. బయోమెట్రిక్, ఐరిస్‌తో కూడిన ఈ డేటాను లాక్ చేసుకుని, అవసరమైనప్పుడు అన్‌లాక్ చేసుకోవచ్చని చెబుతోంది. ఇంటర్నెట్ కనెక్షన్, అవగాహన ఉంటే ఈ ప్రక్రియ సులభమైనదే. అదెలాగో చూడండి..


- యూఐడీఏఐ వెబ్‌సైట్‌లో 'ఆధార్ సర్వీసెస్' విభాగంలో ఉండే 'లాక్/అన్‌లాక్ బయోమెట్రిక్స్'ను క్లిక్ చేయాలి.
- కొత్తగా తెరుచుకునే పేజీలో నిర్దేశించిన బాక్సుల్లో మీ ఆధార్ నంబర్‌ను, సెక్యూరిటీ కోడ్‌ను టైప్ చేయాలి.
- వన్ టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ) వస్తుంది. దీన్నీ, మరో సెక్యూరిటీ కోడ్‌ను సూచించిన చోట ఎంటర్ చేయాలి.
- ఇలా చేయగానే ఆధార్‌తో అనుసంధానమైన మీ వేలిముద్రలు, ఐరిస్ వేరెవరూ చూడలేకుండా 'లాక్' అవుతాయి.
- ఎవరైనా మీ ఆధార్ డేటాను యాక్సెస్ చేయడానికి ప్రయత్నిస్తే.. వెబ్‌పేజీపై 'ఎర్రర్ కోడ్ 303' అని కనిపిస్తుంది.
- ఇలా కనిపించిందంటే లాక్ అయి ఉన్నట్టు అర్థం. దీని వల్ల బ్యాంకులు, జియో వంటి మొబైల్ ఆపరేటర్లు, ఇతర సంస్థలు వ్యక్తుల ఆధార్ డేటాను తనిఖీ చేసే అవకాశం ఉండదు.
- ఎప్పుడైనా అవసరం వచ్చి.. ఏదైనా సంస్థకు ఆధార్ డేటాను తనిఖీ చేసే అనుమతి ఇవ్వాలనుకుంటే.. 'అన్‌లాక్' చేయొచ్చు. దీనికి 'లాక్' చేసినప్పటి ప్రక్రియనే అనుసరించాలి.

ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో చాలా సేవలు ఆధార్ ఆధారంగానే అందుతున్నందున తరచూ లాక్, అన్‌లాక్ చేయవలసి రావచ్చు. కానీ, ఈ సౌకర్యం ఆధార్ కార్డుదారులకు తమ సమాచారం సురక్షితంగా ఉందనే భరోసా మాత్రం ఇస్తుంది.

ఆధార్‌పై ఉచిత గ్యాస్ కనెక్షన్.. సెప్టెంబర్ వరకు గడువు

న్యూఢిల్లీ, ఆగస్టు 5: ఆధార్‌పై ఉచిత గ్యాస్ కనెక్షన్ పొందాలనుకునే నిరుపేద మహిళలకు గడువును సెప్టెంబర్ ఆఖరి వరకు పెంచారు. ఆ లోగా 12 అంకెల ఆధార్‌ను తప్పనిసరిగా పొందాల్సి ఉంటుంది. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్ పొందాలనుకుని, ఆధార్ లేని వారి కోసం కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ మే 31 వరకు గడువు ఇచ్చింది. దీనిని సెప్టెంబర్ 30 వరకు పొడిగించాలని నిర్ణయించారు. ఎల్పీజీ సబ్సిడీలు పొందాలనుకునేవారికి ఆధార్‌ను తప్పనిసరి చేస్తూ నిరుడు అక్టోబర్‌లో కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఉచిత గ్యాస్ కనెక్షన్లు పొందాలనుకునే మహిళలకూ ఆధార్‌ను తప్పనిసరి చేశారు.

ఔరా.. ఫరా!



- బ్రిటిష్ దిగ్గజ అథ్లెట్‌కు 10వేల మీటర్ల స్వర్ణం
- కెరీర్‌లో పదో వరల్డ్ టైటిల్
- వరుసగా మూడోసారి అగ్రస్థానం
- ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్

లండన్: బ్రిటిష్ దిగ్గజ అథ్లెట్ మో ఫరా వరుసగా పదో ప్రపంచ టైటిల్ గెలిచాడు. ఇక్కడ శుక్రవారం ప్రారంభమైన వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో పురుషుల 10వేల మీటర్ల స్వర్ణం సాధించాడు. 26 నిమిషాల 49.51 సెకన్లతో అతడు అగ్రస్థానంలో నిలిచాడు. ఉగాండాకు చెందిన జోషువా చెప్టెగి (26ని.49.94సె) రజతం, కెన్యాకు చెందిన పాల్ కిప్‌న్గెటిచ్ తనూయ్ (26ని 50.60సె) కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. ఇదే లండన్ స్టేడియంలో అయిదేళ్ల కిందట.. 2012 ఒలింపిక్స్‌లో కూడా ఫరా పసిడి పతకం చేజిక్కించుకోవడం విశేషం. గత రెండు ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్ (2013 మాస్కో, 2015 బీజింగ్)లో డబుల్ (10వేలు, 5 వేల మీటర్ల) సాధించిన ఫరా.. ఈసారీ ఆ ఫీట్‌పై కన్నేశాడు. బుధవారం జరిగే 5వేల మీటర్లలోనూ తలపడనున్నాడు. ప్రపంచ చాంపియన్‌షిప్స్ చరిత్రలో ఫరా నేటి టైమింగ్ రెండో అత్యుత్తమం కావడం గమనార్హం. ఇక ఏకంగా ఏడుగురు అథ్లెట్లు 27 నిమిషాల సమయంలోపే పరుగును పూర్తి చేయడం ఇది తొలిసారి కావడం మరో విశేషం. 34 ఏళ్ల బ్రిటిష్ రన్నర్ ఫరాకు ఈసారి తీవ్ర పోటీ ఎదురైంది. పలుమార్లు అథ్లెట్ల మధ్య ఆధిక్యం మారుతూ వచ్చింది. 'ఇది నిజంగా క్లిష్టమైన రేస్' అని పోటీ అనంతరం ఫరా అంగీకరించాడు.




9.98 సెకన్లతో తుదిపోరుకు..

- వంద మీటర్ల ఫైనల్లో బోల్ట్
- సెమీస్‌లో ఉసేన్‌కు రెండో స్థానం

లండన్: జమైకా చిరుత.. ఉసేన్ బోల్ట్ తన ఆఖరాటలో అతి కష్టమ్మీద ఫైనల్‌కు చేరాడు. శనివారం రాత్రి జరిగిన సెమీస్‌లో బోల్ట్ 9.98 సెకన్ల టైమింగ్‌తో రెండో స్థానంలో నిలిచాడు. అమెరికా రన్నర్ కోల్‌మన్ 9.97 సెకన్లతో అగ్రస్థానం సాధించాడు. మూడో సెమీస్ రేసులో పోటీ పడ్డ ఉసేన్ తొలుత కాస్త నెమ్మదిగా పరుగెత్తినా.. మధ్యలో వేగం పుంజుకున్నాడు. ఫినిష్‌లైన్ వద్ద అతణ్ని అందుకున్నాడు. కాగా, శుక్రవారం జరిగిన హీట్స్‌లోనూ బోల్ట్ ఆశించిన ప్రదర్శన చేయలేకపోయాడు. సగం వరకూ ఐదో స్థానంలో నిలిచిన బోల్ట్ చివర్లో పుంజుకొని 10.07 సెకన్ల టైమింగ్‌తో సెమీస్‌కు అర్హత సాధించాడు. ఆదివారం తెల్లవారుజామున పురుషుల 100 మీటర్ల ఫైనల్ జరగనుంది.

నిరాశ పరిచిన ద్యూతీ

- అనాస్, స్వప్న కూడా విఫలం



ద్యూతీ

ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌ను భారత్ నిరాశాజనకంగా ప్రారంభించింది. స్టార్ స్ప్రింటర్ ద్యూతీ చంద్ సహా, మహ్మద్ అనాస్, స్వప్న బర్మన్ తమ విభాగాల్లో వ్యక్తిగత అత్యుత్తమాలను కూడా అందుకోలేకపోయారు. పోటీల రెండోరోజు, శనివారం జరిగిన మహిళల 100 మీటర్ల తొలిరౌండ్ ఐదో హీట్‌లో బరిలో దిగిన ద్యూతీ 12.07 సెకన్ల టైమింగ్‌తో ఆరో స్థానంలో నిలిచింది. ద్యూతీ సీజన్ బెస్ట్ 11.30 సెకన్లకు ఈ టైమింగ్ దరిదాపుల్లో లేకపోవడం గమనార్హం. మొత్తంగా తొలిరౌండ్‌లో 47 మంది అథ్లెట్లు తలపడగా ద్యూతీ 38వ స్థానంలో నిలిచింది.


అనాస్‌దీ అదే తీరు: పురుషుల 400 మీటర్ల పరుగు తొలిరౌండ్‌లో అనాస్.. ఆఖరి, ఆరో హీట్‌లో తలపడ్డాడు. 45.98 సెకన్లతో హీట్‌లో నాలుగో స్థానంలో నిలిచాడు. మొత్తం 52 మంది అథ్లెట్లలో 33వ స్థానం పొందాడు.

27వ స్థానంలో స్వప్న: మహిళల హెప్టాథ్లాన్ తొలి అంశం 100 మీటర్ల హర్డిల్స్‌లో 31 మంది తలపడగా స్వప్న బర్మన్ 14.14 సెకన్లతో 27వ స్థానం సాధించింది. అనంతరం.. తన ప్రధాన ఆయుధం హైజంప్‌లో ఆమె అంచనాలు అందుకోలేకపోయింది. భువనేశ్వర్ ఆసియా చాంపియన్‌షిప్స్‌లో 1.87 మీటర్లతో సీజన్, వ్యక్తిగత అత్యుత్తమం నమోదు చేసిన స్వప్న.. ఇక్కడ మాత్రం 1.71 మీటర్ల జంప్‌తో నిరాశపర్చింది.

నిలిచి.. గెలిచాడు

విజేందర్ సింగ్.. ప్రొఫెషనల్‌గా అజేయంగా దూసుకెళ్తున్నాడు. చైనా గోడను బద్దలుకొట్టి.. కెరీర్‌లో వరుసగా తొమ్మిదో విజయం సాధించాడు. ఉత్కంఠభరితంగా జరిగిన డబుల్ టైటిల్ పోరులో చైనా బాక్సర్ జుల్పికర్‌పై విజయంతో అజేయ రికార్డును పదిలంగా ఉంచుకున్నాడు. డబ్ల్యూబీఓ ఆసియా పసిఫిక్ సూపర్ మిడిల్ వెయిట్ టైటిల్‌ను నిలబెట్టుకోవడంతోపాటు.. జుల్పికర్ డబ్ల్యూబీఓ ఓరియంటల్ సూపర్ మిడిల్‌వెయిట్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. చైనా బాక్సర్ చీటింగ్ చేయాలని చూసినా.. కడదాకా నిలిచి.. గెలిచాడు. శాంతి కావాలనే సందేశాన్ని పంపాడు.

- జుల్పికర్‌పై విజేందర్ గెలుపు
- అజేయంగా తొమ్మిదో విజయం
- కెరీర్‌లో రెండో టైటిల్



ముంబై: ప్రొఫెషనల్‌గా స్టార్ బాక్సర్ విజేందర్ సింగ్ అజేయంగా తొమ్మిదో విజయం సాధించాడు. శనివారమిక్కడ హోరాహోరీగా జరిగిన బౌట్‌లో చైనా బాక్సర్ జుల్పికర్ మైమైటియాలిపై గెలుపుతో విజేందర్ డబ్ల్యూబీఓ ఆసియా పసిఫిక్ సూపర్ మిడిల్ వెయిట్ టైటిల్‌ను నిలబెట్టుకున్నాడు. ఈ గెలుపుతో జుల్పికర్ డబ్ల్యూబీఓ ఓరియంటల్ సూపర్ మిడిల్‌వెయిట్ టైటిల్ కూడా మన బాక్సర్ సొంతమైంది. ఇది విజేందర్‌కు రెండో టైటిల్. ఇండో-చైనా బోర్డర్ ఉద్రిక్తతల నేపథ్యంలో బౌట్‌కు మంచి ప్రాచుర్యం లభించింది. చైనా బాక్సర్‌పై విజేందర్ కసిగా పంచ్‌ల వర్షం కురిపిస్తుంటే.. సంబరాలు చేసుకోవాలని ప్రతి భారతీయుడూ హర్షించాడు. కానీ విజేందర్ (32) కంటే 9 ఏళ్లు చిన్నవాడైన జుల్పికర్.. రింగ్‌లో మాత్రం గట్టిపోటీ ఇచ్చాడు. 10 రౌండ్ల పోరులో సింగ్ కంటే మెరుగైన ప్రదర్శన చేసినట్టు కనిపించినా.. ఫౌల్స్ కారణంగా మూల్యం చెల్లించుకున్నాడు. దీంతో 96-93, 95-94, 95-94తో జడ్జీలు విజేందర్‌ను ఏకగ్రీవంగా విజేతగా ప్రకటించారు. 10 రౌండ్ల హోరాహోరీ బౌట్‌లో భారత బాక్సర్ అనుభవం ఎంతో ఉపయోగపడింది. మ్యాచ్‌కు ముందు చైనా ఉత్పత్తులు ఎక్కువ కాలం మనలేవని విజేందర్ వ్యాఖ్యానించాడు. కానీ చైనా బాక్సర్ ప్రదర్శనకు విజేందర్ సైతం అవాక్కయ్యాడు. ఇలాంటి ప్రతిఘటన ఊహించలేదన్నాడు. విజేందర్.. కచ్చితమైన స్ట్రయిట్ పంచ్‌లు విసిరాడు. మరోవైపు జుల్పికర్ పంచ్‌లు తేలిపోయాయి. విజేందర్ బెల్ట్ కింద కొట్టడానికి ప్రయత్నించి నష్టపోయాడు. అభిమానులు కూడా చీటింగ్ అంటూ గోల చేశారు. నిబంధనలు ఉల్లంఘించి ఐదుసార్లు ఫౌల్స్ చేశాడు.

విజయంతో అఖిల్: భారత ఒలింపిక్ బాక్సర్ అఖిల్ కుమార్.. ప్రొఫెషనల్ కెరీర్‌ను గ్రాండ్‌గా ఆరంభించాడు. అరంగేట్రం మ్యాచ్‌లో టై గిల్‌క్రిస్ట్ (ఆస్ట్రేలియా) ను టెక్నికల్ నాకౌట్ చేశాడు.

శాంతిని నెలకొల్పండి

ఇండో-చైనా బోర్డర్‌లో ఉద్రిక్తతను తగ్గించి.. శాంతిని నెలకొల్పండి. జుల్పికర్ ఓడిన డబ్ల్యూబీఓ ఓరియంటల్ సూపర్ మిడిల్ వెయిట్ టైటిల్ బెల్ట్‌ను అతడికే తిరిగి ఇచ్చేయాలని అనుకుంటున్నా. చైనా ఉత్పత్తులు ఎక్కువ కాలం నిలబడవనుకున్నా. కానీ జుల్పికర్ పోరాడిన తీరు ఆశ్చర్యపరిచింది. 5-6 రౌండ్లలో పోరు ముగుస్తుందనుకున్నా. నా వ్యూహానికి తగ్గట్టు ఆడలేదు. బెల్ట్ కింద తగలడంతో ఇబ్బంది పడ్డా..!

- విజేందర్ సింగ్

2 టెస్టుల్లో వేగంగా 150 వికెట్ల మైలురాయి చేరుకున్న భారత రెండో బౌలర్ జడేజా. అశ్విన్ 29 టెస్టుల్లో ఈ ఘనత సాధించగా.. జడ్డూ 32 మ్యాచ్‌లు తీసుకున్నాడు. ఇక అత్యల్ప మ్యాచ్‌ల్లో ఈ మార్కు చేరిన తొలి లెఫ్టార్మ్ బౌలర్ జడేజానే.

పడిలేచారు..

ఒక్క సెషన్‌లోనే ఎనిమిది వికెట్లు.. లంచ్‌లోపే తొలి ఇన్నింగ్స్ ఖతం..! ఇంకేముంది భారత్‌కు ఇన్నింగ్స్ విజయం లాంఛనమే..! మూడో రోజే మ్యాచ్ ముగియడం ఖాయమే..! సిరీస్ హస్తగతం అయినట్టే అనుకున్నాం..!

కానీ.. ఫాలోఆన్‌లో లంక అద్భుత పోరాటం చేస్తోంది. కుశాల్ మెండిస్ వీరోచిత శతకం, దిముత్ కరుణరత్నె అద్భుత పోరాటంతో పడి లేచిన కెరటంలా భారత్‌కు సవాల్ విసురుతోంది..! దాదాపు రెండు సెషన్ల పాటు ఈ ఇద్దరూ ఎదురొడ్డి నిలవడంతో కొలంబో టెస్టు ఆసక్తికర మలుపు తిరిగింది..! అయినా.. ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవడానికి లంక ఇంకా 230 పరుగుల దూరంలోనే ఉంది..!


కుశాల్ మెండిస్ (110)

- ఫాలోఆన్‌లో పోరాడుతున్న లంక
- తొలి ఇన్నింగ్స్ 183 ఆలౌట్
- రెండో ఇన్నింగ్స్ 209/2
- రాణించిన మెండిస్, కరుణరత్నె
- అశ్విన్‌కు ఐదు వికెట్లు

కొలంబో: తొలి రెండ్రోజులూ భారత్ హవా నడిచిన కొలంబో టెస్టులో మూడో రోజు శ్రీలంక నుంచి అనూహ్య ప్రతిఘటన ఎదురైంది. తొలి ఇన్నింగ్స్‌లో 189 పరుగులకే కుప్పకూలి ఫాలోఆన్‌లో పడిన లంక.. రెండో ఇన్నింగ్స్‌లో పట్టుదలతో పోరాడుతోంది. కుశాల్ మెండిస్ (135 బంతుల్లో 17 ఫోర్లతో 110) మెరుపు సెంచరీకి కరుణరత్నె (200 బంతుల్లో 12 ఫోర్లతో 92 బ్యాటింగ్) అజేయ ఇన్నింగ్స్ తోడవడంతో మూడో రోజైన శనివారం ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్ (ఫాలోఆన్)లో 209/2 స్కోరుతో నిలిచింది. కుశాల్, దిముత్ రెండో వికెట్‌కు 191 పరుగులు జోడించారు. ప్రస్తుతం కరుణరత్నెతో పాటు నైట్ వాచ్‌మన్ మలింద పుష్పకుమార (2 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. మరో రెండ్రోజుల ఆట మిగిలున్న ఈ మ్యాచ్‌లో భారత్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఆతిథ్య జట్టు ఇంకా 230 పరుగుల దూరంలో నిలిచింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 50/2తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన లంక మరో 133 పరుగులు మాత్రమే జోడించి 49.4 ఓవర్లలో 183 రన్స్‌కే కుప్పకూలింది. దాంతో, భారత్‌కు రికార్డు స్థాయిలో 439 పరుగుల ఆధిక్యాన్ని సమర్పించుకుంది. అశ్విన్ (5/69) కెరీర్‌లో 26వ సారి ఐదు వికెట్ల ప్రదర్శన నమోదు చేయగా.. జడేజా, షమి రెండేసి వికెట్లు తీశారు.

లంచ్‌లోపే ఢమాల్: రెండో రోజే ఓపెనర్లను కోల్పోయిన లంక శనివారం లంచ్‌లోపే ఒకసారి చాప చుట్టేసింది. ఆట మొదలైన ఐదో ఓవర్లోనే కెప్టెన్ చాందిమల్ (10)ను జడేజా అవుట్ చేశాడు. తర్వాతి ఓవర్లోనే మెండిస్ (24)ను ఉమేష్ వెనక్కిపంపి లంకకు షాకిచ్చాడు. ఈ దశలో మాథ్యూస్ (26)తో నిరోషన్ డిక్‌వెలా (51) పర్యాటక బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. అయితే అశ్విన్ బౌలింగ్‌లో లెగ్ స్లిప్‌లో పుజారా పట్టిన కళ్లు చెదిరే క్యాచ్‌కు మాథ్యూస్ వెనుదిరగగా, డిసిల్వా (0)ను జడ్డూ గోల్డెన్ డకౌట్ చేశాడు. ఇక, డిక్‌వెలాతో పాటు హెరాత్ (2)లను షమి ఒకే ఓవర్లో అవుట్ చేయడంతో లంక ఇన్నింగ్స్ ముగిసేందుకు ఎంతోసేపు పట్టలేదు.

ఎదురు నిలిచారు..: లంచ్ తర్వాత లంక రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టగా.. మూడో ఓవర్లోనే ఓపెనర్ ఉపుల్ తరంగ (2)ను ఉమేష్ బౌల్డ్ చేశాడు. ఇక, ఒక పరుగు వద్ద ఉన్నప్పుడు అశ్విన్ బౌలింగ్‌లో కుశాల్ మెండిస్ ఇచ్చిన క్యాచ్‌ను మిడాన్‌లో ధవన్ వదిలేశాడు. దీనికి భారత్ భారీ మూల్యమే చెల్లించుకుంది. అద్భుతమైన డిఫెన్స్‌తో కరుణరత్నె సహకారం అందించగా.. కుశాల్ ఎదురుదాడికి దిగాడు. స్పిన్ బౌలింగ్‌లో స్వీప్‌షాట్లతో అలవోకగా బౌండ్రీ రాబడుతూ 120 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఎట్టకేలకు సెషన్ చివర్లో పాండ్యా బౌలింగ్‌లో సాహా పట్టిన క్యాచ్‌కు అతను వెనుదిరిగాడు.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 622/9 డిక్లేర్డ్;

శ్రీలంక తొలి ఇన్నింగ్స్: కరుణరత్నె (సి) రహానె (బి) అశ్విన్ 25, తరంగ (సి) రాహుల్ (బి) అశ్విన్ 0, మెండిస్ (సి) కోహ్లి (బి) ఉమేష్ 24, చాందిమల్ (సి) పాండ్యా (బి) జడేజా 10, మాథ్యూస్ (సి) పుజారా (బి) అశ్విన్ 26, డిక్‌వెలా (బి) షమి 51, డిసిల్వ (బి) జడేజా 0, పెరీర (బి) అశ్విన్ 25, హెరాత్ (బి) షమి 2, పుష్పకుమార (నాటౌట్) 15, ప్రదీప్ (బి) అశ్విన్ 0; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 49.4 ఓవర్లలో 183 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-0, 2-33, 3-60, 4-64, 5-117, 6-122, 7-150, 8-152, 9-171; **బౌలింగ్:** షమి 6-1-13-2, అశ్విన్ 16.4-3-69-5, జడేజా 22-6-84-2, ఉమేష్ 5-1-12-1.

శ్రీలంక రెండో ఇన్నింగ్స్ (ఫాలోఆన్): కరుణరత్నె (నాటౌట్) 92, తరంగ (బి) ఉమేష్ 2, మెండిస్ (సి) సాహా (బి) హార్దిక్ 110, పుష్పకుమార (నాటౌట్) 2; **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 60 ఓవర్లలో 209/2; వికెట్ల పతనం:** 1-7, 2-198; **బౌలింగ్:** ఉమేష్ 9-2-29-1, అశ్విన్ 24-6-79-0, షమి 6-2-13-0, జడేజా 16-2-76-0, హార్దిక్ 5-0-12-1.

ఢిల్లీ మళ్లీ ఢమాల్

- ముంబా చేతిలో చిత్తు
- బుల్స్ జోరుకు యూపీ చెక్

ప్రొ కబడ్డీలో నేటి మ్యాచ్‌లు

STAR SPORTS 2	బెంగాల్ X యూపీ రాత్రి 8.గం
maa movies	బెంగళూరు X పట్నా రాత్రి 9.గం

నాగ్‌పూర్: ప్రొ కబడ్డీ లీగ్ ఐదో అంచెలో దబాంగ్ ఢిల్లీ వైఫల్యాల బాటలో నడుస్తోంది. ఆ జట్టు వరుసగా మూడో పరాజయాన్ని మూటగట్టుకుంది. శనివారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 22-36తో యు ముంబా చేతిలో చిత్తుగా ఓడిపోయింది. కెప్టెన్ అనూప్ కుమార్ ఏడు పాయింట్లతో ముంబాను ముందుండి నడిపించాడు. షబ్బీర్ బాపు (7) కూడా సత్తా చాటాడు. ఢిల్లీ కెప్టెన్ మిరాజ్ షేక్ కూడా ఏడు పాయింట్లతో సత్తా చాటినా.. సహచరుల నుంచి అతనికి సహకారం కొరవడింది. మరో మ్యాచ్‌లో యూపీ యోధా 32-27తో బెంగళూరు బుల్స్‌ను ఓడించి లీగ్‌లో రెండో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో నెగ్గి జోరు మీదున్న బుల్స్ జట్టుకు యూపీ చెక్ పెట్టింది. నితిన్ తోమర్ (9) యూపీ జట్టులో టాప్ స్కోరర్. కెప్టెన్ రోహిత్ కుమార్ (11) మరోసారి సూపర్-10 సాధించినా బెంగళూరును గెలిపించలేకపోయాడు.


ఢిల్లీ కెప్టెన్ మిరాజ్ రైడింగ్..


అంకుర్‌కు రెండు స్వర్ణాలు

న్యూఢిల్లీ: ఆసియా షాట్‌గన్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ అంకుర్ మిట్టల్ రెండు స్వర్ణాలు నెగ్గాడు. పురుషుల డబుల్ ట్రాప్ ఫైనల్లో అంకుర్ 71 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. ఇక టీమ్ విభాగంలోనూ అంకుర్, సంగ్రామ్ దాహియా, మహ్మద్ అసాబ్ త్రయం పసిడి పతకం ఖాతాలో వేసుకుంది.

ఆనంద్‌కు మూడో డ్రా

సెయింట్ లూయిస్ (యూఎస్ఏ): సింక్‌ఫీల్డ్ కప్ చెస్ టోర్నీలో భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్‌కు వరుసగా మూడో డ్రా ఎదురైంది. శుక్రవారం రాత్రి జరిగి న మూడో రౌండ్‌లో వరల్డ్ చాంప్ మాగ్నస్ కార్ల్‌సన్‌ను ఆనంద్ నిలువరించాడు. ఈ గేమ్‌లో తెల్లపావులతో ఆడిన ఆనంద్ 66 ఎత్తుల తర్వాత కార్ల్‌సన్‌తో పాయింట్ పంచుకున్నాడు.

సముద్రగర్భంలో అన్వేషణ..



సముద్ర గర్భంలోకి మనిషి!

6కి.మీ. లోతుకు వెళ్లేలా ప్రత్యేక క్రాఫ్ట్.. ఐదేళ్లలో రూపకల్పనకు ప్రణాళిక

- ఐదు అగ్ర దేశాల సరసన భారత్
- డిజైన్‌ను రూపొందించిన ఎన్ఐవోటీ

చెన్నై, ఆగస్టు 5: మానవ సహిత రోదసియానానికి నాంది పలికేలా జీఎస్ఎల్వీ-మార్క్3 రాకెట్ ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసిన భారత్ ఇప్పుడు మనిషిని సముద్రం అట్టడుగుకు తీసుకెళ్లేందుకు సన్నద్ధమవుతోంది. ఉపరితలం నుంచి ఆరు కిలోమీటర్ల లోతులోకి వెళ్లేలా ప్రత్యేక క్రాఫ్ట్ రూపకల్పనకు శ్రీకారం చుట్టబోతోంది. దీనికి సంబంధించిన ప్రాథమిక డిజైన్‌ను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ(ఎన్ఐవోటీ) శాస్త్రవేత్తలు రూపొందించారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఈ క్రాఫ్ట్‌ను రూపొందించేందుకు రూ.500 కోట్లు ఖర్చవుతుందని అంచనా. ఐదేళ్లలోగా పూర్తి చేయగలమని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇది పూర్తయితే ఈ తరహా టెక్నాలజీ ఉన్న ఐదు అగ్ర దేశాలు చైనా, అమెరికా, రష్యా, ఫ్రాన్స్, జపాన్ సరసన భారత్ చేరుతుంది. ఎన్ఐవోటీ రూపొందించిన డిజైన్ ప్రకారం 3.2 మీటర్ల వ్యాసంతో గోళాకార 'క్రాఫ్ట్'ను తయారు చేయనున్నారు. నౌకలో నుంచి దీనిని సముద్రంలోకి వదులుతారు. ఇందులో ముగ్గురు శాస్త్రవేత్తలు సముద్ర గర్భంలోకి వెళ్లొచ్చు. 8-10 గంటల పాటు ఉండి పరిశోధనలు జరపొచ్చు. అక్కడి నుంచి నమూనాల సేకరణకోసం ఓ రోబోటిక్ చేతినీ అమర్చనున్నట్లు తెలిపింది. ఈ క్రాఫ్ట్ డిజైన్‌కు కేంద్రం ఆమోదం లభించాల్సి ఉందని ఎన్ఐవోటీ డైరెక్టర్ సతీష్ షెనోయి తెలిపారు.

మూడేళ్లలో 'శాంపిల్' క్రాఫ్ట్

ప్రస్తుతం భారత్ సముద్ర గర్భంలో పరిశోధనల కోసం ఇంటర్నేషనల్ సీబెడ్ అథారిటీ సాయంతో పాలీమెటాలిక్ మాడ్యూల్స్‌ను వినియోగిస్తోంది. ఇవి మానవ రహిత పరికరాలు కావడంతో నమూనాల సేకరణ కష్టతరంగా మారుతోంది. దీంతో స్వదేశీ పరిజ్ఞానంతో 'మానవ సహిత క్రాఫ్ట్'ను రూపొందించాలని కేంద్రం భావిస్తోందని సతీష్ షెనోయి చెప్పారు. అయితే ఇంతటి భారీ ప్రయోగాన్ని చేపట్టే ముందు ఒక 'శాంపిల్' క్రాఫ్ట్‌ను తయారు చేయడం మేలని ఎన్ఐవోటీ భావన. 500 మీటర్ల లోతు వరకు మనిషిని తీసుకెళ్లగలిగేలా గోళాకార క్రాఫ్ట్‌ను రానున్న మూడేళ్లలో పూర్తి చేయనుంది.

'రైజ్'తో మేలు కొంతే!

తెలుగు రాష్ట్రాల వృత్తి నిపుణులకు మరిన్ని అవకాశాలు

- గ్రీన్‌కార్డు రాకపై స్పష్టత..
- మెరిట్ ఆధారంగా కేటాయింపు
- కంపెనీల బానిసత్వం నుంచి విముక్తి
- వలసదారులకు ఐదేళ్లదాకా వర్తించని సంక్షేమ పథకాలు
- ఇమిగ్రేషన్‌పై ట్రంప్ సర్కారు పట్టు



ఐదేళ్ల తర్వాతే 'సంక్షేమం'



వాషింగ్టన్, ఆగస్టు 5: ఇతర దేశాల నుంచి వలసలను నియంత్రించడమే లక్ష్యంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఒక్కొక్క అడుగే వేస్తున్నారు. వలసల తాకిడిని అడ్డుకునేందుకు ప్రతిభ ఆధారంగా గ్రీన్‌కార్డులివ్వాలన్న బిల్లుకు మద్దతు ప్రకటించిన ఆయన.. ఇప్పుడు వలసదారులకు ఉద్దేశించిన సంక్షేమ కార్యక్రమాల్లో కోతపెట్టారు. అమెరికాలోకి అడుగుపెట్టిన తర్వాత ఐదేళ్ల వరకు ఎలాంటి సంక్షేమ సబ్సిడీలు అడగరాదని వారికి షరతు విధించారు.

అమెరికాకు వచ్చి స్థిరపడాలనుకొనే వారిని కట్టడి చేసే దిశగా తీసుకుంటున్న చర్యలకు ట్రంప్ సర్కారు మరింత సానపెడుతోంది. రిఫార్మింగ్ అమెరికన్ ఇమిగ్రేషన్ ఫర్ స్ట్రాంగ్ ఎంప్లాయిమెంట్(రైజ్) పేరిట గత వారం సెనేట్‌లో ప్రవేశపెట్టిన బిల్లుపై విశ్వవ్యాప్తంగా చర్చ జరుగుతున్న సమయంలోనే.. కొందరు వీసా దరఖాస్తుదారుల నుంచి సోషల్ మీడియా అకౌంట్లు, ట్రావెల్ చరిత్రను తెలుసుకొనే ప్రశ్నావళి మరో మూడేళ్ల పాటు కొనసాగుతుందని ట్రంప్ సర్కారు ప్రకటించింది. అయితే, వలసదారులకు సంబంధించి ట్రంప్ సర్కారు తీసుకుంటున్న చర్యల ప్రభావం అమెరికాకు వెళ్లి స్థిరపడిన వారిపై, స్థిరపడాలనుకొనే వారిపై ఎలా ఉంటుందనే విషయంపై తెలుగు రాష్ట్రాల్లో సర్వత్రా ఆసక్తి నెలకొంది. అమెరికాలో ఉద్యోగాలు అమెరికన్లకే అనే నినాదంతో అధికారంలోకి వచ్చిన ట్రంప్ కొత్త వలస చట్టాల ద్వారా అక్రమ వలసదారులను అరికట్టడానికి పావులు కదుపుతున్నారు. రైజ్ చట్టం అమలులోకి వస్తే.. గ్రీన్‌కార్డుల జారీ కోసం ప్రస్తుతం అందుబాటులో ఉన్న విధానాలన్నీ తొలగిపోతాయి. మెరిట్ ఆధారంగా ఇచ్చే పాయింట్లను బట్టి ఈ కార్డులను జారీ చేస్తారు. ప్రస్తుతం గ్రీన్‌కార్డులను ప్రతి ఏడాది లాటరీ ఆధారంగా మంజూరు చేస్తున్నారు. గ్రీన్‌కార్డు పొందిన వారు తమ కుటుంబ సభ్యులను, పెళ్లికాని అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ములను స్పాన్సర్ చేయొచ్చు. ఇలా ప్రతి ఏడాది కొన్ని లక్షల మంది అమెరికాలోకి ప్రవేశిస్తున్నారని ఒక అంచనా. అంతేకాకుండా ప్రతి ఏడాది ఎన్ని గ్రీన్‌కార్డులను మంజూరు చేయాలనే విషయమ్మీద స్పష్టత లేదు. "నేను అమెరికాలో రెండు దశాబ్దాలుగా ఉన్నా. సాధారణంగా అధ్యక్ష ఎన్నికలు జరిగే ఏడాది ఎక్కువ గ్రీన్‌కార్డులు మంజూరవుతాయి. దరఖాస్తు చేసుకున్న తర్వాత ఎప్పుడు గ్రీన్‌కార్డు వస్తుందో ఎవరూ కచ్చితంగా చెప్పలేరు. కొత్త పద్ధతి వల్ల పంజాబ్, గుజరాత్ వంటి రాష్ట్రాలకు చెందిన వారు దెబ్బతింటారు. సాధారణంగా వీరు తమ కుటుంబ సభ్యులను చిన్నచిన్న ఉద్యోగాలు చేయటానికి తీసుకువస్తారు. మన దగ్గర నుంచి వచ్చే వారిలో ఎక్కువ మంది తమ తల్లిదండ్రులను మాత్రమే స్పాన్సర్ చేస్తారు. అందువల్ల తెలుగు రాష్ట్రాల వారికి సమస్య ఉండదు" అంటారు హ్యూస్టన్‌కు చెందిన విద్యాసాగర్. కాగా, ప్రతిపాదిత పాయింట్ వ్యవస్థ వల్ల తెలుగు ప్రొఫెషనల్స్‌కు ప్రయోజనం చేకూరుతుందని నిపుణులు భావిస్తున్నారు. రైజ్ అమలులోకి వస్తే ఇకపై గ్రీన్‌కార్డులు పొందాలనుకొనేవారికి ఇంగ్లిషు భాషానైపుణ్యం, విద్యార్హతలు, వయస్సు, అందుబాటులో ఉన్న ఉద్యోగ ఆఫర్ల ఆధారంగా పాయింట్లు ఇస్తారు. ఎక్కువ పాయింట్లు పొందిన వారికి గ్రీన్‌కార్డు త్వరగా వస్తుంది. దీంతో గ్రీన్‌కార్డుల కోసం కంపెనీలపై ఆధారపడటం తగ్గుతుందనేది నిపుణుల అభిప్రాయం.

కెనడా, ఆస్ట్రేలియా ఇమిగ్రేషన్ పద్ధతులే ఆధారం

భారత్ నుంచి ప్రతి ఏడాది దాదాపు 70వేల మంది విద్యార్థులు అమెరికాకు చదువుకోవడానికి వెళ్తారు. ప్రస్తుతం అక్కడ భారత విద్యార్థుల సంఖ్య 2.6 లక్షలు. ఏటా అమెరికా 85వేల హెచ్1బీ వీసాలు జారీ చేస్తుంది. అక్కడివర్సిటీల్లో చదువుకున్న వారికి ప్రత్యేక కోటా ఉంటుంది. చాలా కంపెనీలు తమ ఉద్యోగులకు ఈ కోటా కింద హెచ్1బీ వీసాలకు దరఖాస్తు చేస్తాయి.

సోషల్ మీడియా హిస్టరీ కూడా..

రైజ్ బిల్లును ప్రవేశపెట్టిన నేపథ్యంలోనే.. ట్రంప్ సర్కారు మరో కీలకమైన నిర్ణయం తీసుకుంది. వీసాల జారీ చేసే సమయంలో దరఖాస్తుదారుడి నుంచి అదనంగా సమాచారాన్ని సేకరించటానికి వెసులుబాటును మరో మూడేళ్ల పొడిగించింది. ట్రంప్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు దేశాలకు చెందిన పౌరుల దగ్గర నుంచి అదనపు సమాచారాన్ని సేకరించటానికి ఇమిగ్రేషన్ శాఖ ఒక ప్రశ్నావళిని తయారుచేసింది. ఇందులో దరఖాస్తుదారుడికి పాస్‌పోర్టు, సోషల్ మీడియా అకౌంట్, ఈ-మెయిల్, లోగడ సందర్శించిన దేశాల వివరాలను నింపాల్సి ఉంటుంది. దీనిని ఇప్పటిదాకా ఆ ఆరు దేశాలకు చెందిన పౌరుల నుంచి అదనపు సమాచారాన్ని సేకరించటానికి ఉపయోగిస్తామని అప్పట్లో ఇమిగ్రేషన్ శాఖ ప్రకటించింది. ఈ ప్రశ్నావళి వాడకాన్ని మరో మూడేళ్లు పొడిగిస్తూ తాజాగా ట్రంప్ సర్కారు ఆదేశాలు జారీ చేసింది.

హెచ్1బీల్లో మనవాళ్లే అధికం

మన దేశం నుంచి ఏయే కంపెనీల నుంచి ఎక్కువ హెచ్1బీ వీసాలను పొందుతున్నారనే సమాచారాన్ని అమెరికా పౌరసత్వ వలసల విభాగం తొలిసారి విడుదల చేసింది. గత ఏడాది హెచ్1బీ వీసాల కోసం ప్రపంచ వ్యాప్తంగా నాలుగు వేల కంపెనీలు దరఖాస్తు చేశాయి. వీటిలో 37% వీసాలను 20 కంపెనీలు పొందాయి. వీటిలో భారత్‌కు చెందిన కంపెనీలూ ఉన్నాయి. ఇప్పటి దాకా కంపెనీలు తాము ఎంత మందికి హెచ్1బీ వీసాల కోసం అప్లై చేశామనే విషయాన్ని చెప్పటానికి నిరాకరించేవి. సమాచార స్వేచ్ఛ చట్టం కింద దరఖాస్తు చేసి వివరాలు తెలుసుకోవాల్సి వచ్చేది. ఈ సమాచారాన్ని ప్రభుత్వమే బయట పెట్టడం వల్ల మరింత పారదర్శకత వస్తుందని భావిస్తున్నారు.

41 శాతం తగ్గనున్న వలసదారులు

రైజ్ బిల్లు అమల్లోకి వస్తే వలసదారులు వచ్చిన ఐదేళ్ల వరకూ వారికి ఎటువంటి వెల్ఫేర్ పథకాలు వర్తించవు. బిల్లును ప్రవేశపెట్టిన సెనేటర్ కాటన్ వాదన ప్రకారం.. అమెరికాకు వలస వస్తున్న ప్రతి 15 మందిలో అత్యుత్తమ నైపుణ్యం ఉన్నవారు ఒక్కరే. ఈ పదిహేను మందిలో సగం మంది సంక్షేమ పథకాల వల్ల లబ్ధి పొందుతున్నారు.

హార్వర్డ్‌పై దర్యాప్తు

మంచి మార్కులు వచ్చిన విద్యార్థులకు జాతి వివక్ష కారణంగా హార్వర్డ్ సహా మరికొన్ని వర్సిటీలు అడ్మిషన్లు ఇవ్వలేదని దాఖలైన ఫిర్యాదుపై దర్యాప్తు చేస్తామని ట్రంప్ సర్కారు ప్రకటించింది. 64 ఆసియన్-అమెరికన్ అసోషియేషన్లు తమ దేశాలకు చెందిన విద్యార్థులపై వివక్ష చూపుతున్నారని 2015లో ఒబామా సర్కారుకు ఫిర్యాదు చేశాయి. వీటిలో మన దేశస్థులకు ప్రాతినిధ్యం వహిస్తున్న నాలుగు సంస్థలు కూడా ఉన్నాయి. దీనిపై ఒబామా సర్కారు స్పందించలేదు. ట్రంప్ సర్కారు దీనిపై దర్యాప్తుకు ఆదేశించటం పట్ల ఫిర్యాదు చేసిన సంస్థలు హర్షం ప్రకటించాయి. - స్పెషల్ డెస్క్.

20 ఏళ్ల తర్వాత పాక్‌లో హిందూ మంత్రి

మంత్రిగా దర్శన్‌లాల్ ప్రమాణం



ఇస్లామాబాద్, ఆగస్టు 5: రెండు దశాబ్దాల విరామం తర్వాత పాకిస్థాన్ కేబినెట్లో తొలిసారిగా ఒక హిందువుకు చోటు దక్కింది. ఆయన పేరు దర్శన్‌లాల్(65). శుక్రవారం కొలువుదీరిన షాహిద్ ఖకాన్ అబ్బాసీ నేతృత్వంలోని కొత్త సర్కారులో దర్శన్‌లాల్ మంత్రిగా ప్రమాణం చేశారు. పాక్‌లోని నాలుగు రాష్ట్రాల సమన్వయ బృందానికి ఆయన అధిపతిగా ఉంటారు. సింధ్ రాష్ట్రం మిర్‌పూర్ మథె పట్టణంలో డాక్టర్‌గా పని చేస్తూ రాజకీయాల్లోకి వచ్చారు.

2 వారాల్లో పరిమిత దాడి

- భారత్‌కు ముందే చెప్పి చేస్తాం.. ఆక్రమణలు ఖాళీ చేయిస్తాం
- యుద్ధమొస్తే మొత్తాన్ని పారదోలుడే.. చైనా అధికార పత్రిక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఆగస్టు 5: డోక్లాం వద్ద చైనా భూభాగంలోకి చొచ్చుకు వచ్చిన భారతీయ సైనికులను వెళ్లగొట్టేందుకు రెండు వారాల్లో పరిమిత స్థాయి సైనిక చర్య చేపట్టే అవకాశం ఉందని చైనా అధికార పత్రిక గ్లోబల్ టైమ్స్ వ్యాఖ్యానించింది. తమ సైన్యం శక్తి సామర్థ్యాలను మోదీ గుర్తుంచుకుంటే మంచిదని, యుద్ధం విస్తరించే పరిస్థితి వస్తే మాత్రం సరిహద్దుల్లో ఉన్న మొత్తం భారత సైన్యాన్ని పారదోలగలమని హెచ్చరించింది. అసలు భారత సరిహద్దు బలగాలు ఏ రకంగా చూసినా తమకు సమఉజ్జీ కావని వ్యాఖ్యానించింది. తమ సైన్యం దగ్గరున్న మందుగుండు, ఇతర సైనిక సామగ్రి అపారమనే విషయాన్ని మోదీ గుర్తెరగాలని చెప్పింది. భారత్ మంకుపట్టు పడుతోందని, దానికి ఎలాంటి చట్టపరమైన ప్రాతిపదిక లేదని వ్యాఖ్యానించింది. చైనా సరిహద్దుల్లో భారత సైన్యాన్ని ఖాళీ చేయించడానికి ముందు భారత విదేశాంగ శాఖకు సమాచారం ఇస్తుందని తెలిపింది. కొంతకాలంగా భారత్ చైనా విషయంలో అపరిపక్వ విధానాన్ని అవలంబిస్తోందని, భారత్ అభివృద్ధి చైనా అభివృద్ధికి దీటుగా లేదని వ్యాఖ్యానించింది.


పెళ్లి, మతం.. ఆమె ఇష్టం కాదా?

- 24 ఏళ్ల యువతికి ఆ హక్కు లేదా?.. సుప్రీంకు తొలి లవ్‌జిహాద్ కేసు

న్యూఢిల్లీ, ఆగస్టు 5: లవ్‌జిహార్ పెళ్ళిళ్ళకు సంబంధించిన కేసు తొలిసారి సుప్రీంకోర్టులో విచారణకు వచ్చింది. అఖిల అనే హిందూయువతి మతంమారి తనను పెళ్లాడటాన్ని కేరళ హైకోర్టు తప్పుబట్టడంపై ఆమె భర్త షాఫిన్ జహాన్ సుప్రీంకోర్టుని ఆశ్రయించారు. "ఆమెకు 24 ఏళ్లు. తాను ఎవరిని పెళ్లాడాలి, ఏ మత విశ్వాసాలను పాటించాలనేది నిర్ణయించుకొనే హక్కు ఆమెకు ఉంది" అని ఆయన వాదించారు. తమ నిఖాని అతిపెద్ద లవ్‌జిహాద్ కుట్రగా కేరళ హైకోర్టు పరిగణించడం సరికాదన్నారు. దీనిపై శుక్రవారం చీఫ్ జస్టిస్ జేఎస్ ఖేహర్, జస్టిస్ చంద్రచూడ్‌ల బెంచ్ విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపున ప్రముఖ న్యాయవాదులు కపిల్ సిబల్, ఇందిరా జైసింగ్ వాదనలు వినిపించారు. "కేరళ హైకోర్టు తీరు విచారకరం. పెళ్లిని ఆమోదించకపోవడమే కాదు, వారిద్దరు కలుసుకోవడానికి కూడా అనుమతి ఇవ్వలేదు" అని బెంచ్ దృష్టికి తీసుకొచ్చారు. పిటిషనర్ భార్యను ఆమె తల్లిదండ్రుల ఇంట్లో బందీచేశారని, 24 గంటల్లో కోర్టులో ప్రవేశపెట్టేలా ఆదేశాలివ్వాలని, తర్వాత ఆమె అభీష్టాన్ని తెలుసుకోవాలని బెంచ్‌కు విజ్ఞప్తి చేశారు. వారిద్దరి బంధంపై కేరళ హైకోర్టు లేవనెత్తిన అనుమానాల్లో పస ఉందని బెంచ్ అభిప్రాయపడింది. "మీరు కోరినట్టు ఆదేశాలివ్వడం అంత తేలిక కాదు. మతం మారిన అఖిలకు ఆసియా, అదియా, హదియా అని మూడుపేర్లు ఎందుకు పెట్టారు? హైకోర్టుకు సమర్పించిన ఒక్కో అఫిడవిట్‌లో ఒక్కో పేరు ఉంది. దీన్నిబట్టి ఆమెకు 24 ఏళ్లు ఉంటాయని అనుకోలేం. ఇదొక సున్నిత అంశం అనేది మరవరాదు" అని బెంచ్ పేర్కొంది. దీనిపై పది రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఎన్ఐఏ ఆదేశించింది.

మీవల్ల నెహ్రూకు ఎన్ని ఇబ్బందులో!

- శిఖరాగ్ర భేటీలో మావోను దులిపేసిన కృశ్చేవ్!


కృశ్చేవ్

బీజింగ్, ఆగస్టు 5: చైనా-రష్యాల మధ్య స్నేహ సంబంధాలు తెగిపోవడానికి 1959 నాటి భారత్-చైనా సరిహద్దు గొడవలే కారణమని హాంకాంగ్ పత్రిక ఒకటి వెల్లడించింది. ఆ ఏడాది సోవియట్ యూనియన్ అధినేత నికితా కృశ్చేవ్ చైనాలో పర్యటించారు. భారత్‌తో ఘర్షణలో చైనాదే తప్పని మావో జెడాంగ్‌కు మొహం మీదే చెప్పారు. భారత ప్రధాని నెహ్రూ ఏ తప్పూ చేయలేదన్నారు. ఆ సమావేశం 1959 సెప్టెంబరు నెలలో హాట్‌హాట్‌గా సాగింది. చైనా దాడి వల్ల భారత్‌లో నెహ్రూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కృశ్చేవ్ మండిపడ్డారు. చైనా కూడా ఏ మాత్రం తగ్గలేదు. సోవియట్ భారత్ కొమ్ము కాస్తోందని మావో ఆరోపించారు. తర్వాత చైనా అమెరికాకు దగ్గరైంది.

దాడిపై నిరసనలొద్దు!

గుజరాత్‌లో వరద సాయం చేయండి

కాంగ్రెస్ కార్యకర్తలకు రాహుల్ పిలుపు



న్యూఢిల్లీ, ఆగస్టు 5: గుజరాత్‌లో తనపై జరిగిన దాడికి నిరసనగా చేపడుతున్న కార్యక్రమాలను నిలిపేయాలని కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ పార్టీ కార్యకర్తలను కోరారు. అందుకు బదులుగా గుజరాత్ వరద బాధితులకు సహాయ కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. రాహుల్‌పై దాడి నేపథ్యంలో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు శుక్ర, శనివారాల్లో నిరవధిక నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దాడికి సంబంధించి శనివారం జయేశ్ దర్జీ అలియాస్ అనీల్ రాథోడ్ అరెస్టయ్యాడు. అతను బీజేపీ యువజన విభాగం స్థానిక నేత అని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. కాంగ్రెస్ వాళ్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకే అతన్ని అరెస్టు చేశామని పోలీసులు చెబుతున్నారు. రాహుల్‌గాంధీ వాహనంపై దాడిచేసిన ముగ్గురిపై తాము ఫిర్యాదు చేశామని కాంగ్రెస్ నేతలు తెలిపారు. దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. దాడికి సంబంధించి విజయ్ రూపాణీ ప్రభుత్వం అసలు కేసే పెట్టలేదని మండిపడుతోంది. వరద బాధిత ప్రాంతాల సందర్శనకు వచ్చిన రాహుల్‌కు బీజేపీ కార్యకర్తలు నల్లజెండాలతో నిరసన తెలిపారు. ఇదే సమయంలో ఆయన కారు అద్దం మీద ఎవరో సిమెంట్ పెళ్ల విసిరి అద్దం పగులగొట్టారు. రాహుల్ ముందుసీట్లో ఉండటంతో ఆయనకు గాయం కాలేదు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.